
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 75

మంగళవారం 6-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మొదట అక్కడ సేంద్రియ వ్యవసాయం మొదలైంది.
తర్వాత స్త్రీలు సేంద్రియ తినుబండారాలు మొదలుపెట్టారు.
రేకుల షెడ్డే వారి వంటశాల.
అరవై పైబడిన **బసవ పూర్ణమ్మ** వారి మేస్త్రి.
రాగి లడ్డు, జొన్నలడ్డు, నల్ల అరిసెలు, నువ్వుండలు... ఆ కారం... ఈ పచ్చడి...
ఎక్కడా రసాయనాల ప్రస్తావన ఉండదు.
ఆముదం, కాటుక, కుంకుమ కూడా తయారు చేస్తున్నారు.
వీరికి ఆర్డర్లు భారీగా ఉన్నాయి.
గుంటూరు జిల్లాలోని ఒక చిన్న ఊరు స్త్రీల వల్ల కరకరలాడుతోంది.
కళకళలాడుతోంది.

తూములూరు రుచులు ఊరు

2018లో మొదలైంది ఈ కథ.

'అమ్మా... మేము పండిస్తున్న సేంద్రియ పంటలకు మంచి డిమాండ్ వస్తోంది. కాని ఇవే సేంద్రియ పదార్థాలతో చిరుతిండ్లు చేయించి అమ్మమని అందరూ అడుగుతున్నారు. నువ్వు తయారు చేస్తావా?' అని అడిగాడు అవుతు వెంకటేశ్వర రెడ్డి తన తల్లి బసవ పూర్ణమ్మతో. ఆమెకు పల్లెటూరి పిండి వంటలు చేయడం వచ్చు. పండగలకు పబ్బాలకు పల్లెల్లో ఎవరు మాత్రం చేయరు? 'అదెంత పనిరా చేస్తాను' అంది.

అలా గుంటూరు జిల్లాలోని కొల్లిపరకు ఆనుకుని ఉండే తూములూరు అనే ఊళ్లో సేంద్రియ చిరుతిళ్ల తయారీ మొదలైంది. బసవ పూర్ణమ్మ ఇంటిలో వేపచెట్టు కింద ఉండే పశువుల కొట్టాం కాస్తా వంటల షెడ్డుగా మారింది. ఊళ్లో వంటలు చేయడం ఆసక్తి ఉన్న స్త్రీలకు ఇదొక ఉపాధిగా ఉంటుందని వారిని తోడుకమ్మని ఆహ్వానించింది బసవ పూర్ణమ్మ. అలా 'విలేజ్ మాల్' అనే బ్రాండ్‌తో 'కొల్లిపర మండల వ్యవసాయదారుల సంఘం' అనే లేబుల్ కింద తూములూరు చిరుతిండ్ల తయారీ మొదలైంది.

రసాయనాలు లేని తిండి

'మా అబ్బాయీ, ఇంకొంత మంది రైతులు 2015 నుంచి కొల్లిపర చుట్టుపక్కల ఊళ్లలో సేంద్రియ పద్ధతిలో వరి, పసుపు,అరటి, నిమ్మ పండించడం మొదలుపెట్టారు. వీళ్లకు 'గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం' అనే సంఘం ఉంది. రైతులంతా కలిసి ఒకరికొకరు మద్దతు ఇచ్చుకుంటూ పంటను మంచి రేటుకు అమ్ముతున్నారు. ఆ సమయంలోనే మార్కెట్‌లో కల్తీ నూనెలతో, పిండ్లతో తయారై వస్తున్న పిండి వంటలు తినలేక సేంద్రియ పిండివంటల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. మా అబ్బాయి ప్రోత్సాహంతో రంగంలోకి దిగాను. మొదట వేరుశనగ ఉండలు చేశాం. నిడదవోలు, మాండ్య లాంటి చోట్ల నుంచి సేంద్రియ బెల్లం తెప్పించి చేశాం. రుచి భలే ఉండటంతో డిమాండ్ వచ్చింది. అలా ఒక్కోటి పెంచుకుంటూ వెళ్లాం. ఇవాళ 30 రకాల చిరుతిళ్లు తయారు చేస్తున్నాం' అని చెప్పింది బసవపూర్ణమ్మ. రాగిలడ్డు, జొన్న లడ్డు, నల్లబియ్యం అరిసెలు, నువ్వుండలు, పప్పుండలు, జంతికలు, కొబ్బరి లడ్డు, చెక్కలు ఇవి కాకుండా కరివేపాకు కారం, మునగాకు కారం వీరు తయారు చేస్తున్నారు. ఇక మామిడి, గోంగూర పచ్చడి గుంటూరు జిల్లా ప్రత్యేకం. అవీ చేస్తున్నారు. 'సేంద్రియ నూనె పేరుతో అమ్ముతున్న నూనెలు కూడా కరెక్ట్‌గా లేవు. చాలా నూనెలు ట్రై చేసి రాజస్థాన్‌లో ఒక చోట నుంచి మంచి సేంద్రియ నూనె తెప్పించి ఈ పిండి వంటలకు వాడుతున్నాం' అని తెలిపింది బసవ పూర్ణమ్మ.

ఆమె అజమాయిషీలో సాగే వంటశాలకు వెళితే చెట్టు కింద కట్టెలపొయ్యి మీద ఆముదం గింజలు కుతకుత ఉడికిస్తుంటారు కొందరు. వరండాలో జీడిపాకం ఆరబెట్టి, ఉండలు చుడుతుంటారు కొందరు. చిరుధాన్యాలతో లడ్డూలు, నల్లబియ్యంతో అరిసెలు చేస్తారు మరికొందరు. అంతా కళకళగా ఉంటుంది.

ఆముదం, కుంకుమ

'మార్కెట్‌లో సిసలైన ఆముదం దొరకడం లేదు. మా చిన్నప్పుడు ఎవరి ఆముదం వారే తయారు చేసుకునేవాళ్లం. అందుకనే ఆముదం కూడా తయారు చేస్తున్నా. లీటరు 800 పెట్టినా ఎగరేసుకుని పోతున్నారు. పసుపు నుంచి కుంకుమ తయారు చేసే పద్ధతి ఉంది. అలా స్వచ్ఛమైన కుంకుమ తయారు చేస్తున్నా. ఆముదం గింజల నుంచే కాటుక తయారు చేయవచ్చు. అదీ చేస్తున్నా. మా చిరుతిండ్ల కంటే వీటిని ఎక్కువమంది మెచ్చుకుని కొనుక్కుంటున్నారు' అని తెలిపింది బసవపూర్ణమ్మ. ఈ మొత్తం పనిలో పదిహేను మంది ప్రత్యక్షంగా మరో పదిహేనుమంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

కోటి టర్నోవర్‌కు...

వచ్చే మార్చికంతా కోటి టర్నోవర్‌కు ఈ పిండి వంటల పరిశ్రమ చేరుకోవచ్చని అంచనా. తూములూరు పిండి వంటలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని చాలా కేంద్రాల్లో అమ్ముడుపోతున్నాయి. కొందరు సరుకు తీసుకుని తమ బ్రాండ్ వేసుకుని అమ్ముకుంటున్నారు. సరుకు రవాణ మొత్తం ఆర్.టి.సి. కార్గో మీద ఆధారపడటం విశేషం. గో ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల సంఘం నగరాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో తూములూరు పిండివంటల స్టాల్ కచ్చితంగా ఉంటోంది. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నిర్వహించే సమావేశాలకూ ఈ పిండివంటలనే ఆర్డరు చేస్తున్నారు.

'ఈ రోజుల్లో ఆడవాళ్లకు పిండివంటలు చేసుకోవటం కష్టమవుతోంది. దీనికితోడు రసాయన అవశేషాలు లేని ఆహారపదార్థాలు దొరకటం దుర్లభంగా తయారైంది. అందుకే మాకు డిమాండ్ వస్తోంది. మరింతమంది రైతులను కలుపుకుని సేంద్రియ పంటలతో పిండివంటలను పరిశ్రమ స్థాయికి చేర్చాలనే ఆలోచన సంఘ సభ్యుల్లో ఉంది. అప్పుడు మా వంటశాలను విస్తరించాల్సి వస్తుంది' అని తెలిపింది బసవ పూర్ణమ్మ.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి


వంటశాలలో చిరుతిండ్ల తయారీ...


తాము తయారుచేసిన చిరుతిండ్లతో మహిళలు

కిచెన్ టిప్స్

- పండిన అరటిపండు గుజ్జు, కొద్దిగా పెరుగు వేసి చపాతీ పిండిని ముద్దగా కలిపితే చపాతీలు మరింత మృదువుగా మెత్తగా, రుచికరంగా ఉంటాయి.
- సమోసా పిండిలో కొద్దిగా నిమ్మరసం వేసి కలిపితే సమోసాలు మరింత క్రిస్పీగా కరకరలాడతాయి.





ఫ్యాషన్ బ్లాగర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది దిల్లీకి చెందిన డాలీసింగ్. రైటర్, స్టైలిస్ట్, కంటెంట్ క్రియేటర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయపథంలో దూసుకుపోతోంది. 'మనలో ఉన్న శక్తి ఏమిటో మనం చేసే పనే చెబుతుంది' అంటున్న 29 సంవత్సరాల డాలీసింగ్‌కు పనే బలం. ఆ బలమే తన విజయ రహస్యం...

నవ్వుల పువ్వుల దారిలో...

డాలీసింగ్ మాట్లాడితే చుట్టుపక్కల నవ్వుల పువ్వులు పూయాల్సిందే! ఆమె ఏం మాట్లాడినా సూటిగా ఉంటుంది. అదే సమయంలో ఫన్నీగా ఉంటుంది. 'స్పిల్ ది సాస్' అనే ఫ్యాషన్ బ్లాగ్‌తో ప్రయాణం మొదలు పెట్టింది. లైఫ్‌స్టైల్ పోర్టల్ 'ఐ–దివ' కోసం జూనియర్ రైటర్, స్టైలిస్ట్‌గా పనిచేసింది.

'రాజు కీ మమ్మీ' ఫన్నీ వీడియోలతో కంటెంట్ క్రియేషన్‌లోకి అడుగుపెట్టింది. ఈ వీడియోలు ఎంతో పాపులర్ అయ్యాయి. రోజువారి జీవితం నుంచే తన ఫన్నీ వీడియోలకు కావాల్సిన స్టఫ్‌ను ఎంపిక చేసుకునేది.

'బయట ఏదైన ఆసక్తికరమైన దృశ్యం కంటపడితే నోట్ చేసుకునేదాన్ని. ఆ తరువాత డెవలప్ చేసేదాన్ని. మనలోని శక్తి ఏమిటో మన రచనల్లో తెలిసిపోతుంది. రచన చేయడం అనేది నాకు ఎంతో ఇష్టమైన పని. ఎప్పటికప్పుడూ కొత్త కొత్త క్యారెక్టర్లను సృష్టించడానికి ప్రయత్నిస్తాను. ఐ–దివలో పనిచేస్తున్నప్పుడు స్క్రిప్ట్ రెడీ చేసుకోవడం అంటూ ఉండేది కాదు. ఒక టాపిక్ అనుకొని కెమెరా ముందుకు వచ్చి తోచినట్లుగా మాట్లాడడమే. ఆ తరువాత మాత్రం స్క్రిప్ట్ రాయడం మొదలైంది' అంటుంది డాలీ సింగ్. కామెడీ అయినా సరే, ప్రేక్షకులు కొత్తదనాన్ని కోరుకుంటున్నారు. కాల్పనిక హాస్యం కంటే నిజజీవిత సంఘటనల నుంచి తీసుకున్న కామెడీనే ఇష్టపడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని పంచ్‌లైన్స్ విషయంలో రకరకాలుగా ఎక్సర్‌సైజ్‌లు చేస్తుంటుంది డాలీ.

'ప్రేక్షకులను మెప్పించడం అనేది ఫన్ అండ్ చాలెంజింగ్‌గా ఉంటుంది. రెండు మూడు నెలలకు ఒకసారి రీస్టార్ట్ కావాల్సిందే. కంటెంట్ క్రియేషన్‌లో అతి ముఖ్యమైనది ఎప్పటికప్పుడు మనల్ని మనం పునరావిష్కరించుకోవడం' అంటుంది డాలీ.

తాము క్రియేట్ చేయాలనుకునేదానికీ, ప్రేక్షకులు ఇష్టపడుతున్న కంటెంట్‌కూ మధ్య కంటెంట్ క్రియేటర్ సమన్వయం సాధించాల్సి ఉంటుంది. మరి డాలీ సంగతి?

'అనేకసార్లు నిరాశపడిన సందర్భాలు ఉన్నాయి. మొదట్లో... నేను క్రియేట్ చేసేది ప్రేక్షకులకు నచ్చేది కాదు. వారికి నచ్చేది నాకు నచ్చేది కాదు. దీంతో ప్రేక్షకుల అభిరుచికి ప్రాధాన్యత ఇవ్వడం, ప్రేక్షకులు ఏం కోరుకుంటున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మొదలుపెట్టాను' అంటుంది డాలీ.

కంటెంట్ క్రియేటర్‌లకు ఒత్తిడి అనేది సర్వసాధారణం. 'ఒత్తిడిని పనిలో భాగంగానే భావించాను. దాని నుంచి దూరం జరగడం అనేది కుదిరే పని కాదు. అయితే ఒత్తిడి ప్రభావం కంటెంట్‌పై పడకుండా జాగ్రత్త పడాలి' అంటుంది డాలీ. ఫ్యాషన్ బ్లాగర్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా గుర్తింపు పొందిన డాలీ అమెజాన్ ప్రైమ్ వీడియో వెబ్‌సిరీస్ 'మోడ్రన్ లవ్ ముంబై'తో నటిగా మంచి మార్కులు తెచ్చుకుంది.

'నేను విజయం సాధించాను అనుకోవడం కంటే, ఇప్పుడే బయలుదేరాను అనుకుంటాను. అప్పుడే ఫ్రెష్‌గా ఆలోచించడానికి, మరిన్ని విజయాలు సాధించడానికి వీలవుతుంది' అంటున్న డాలీసింగ్ ఒక షార్ట్‌ఫిల్మ్ కోసం స్క్రిప్ట్ రెడీ చేసుకుంటోంది. అందులో తానే నటించనుంది.

మల్టీ టాలెంట్


డాలీసింగ్

సాగుబడి
మృగశిర కార్తె: జూన్ 8 నుంచి

ఆరుబయటే ఆరబెట్టి, నెట్టు కట్టొచ్చు!

- అత్యాధునిక బబుల్ డ్రయర్లు, కకూన్లతో ఎటువంటి విష రసాయనాలు వాడకుండానే ఇది సాధ్యం
- వరి ధాన్యం, మొక్కజొన్నలు, వేరుశనగలు.. విత్తనాలను సైతం బబుల్ డ్రయ్యర్ సమతుల్యంగా, సురక్షితంగా, సులువుగా ఆరబెడుతుంది..
- తాత్కాలిక గోదాముల (కకూన్ల)లో వ్యవసాయోత్పత్తులను పాడవ్వకుండా నిల్వ చేసుకోవచ్చు

రైతు కష్టాలు పంటల సాగులోనే కాదు, కోత అనంతరమూ కొనసాగుతాయి. వరి ధాన్యం, మొక్కజొన్నలు, మిరపకాయలు వంటి పంటలు ఏవైనా సక్రమంగా ఆరబెట్టుకొని జాగ్రత్త చేస్తేనే రైతుకు ఉన్నంతలో సరైన ధర దక్కుతుంది. అయితే, ధాన్యం, మొక్కజొన్నలు, మిరపకాయలు వంటి పంటలను సక్రమంగా ఆరబెట్టడం రైతులకు కష్టమైపోతోంది. మార్కెట్ యార్డుల్లో ఆరుబయట ధాన్యం కుప్పలు పోసుకొని ఎన్నో రోజులు ఎదురు చూడాల్సిన దుస్థితి మన రైతులు ఎదుర్కొంటుండటం విషాదకరం. ఒకటికి మూడు దఫాలు అకాల వర్షాలు విరుచుకుపడిన ఈ సంవత్సరం.. తడిచిన ధాన్యం బస్తాకు పది కిలోల తరుగు తీసేసి విక్రయించుకోవాల్సిన పరిస్థితులు కూడా రైతులకు ఎదురయ్యాయి. ఈ ఆధునిక కాలంలోనూ చేతికొచ్చిన పంటను చేజేతులా వానపాలు చేసుకొని వృథా చేసుకొని కష్టనష్టాలకు గురవ్వాల్సిందేనా...?

ముమ్మాటికీ లేదు!

వ్యవసాయోత్పత్తులను చక్కగా ఆరబెట్టుకునే అత్యాధునిక సాంకేతికతతో కూడిన 'మొబైల్ బబుల్ డ్రయ్యర్లు', ఆరుబయటే సురక్షితంగా నిల్వ చేసుకునే 'తాత్కాలిక గోదాములు' అందుబాటులోకి వచ్చేశాయి. నూర్చిన పంటను పొలాల దగ్గరే వేగంగా, సక్రమంగా, సులువుగా తక్కువ ఖర్చుతోనే 'బబుల్ డ్రయ్యర్ల'తో ఆరబెట్టుకోవచ్చు.

'ఇరి' పరిశోధనలు

ఫిలిప్పీన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఇరి–ఐఆర్‌ఆర్‌ఐ), జర్మనీకి చెందిన హొహెన్‌హీమ్ యూనివర్సిటీ, గ్రెయిన్‌ప్రో కంపెనీతో కలసి పరిశోధించి రూపొందించిన ఈ డ్రయ్యర్లు ఇప్పటికే అనేక దేశాల్లో రైతులు వినియోగిస్తున్నారు. వరి ధాన్యంతో పాటు మొక్కజొన్నలు, చిరుధాన్యాలు, మిరపకాయలు వంటి ఆహారోత్పత్తులను వర్షం, పశువులు, పక్షుల బెడద లేకుండా చక్కగా ఆరబెట్టుకుంటున్నారు.

'ఇరి' శాస్త్రవేత్త డా. మార్టిన్ గమ్మెట్ మాటల్లో చెప్పాలంటే.. పరదాలపైన, రోడ్లపైన ధాన్యాలను ఆరబెట్టుకునే రైతులు 15–30% వరకు ధాన్యాలను రైతులు నష్టపోతున్నారు. నాణ్యత క్షీణించటం వల్ల రైతుకు మంచి ధర దక్కటం లేదు. వరి ధాన్యాన్ని కంబైన్ హార్వెస్టర్‌తో నూర్చిన తర్వాత తేమ 20–24% వరకు ఉంటుంది. ఆ ధాన్యాన్ని బూజు పట్టకుండా, పురుగు పట్టకుండా నిల్వ చేయాలంటే తేమ శాతం 14కి తగ్గే వరకు ఆరబెట్టాలి. 'ఇరి'లో పరిశోధనలు, ప్రమాణీకరణ పూర్తయిన తర్వాత ఈ సోలార్ బబుల్ డ్రయ్యర్లను 2016 నుంచే దక్షిణాసియా దేశాల్లో వినియోగిస్తున్నారు. ఈ అత్యాధునిక డ్రయ్యర్లు ప్రస్తుతం భారత్‌లో కూడా అందుబాటులోకి వచ్చాయి.

కోత అనంతర వృథా 31%

చేతికి వచ్చిన ఆహార ధాన్యాలు తేమ ఆరబెట్టుకొని అమ్ముకునే లోగా 14%, వ్యాపారులు, వినియోగదారుల చేతుల్లో మరో 17% (మొత్తం 31%) వృథా అవుతోంది. ఇలా వృథా అయ్యే ఆహారం విలువ 40 వేల కోట్ల డాలర్ల మేరకు ఉంటుందని ఐరాసకు చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) లెక్కగట్టింది. ప్రపంచంలో 82.8 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ ఆకలితో అలమటిస్తున్న నేపథ్యంలో ఆహార వృథా ఇంత ఎక్కువగా జరుగుతూ ఉండటం మన మనసులను కలచి వేసే కఠోర వాస్తవం.

బబుల్ డ్రయ్యర్‌ను రైతులే నిర్వహించుకోవచ్చు

ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా ఆహార ధాన్యాలను పరిశుభ్రంగా, సురక్షితంగా, తక్కువ ఖర్చుతో ఆరబెట్టుకోవడానికి సోలార్ బబుల్ డ్రయ్యర్ ఉపయోగపడుతోంది. బబుల్ డ్రయ్యర్ సోలార్‌తో నడిచే మోడల్‌తో పాటు, విద్యుత్‌తో నడిచే మోడల్ కూడా ఉంది. వాడుతున్నప్పుడు పైకి చూడటానికి పొడవాటి బుడగ మాదిరిగా, లోపల కందకం మాదిరిగా ఉంటుంది. యూవీ రెసిస్టెంట్ పాలీఎథిలిన్ టాప్ కవర్, బ్లాక్ పీవీసీ డ్రైయింగ్ ఫ్లోర్ ఉంటాయి. టార్పాలిన్ పరదా మాదిరిగా చుట్టి దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్ల వచ్చు. చదునుగా ఉన్న నేల మీద పరుచుకొని రకరకాల వ్యవసాయోత్పత్తులను ఆరబెట్టుకోవచ్చు. పని పూర్తయిన తర్వాత మళ్లీ మడచి తీసుకెళ్లిపోవచ్చు. టెక్నీషియన్లు అవసరం లేదు. రైతులే దీన్ని నిర్వహించుకోవచ్చు.

గ్రెయిన్‌ప్రో సంస్థ రైతులకు అందుబాటులోకి తెచ్చిన చిన్న బబుల్ డ్రయ్యర్ వెడల్పు 2 మీటర్లు, పొడవు 15 మీటర్లు ఉంటుంది. పెద్ద బబుల్ డ్రయ్యర్ పొడవు 26 మీటర్లు. ఈ రెంటిలోనూ విద్యుత్‌తో నడిచే వాటితో పాటు సౌర విద్యుత్తుతో పనిచేసేవి కూడా ఉన్నాయి. గంటకు ఒక శాతం తేమను తగ్గించగలుగుతాయని గ్రెయిన్ ప్రో సంస్థ దక్షిణాది ప్రతినిధి గోపీనాథ్ వడివేలు 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

బ్యాచ్‌కు 6-8 గంటల సమయం

వరి ధాన్యాన్ని ఆరబెట్టడానికి 6–8 గంటల సమయం పడుతుందని గోపీనాథ్ తెలిపారు. చిన్న బబుల్ డ్రయ్యర్‌తో ఒక బ్యాచ్‌లో 500 కిలోల వరి ధాన్యం, మొక్కజొన్నలను ఆరబెట్టుకోవచ్చు. పెద్ద డ్రయ్యర్‌తో టన్ను ధాన్యాన్ని ఆరబెట్టవచ్చు. చిన్న సోలార్ బబుల్ డ్రయ్యర్ ధర రూ. 1,35,000, విద్యుత్‌తో నడిచే చిన్న బబుల్ డ్రయ్యర్ ధర రూ. 95,000 ఉంటుంది. పెద్ద సోలార్ బబుల్ డ్రయ్యర్ ధర రూ. 2,05,000, విద్యుత్‌తో నడిచే పెద్ద బబుల్ డ్రయ్యర్ ధర రూ. 1,40,000 ఉంటుంది. మార్కెట్ యార్డులు, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, కస్టమ్ హైరింగ్ సెంటర్లు పెట్టుబడి పెట్టి వీటిని చిన్న, సన్నకారు రైతులకు అందుబాటులోకి తేవచ్చు. చేతికి వచ్చిన ఒక్క గింజ కూడా తడవకూడదు, వరదకు కొట్టుకుపోకూడదు, బూజు పట్టకూడదు.. అని మనం దరం కంకణం కట్టుకోవాల్సిన తరుణం ఇది.

– పంతంగి రాంబాబు, సాక్షి సాగుబడి డెస్క్


సోలార్ బబుల్ డ్రయ్యర్‌ను చదరంగా ఉండే నేలపై పెట్టుకొని ధాన్యాన్ని, ఆరబెట్టుకోవచ్చు


ధాన్యం ఆరబెడుతున్నప్పుడు డ్రయ్యర్ లోపలి దృశ్యం

తాత్కాలిక గోదాములు.. కకూన్స్!

పంటను పండించటం, సక్రమంగా ఆరబెట్టడంతోపాటు వానకు, వరదకు, ఎండకు పాడవ్వకుండా.. పురుగు, బూజు పట్టకుండా నెట్టు కట్టి నిల్వ చేసుకోవటం అవసరం. సీజన్‌లో గోదాములు చాలవు. ఇళ్ల దగ్గర లేదా మార్కెట్ యార్డుల్లో లేదా మిల్లుల దగ్గరైనా ఆరుబయట తాత్కాలికంగా గుడారాల్లాంటి గోదాములు ఏర్పాటు చేసుకోవచ్చు. గ్రెయిన్ ప్రో సంస్థ 'కకూన్స్' పేరేతో వీటిని అందుబాటులోకి తెచ్చింది. యూవీ రెసిస్టెంట్ పోలీవినిల్ క్లోరైడ్‌తో తయారైన ఈ కకూన్స్‌లో ఇండోర్, అవుట్‌డోర్‌లో వ్యవసాయోత్పత్తుల్ని సురక్షితంగా నిల్వ చేసుకోవచ్చు. రసాయనాలు వాడకుండానే పురుగు, బూజు పట్టకుండా నిల్వ చేసుకోవచ్చు. ఆహార ధాన్యాలనే కాకుండా విత్తన ధాన్యాలను సైతం రసాయన రహితంగా నిల్వ చేసుకోవచ్చు. సేంద్రియ ఆహారోత్పత్తులను సైతం రుచి, రంగు, వాసన మారకుండా ఆరుబయట కూడా నిల్వ చేసుకోవడానికి ఈ కకూన్స్ ఉపయోగపడతాయి. తీవ్రమైన ఎండ, వర్షాల నుంచే కాకుండా రెండు అడుగుల ఎత్తున వరద నీటిని కూడా ఇది తట్టుకొని ఆహారోత్పత్తులను కాపాడుతుందని గ్రెయిన్ ప్రో సంస్థ (customercare@grainpro.com) చెబుతోంది. మార్కెట్ యార్డు యాజమాన్యాలు, సహకార సంఘాలు, ఎఫ్.పి.ఓ.లు, కస్టం హైరింగ్ సెంటర్లు ఈ తాత్కాలిక గోదాములను పుష్కలంగా అందుబాటులోకి తెస్తే.. రైతుల కష్టనష్టాలు తగ్గుతాయి. కోత అనంతర ఆహార వృథా తగ్గుతుంది.


ధాన్యం బస్తాలను ఆరుబయట ఇలా నెట్టుకట్టి.. కకూన్‌కు జిప్ వేస్తే చాలు..



ఆక్వా చెరువుల కాలుష్యానికి చెక్.. రొయ్యలు, చేపలతో పాటే సీవీడ్స్ సాగు

ఆక్వా చెరువుల్లో రొయ్యలు, చేపలతో పాటు పోషకాల పుట్ట వంటి సీవీడ్స్‌ను కూడా కాలుష్య రహితంగా సాగు చేసే అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రానుంది. చెరువుల్లో రొయ్యలు, చేపలను పెంచే క్రమంలో వెలువడే మురుగునీటిని సముద్రంలోకి వదలటం, దీనివల్ల సముద్రపు నీరు కలుషితమవుతుంటుంది. అయితే, ఆక్వా చెరువుల నుంచి మురుగునీటితో కంటెయినర్లలో సీ లెట్యూస్ (సముద్రపు పాలకూర) వంటి అధిక మాంసకృత్తులు, అధిక పీచుపదార్థం కలిగిన సీవీడ్స్‌ను పెంచటంతో పాటు నీటిని కాలుష్యరహితంగా మార్చి సముద్రంలోకి వదిలేందుకు వీలయ్యే పర్యావరణ అనుకూల సాంకేతికత ఆవిష్కృతమైంది. చేపలు, రొయ్యలు, సీవీడ్స్‌ను ఏకకాలంలో కాలుష్యరహితంగా సాగు చేసేందుకు మార్గం సుగమం కానుంది.

డెన్మార్క్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హగెన్ ఈ సాంకేతికతను రూపొందించింది. లోతైన పరిశోధనల కోసం 'ఇన్నోవేషన్ ఫండ్ డెన్మార్క్' నిధులు సమకూర్చుతోంది. యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హగెన్ పరిశోధకులు, ఆర్హస్ యూనివర్సిటీ, పలు కంపెనీలతో కలసి లోతైన పరిశోధనలు చేపట్టబోతున్నారు. అత్యంత విలువైన ఈ సముద్రపు పాలకూరను అంతర్జాతీయంగా ఆహార, ఔషధ పరిశ్రమల్లో వినియోగిస్తున్నందున దీన్ని పెద్ద ఎత్తున సాగు చేయటం వల్ల ఎగుమతి అవకాశాలు ఏర్పడతాయి. తద్వారా ఆక్వా రైతులకు మరింత ఆదాయం చేకూరే అవకాశం ఉంది. ఈ సీవీడ్ మధుమేహం నివారణకు ఉపకరిస్తుందంటున్నారు. సముద్రంలో కలిసే ఆక్వా చెరువుల వ్యర్థ జలాల కాలుష్యాన్ని నివారించడంతో పాటు ఆరోగ్యదాకమైన సీవీడ్ ఉత్పత్తి సంతోషదాయకమని యూనివర్సిటీ ఆఫ్ కెపెన్ హగెన్ ఫుడ్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ మరియన్నె థామ్సెన్ అన్నారు. వెయ్యి లీటర్ల ఆక్వా సాగు ట్యాంకులకు అనుసంధానం చేసిన 40 అడుగుల కంటెయినర్లలో సీలెట్యూస్‌ను పెంచుతారు. ఆక్వా చెరువుల నుంచి వెలువడే మురుగు నీరు, ఉప్పునీటిలో కార్బన్‌డయాక్సైడ్, కొన్ని పోషకాలను కలిపి ఎల్ఇడీ లైట్లను ఉపయోగించి ఒక బ్యాచ్ సీలెట్యూస్‌ను వారం రోజుల్లో ఉత్పత్తి చేస్తున్నట్లు ప్రొ. మరియన్నె తెలిపారు. రొయ్యలు, చేపలతో పాటు ఆరోగ్యదాయకమైన, పీచు, ప్రొటీన్ అధికంగా ఉండే సీవీడ్స్‌కు అంతర్జాతీయంగా మంచి గిరాకీ ఉంటుందంటున్నారు. ఈ సాంకేతికత రైతులకు అందుబాటులోకి రావాలంటే మరో నాలుగేళ్లు ఎదురుచూడాల్సి ఉంది.


కంటెయినర్లలో సీలెట్యూస్ పెంపకం.. వారానికో పంట..


సీలెట్యూస్ (సముద్రపు పాలకూర)

12న గోఆధారిత వ్యవసాయంపై శిక్షణ

మహబుబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లిలోని ఈ నెల 12 (సోమవారం)న ఉ. 9.30 గంటల నుంచి జాతీయ ఉత్తమ రైతు పురస్కార గ్రహీత జైపాల్‌రెడ్డి మామిడి తోటలో రైతులకు శిక్షణ ఇస్తారు. ఆదిగురు భారత సంఘం, అరబిందో ఫార్మా, జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో విత్తనాలు, గోకృపామృతం ఉచితంగా ఇచ్చిపుచ్చుకునే ఏర్పాటు ఉంది. పాల్గొనదలచిన రైతులు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. 70953 14226, 91002 50504.


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 75

మంగళవారం 6-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



55 ఏళ్ల తర్వాత...

గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో బ్రెజిల్ క్రీడాకారిణి బీత్రిజ్ -10లో



18,600కు చేరువలో నిఫ్టీ

కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు. రెండో రోజూ కొనసాగిన లాభాలు -11లో



ముఖ్తార్ అన్సారీకి జీవిత ఖైదు

30 ఏళ్ల నాటి కాంగ్రెస్ నేత సోదరుడి హత్య కేసులో గ్యాంగ్‌స్టర్- రాజకీయ నేత అన్సారీకి వారణాసి కోర్టు జీవిత ఖైదు విధించింది.

వివరాలు 6లో ▸



'డిఫెన్స్' రోడ్డు మ్యాప్ ఖరారు

పరస్పర సహకారానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు.

వివరాలు 6లో ▸



దడ పుట్టించిన చేజింగ్

ఆదివారం అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఓ చిన్న విమానాన్ని జెట్ విమానం వెంబడించడం కలకలం రేపింది.

వివరాలు 6లో ▸



ఉరికొయ్యలే దిక్కు!

పెరుగుతున్న మానసిక, అనారోగ్య సమస్యలు, తాలిబన్ల ఆంక్షలు, వివక్ష అఫ్గానిస్తాన్ మహిళల్లో ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాయి.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

రెండే నెలలు... రూ.పది వేల కోట్ల అప్పులు



రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన రూ.1500 కోట్ల రుణంతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2 నెలల కాలంలోనే రుణ సేకరణ 10 వేల కోట్ల మార్కు చేరింది. - వివరాలు 3లో▶

ఆశాలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు!



ఇతర మహిళా ఉద్యోగులకు ఇస్తున్నట్లుగానే ఆశా కార్యకర్తలకు, సెకండ్ ఏఎన్‌ఎంలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇచ్చేలా అధ్యయనం చేసి నివేదిక అందించాలని అధికారులను మంత్రి హరీశ్ ఆదేశించారు.

- వివరాలు 3లో▶

రేషన్ డీలర్ల సమ్మెబాట



డీలర్ల కమీషన్ పెంపు, గౌరవ వేతనంతో పాటు ఇతర డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్నట్లు రేషన్ డీలర్ల సంఘం నాయకులు ప్రకటించారు. సోమవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించాల్సి ఉండగా, పూర్తిస్థాయిలో సమ్మెకు దిగారు.

- వివరాలు 5లో▶

రెగ్యులర్‌గా హైటెక్ మాస్ కాపీయింగ్!



టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన డీఈఈ రమేశ్.. కమిషన్ 2018, 2019ల్లో నిర్వహించిన పరీక్షల్లోనూ ఈ తరహా కాపీయింగ్‌కు పాల్పడ్డాడని సిట్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

- వివరాలు 2లో▶

9 సంవత్సరాలు.. రూ.97,321 కోట్లు

- రాష్ట్ర విద్యుత్ రంగాభివృద్ధికి వినియోగించామన్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు



సాక్షి, హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థల బలోపేతానికి రూ.97,321 కోట్లు ఖర్చు చేశామని తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ సౌధ, మింట్ కాంపౌండ్‌లోని టీఎస్‌ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన 'విద్యుత్ విజయోత్సవ దినం'కార్యక్రమాల్లో మాట్లాడారు. రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2022–23లో 2140 యూనిట్లుగా, జాతీయ సగటుతో పోల్చితే 70శాతం అధికంగా నమోదైందని తెలిపారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థ అభివృద్ధికి 9 ఏళ్లలో రూ.14,063 కోట్లు ఖర్చు చేశామని

మిగతా 5వ పేజీలో ▶

ఐఐటీ–మద్రాస్ నంబర్‌వన్



14వ ర్యాంకులో ఐఐటీ-హైదరాబాద్

20వ స్థానంలో హెచ్‌సీయూ

మొదటి వంద ర్యాంకుల్లో నిట్, ఉస్మానియా, ఆంధ్రా యూనివర్సిటీలు

- అత్యుత్తమ వర్సిటీల విభాగంలో హెచ్‌సీయూకి పదో స్థానం
- ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ–హైదరాబాద్‌కు 8వ స్థానం, ఇన్నొవేషన్‌లో మూడోస్థానం..
- ర్యాంకింగ్ నివేదిక విడుదల చేసిన కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్

- వివరాలు 12లో

నాయకత్వ శిక్షణ..

సుపరిపాలన అందించే దిశగా నాయకులను తీర్చిదిద్దుతాం

భారత్ భవన్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి

సమాజాభివృద్ధికి కృషి చేసే నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది

ఇందుకోసం రాజకీయంతోపాటు అన్ని రంగాల్లో బోధన, శిక్షణ అవసరం

భారత్ భవన్‌లో అన్నీ అందుబాటులో ఉంటాయి..

తరగతి గదులు, డిజిటల్ లైబ్రరీలు, గ్రంథాలు, సమాచార కేంద్రాలు..

అనుభవజ్ఞులైన మేధావులు, నోబెల్ లారెట్లతో నాయకత్వ శిక్షణ

మణికొండ (హైదరాబాద్): దేశ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుంటూ పనిచేసే సమర్థవంతమైన నాయకత్వం వర్తమాన దేశానికి అవసరమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు చెప్పారు. సమాజాభివృద్ధికి దోహదం చేసే దిశగా నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఇందుకోసం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాల్లో బోధన, శిక్షణ అవసరమని తెలిపారు. వీటన్నిటినీ ఒకేచోట అందించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగానే భారత్ భవన్ (సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్) నిర్మాణం చేపడుతున్నామన్నారు. సోమవారం హైదరాబాద్ నగర శివారు కోకాపేటలో 15 అంతస్తులతో నిర్మిస్తున్న భారత్ భవన్ పనులను సీఎం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామిక ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలే పునాదులన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ సమర్థత, మానవ వనరుల అభివృద్ధి కేంద్రంగా భారత్ భవన్‌ను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చెప్పారు. దేశం నలుమూలల నుంచి వచ్చే సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులకు ఇక్కడ సమగ్ర, సమస్త సమాచారం

మిగతా 2వ పేజీలో ▶



భారత్ భవన్ పనులను ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి తదితరులు

ప్రిలిమ్స్ వాయిదా లేదు

సాక్షి, హైదరాబాద్

ఈ నెల 11న గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరించింది. మార్చిలో నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక ఇప్పుడు వాయిదా కోరుతూ పిటిషన్లు వేయడం సరికాదంది. ఆ పిటిషన్లను కొట్టివేసింది. పేపర్ లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ పూర్తయ్యే వరకు గ్రూప్–1 పరీక్షలు ఆపాలని విజ్ఞప్తి చేస్తూ హైకోర్టులో ఐదు పిటిషన్లు దాఖలయ్యాయి. టీఎస్‌పీఎస్సీ సిబ్బందిలో ఎంతమందికి లీకేజీతో సంబంధం ఉందో తెలియకుండా అదే కమిషన్ పరీక్షలు నిర్వహించడం సరికాదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్, న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు వాదించగా, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు.


యూపీఎస్సీతో పరీక్ష నిర్వహించాలి..

'టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు.. కొనసాగుతోంది. కమిషన్‌లో పనిచేసే వారికి లీకేజీతో సంబంధం ఉందని కొందరిని సస్పెండ్ చేశారు. దర్యాప్తు పూర్తి అయితేగానీ ఇంకా ఎవరైనా ఉన్నారా? లేదా? అన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. దాదాపు 11 ఏళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన గ్రూప్–1 పరీక్ష నిర్వహిస్తోంది. 5 లక్షల మందికి పైగా అభ్యర్థులు గ్రూప్–1 కోసం ఎదురుచూశారు. ఈ పరీక్ష ద్వారా ప్రభుత్వంలో కీలకమైన పోస్టుల్లో అధికారుల నియామకం జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో

మిగతా 2వ పేజీలో ▶

11న గ్రూప్-1 నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి: ఏజీ
- అదే కమిషన్ పరీక్షలు ఎలా నిర్వహిస్తుంది?: పిటిషనర్ తరఫు న్యాయవాది





పెను విషాదం కనపడకుండా..!

ఆ ట్రాక్‌లు సిద్ధం

- ఒడిశాలో పెను ప్రమాదం జరిగిన లైన్లపై రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

- వివరాలు 6లో▶

'నైరుతి' దోబూచులాట!

- బంగాళాఖాతంలో తేమను లాక్కెళ్లిపోయిన 'మోచా'తుపాను

సాక్షి, విశాఖపట్నం/అమరావతి: నైరుతి రుతుపవనాలు ఊరిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలను తలకిందులు చేస్తున్నాయి. ఏటా జూన్ 1 కల్లా నైరుతి రుతుపవనాలు కేరళలో ప్రవేశిస్తాయి. అయితే.. ఈ ఏడాది ఆలస్యంగా జూన్ 4కి కేరళను తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. కానీ 'నైరుతి'కేరళను తాకకుండా దోబూచులాడుతూనే ఉంది. వాస్తవానికి రుతుపవనాలు అండమాన్ సముద్రం, దక్షిణ బంగాళాఖాతంలోకి మే 20–22 మధ్య ప్రవేశిస్తాయి. అనంతరం నాలుగైదు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతంలతో పాటు పరిసర ప్రాంతాలకు విస్తరిస్తాయి. అక్కడ నుంచి జూన్ 1వ తేదీకి కేరళను తాకుతాయి. కానీ.. ఈ ఏడాది అండమాన్ సముద్రంలోకి సకాలంలో అంటే మే 20 నాటికే ప్రవేశించాయి. కానీ.. అప్పటినుంచి వాటి విస్తరణలో మాత్రం మందగమనం చోటుచేసుకుంటోంది. ఫలితంగా రుతుపవనాలు కేరళలో ప్రవేశించడానికి

మిగతా 2వ పేజీలో ▶



సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చట్టం

ఆగస్టు, సెప్టెంబర్‌లో అసెంబ్లీలో ఆమోదించనున్నాం

- కేంద్రం నుంచి ఎలాంటి సాయం లేకున్నా ఐటీలో మేటిగా నిలిచాం
- 2022–23లో రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.2.41 లక్షల కోట్లు
- తెలంగాణలో 9.05 లక్షలకు చేరిన ఐటీ ఉద్యోగులు
- రాష్ట్ర ఐటీ శాఖ 2022–23 నివేదిక విడుదల చేసిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు 'నల్సార్'న్యాయ విశ్వవిద్యాలయంతో కలిసి దేశంలోనే మొదటిసారిగా సైబర్ క్రైమ్ చట్టాన్ని తెస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో జరిగే అసెంబ్లీ సమావేశాల్లోనే దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదిస్తామని తెలిపారు. తెలంగాణ చేయబోయే సైబర్‌క్రైమ్ చట్టంపై కేంద్ర ప్రభుత్వం కూడా ఆసక్తి చూపుతోందని పేర్కొన్నారు. సోమవారం టీ-హబ్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 'రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం 2022–23'వార్షిక నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఐటీ రంగ వృద్ధికి సంబంధించిన అన్ని సూచీల్లో రాష్ట్రం జాతీయ సగటును దాటుకొని వేగంగా ముందుకు పోతోందని చెప్పారు. బెంగళూరుకు దీటుగా హైదరాబాద్‌ను నిలబెడతామని రాష్ట్ర అవతరణ సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టామన్నారు.

కేంద్రం నుంచి సాయం అందకున్నా..

కరోనా సమయంలోనూ, ఆ తర్వాత కూడా అనేక అనుమానాలు ఎదురైనా, కేంద్రం నుంచి సహాయ నిరాకరణ జరిగినా తెలంగాణ తన సొంత ప్రణాళికలతో ఐటీ రంగంలో అభివృద్ధి సాధిస్తూ వస్తోందని కేటీఆర్ చెప్పారు. పారదర్శకంగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే 9 ఏళ్లుగా ఐటీ శాఖ వార్షిక నివేదికలను విడుదల చేస్తున్నామని వివరించారు. అమెరికా, యూకే పర్యటనలో

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఆ కుట్రకు కారణం ఇతనే..! చర్యలు తీసుకోండి..!!

నిరసనలకు విరామం!

ఉద్యోగాల్లోకి బజరంగ్, సాక్షి.. పోరాటం కొనసాగిస్తామన్న రెజ్లర్లు

భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో రెజ్లర్లు కొనసాగిస్తున్న నిరసనల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిరసనను ముందుండి నడిపించిన ఒలింపిక్ పతక విజేతలు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ రైల్వే శాఖలో తమ ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. దాంతో పోరాటం నుంచి వీరు తప్పుకున్నట్లేనని, ఫలితం లేకుండానే నిరసన ముగిసినట్లు వార్తలు వచ్చాయి. అయితే బజరంగ్, సాక్షి వీటిని ఖండించడంతో పాటు తమ పోరాటాన్ని ముగించలేదని స్పష్టం చేశారు. శనివారం అర్ధరాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అనంతరమే ఇవన్నీ జరగడం విశేషం.

- వివరాలు 10లో▶



చెయ్యి తెగితే.. మరొకరి చెయ్యి అతికిస్తారిక్కడ


ప్రమాదాల్లో చేయి తెగినవారికి మార్పిడి చికిత్సలు

- దేశంలోనే తొలిసారిగా కొచ్చిలోని అమృత ఆస్పత్రిలో సర్జరీ
- ఇప్పటికే 14 మంది బాధితులకు ఆపరేషన్లు.. బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచి చేతుల సేకరణ
- చేతులు కోల్పోయిన వారికి వీటిని అమర్చుతున్న వైద్యులు



సాక్షి, హైదరాబాద్: ఈ ఫొటోలోని వ్యక్తి పేరు మను.. కేరళలోని కొచ్చికు చెందిన ఆయన రైలు ప్రమాదంలో రెండు చేతులనూ కోల్పోయారు. చాలా కాలంపాటు కుటుంబ సభ్యుల మీదే ఆధారపడి బతికాడు. కానీ ఇప్పుడు ఆయనకు రెండు చేతులూ ఉన్నాయి. అందరిలాగే తానూ పనిచేసుకుని బతుకుతున్నాడు. కొచ్చిలోని అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆస్పత్రి ఆయనకు ఈ కొత్త

మిగతా 5వ పేజీలో ▶



మండే ఎండల్లోనూ నిండుగా నీళ్లు

- ఎగువ నుంచి వచ్చిన వరదనీటితో నిండిన మూసీ ప్రాజెక్టు
- ఒక గేటు ఎత్తి 330 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

కేతేపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయికి చేరుకుంది. దీంతో అధికారులు సోమవారం ఉదయం ఒక క్రస్టు గేటును పైకెత్తి నీటిని దిగువకు వదిలారు. జూన్ మొదటి వారంలోనే గేట్లు ఎత్తడం ప్రాజెక్టు చరిత్రలో ఇదే మొదటిసారని చెప్తున్నారు. గత ఏడాది జూన్ 27న గేట్లు ఎత్తారు. గత నెల రోజులుగా హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సుప్రీం నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: ఫ్యాక్టరీపై దాడి కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. 2014లో ఫ్యాక్టరీపై జరిగిన దాడికి సంబంధించి మహిపాల్‌రెడ్డిని ట్రయల్‌కోర్టు దోషిగా నిర్ధారించింది. అనంతరం మహిపాల్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా స్టే లభించింది. దీంతో ట్రయల్ కోర్టు ఆదేశాలను అమలుచేయాలని, హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఎంఏ ముఖీమ్ సుప్రీంను ఆశ్రయించారు. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ పిటిషన్‌ను విచారించి, కౌంటరు దాఖలుచేయాలంటూ మహిపాల్‌రెడ్డికి నోటీసులు జారీచేసింది.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

సాక్షి, హైదరాబాద్: కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేసింది. సోమవారం ఐఎఫ్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా నాగయ్య, గీత కలిసి విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేవని, పని భారం ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.27వేలు చేయాలని, వీక్లీఆఫ్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.కే.రఫీయ, మహేశ్వరి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

8న మాలల మహా ధర్నా

పంజగుట్ట: హైదరాబాద్ నగరంలో మాలలకు ఐదెకరాల భూమి, రూ.10 కోట్లు కేటాయించి మాలల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 8న ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, మంచాల లింగస్వామి, కరణం కిషన్, గద్ద శ్రీనివాస్‌తో కలిసి చెన్నయ్య విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క శాతం జనాభా కూడా లేని వారికి సామాజిక భవనాలు కట్టిస్తున్నారని 7 శాతం జనాభా ఉన్న మాలలకు ఎందుకు కట్టివ్వరని ఆయన ప్రశ్నించారు. మాలలకు సామాజిక భవనం కట్టివ్వకపోవడం దారుణమన్నారు.

...నిండుగా నీళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాంతాలలో కురిసిన అకాల వర్షాలతో ఈ ప్రాజెక్టు వేసవిలోనే నిండుకుండలా మారింది. నెల రోజుల నుంచి మూసీ, బిక్కేరు వాగుల ద్వారా నిరంతరాయంగా నీరు వస్తుండటంతో ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతూ వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా సోమవారం ఉదయానికి నీటిమట్టం 644.60 అడుగులకు (4.36 టీఎంసీలు) చేరింది. ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టులోకి 240 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నీటిమట్టం గరిష్టస్థాయికి చేరువలోకి రావటంతో అధికారులు మూడో నంబర్ క్రస్ట్ గేటును అర అడుగు మేర పైకి ఎత్తి 330 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. 644.5 అడుగుల వద్ద నీటిమట్టాన్ని నిలకడగా ఉంచుతూ ఎగువ నుంచి వస్తున్న వరదను దిగువకు వదులుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఉగ్రవాదులు టార్గెట్ చేసిన రాష్ట్రాలు ఏవి?

- హెచ్‌యూటీ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన ఎన్‌ఐఏ
- ఢిల్లీ నుంచి భోపాల్ చేరుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- త్వరలో హైదరాబాద్‌కు రాక

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు హైదరాబాద్‌–భోపాల్‌లలో అరెస్టు చేసిన ఉగ్రవాదులకు సంబంధించిన కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ముమ్మరం చేసింది. ఈ కేసును ఢిల్లీ యూనిట్ గత నెల 24న రీ–రిజిస్టర్ చేసిన విషయం తెలిసిందే. దీని దర్యాప్తు కోసం ఏర్పాటైన ప్రత్యేక ఎన్‌ఐఏ బృందం సోమవారం ఢిల్లీ నుంచి భోపాల్ చేరుకుంది. ఏటీఎస్ అధికారులతో సమావేశమైన ఈ టీమ్.. కేసు పూర్వాపరాలు తెలుసుకుంది. గత నెల 9న ఏటీఎస్ అధికారులు హైదరాబాద్‌లో ఐదుగురు, భోపాల్‌లో 11 మందిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) ఉగ్ర సంస్థకు చెందిన ఈ మాడ్యూల్ షరియత్ స్థాపనే లక్ష్యంగా విధ్వంసాలకు పథక రచన చేసింది. వీరి టార్గెట్‌లో అనేక ప్రాంతాలతో పాటు మత నాయకులు కూడా ఉన్నట్లు ఏటీఎస్ ఆరోపిస్తోంది. కాగా, ఈ ఉగ్రవాదులు తెలంగాణ, మధ్యప్రదేశ్‌తో పాటు ఏయే రాష్ట్రాలను టార్గెట్‌గా చేసుకున్నారనే కోణంలో ఎన్‌ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఆయుధాలు, మందుగుండు సామగ్రితో పాటు పేలుడు పదార్థాలనూ సమీకరిస్తున్న వీరి అసలు కుట్ర ఏమిటి అన్నదానిపై ఎన్‌ఐఏ దృష్టి సారించింది. ఈ 16 మంది ఉగ్రవాదులను అధికారులు ఇప్పటికే రెండుసార్లు తమ కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. ఎన్‌ఐఏ అధికారులు సైతం హైదరాబాద్, భోపాల్‌లకు చెందిన మహ్మద్ సలీం, యాసిర్ ఖాన్‌లతో పాటు మిగిలిన వారినీ మరోసారి కస్టడీలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా త్వరలో వీరిని హైదరాబాద్ తీసుకురావాలని ఎన్‌ఐఏ నిర్ణయించింది.

ప్రకృతిని పదిలంగా కాపాడుకోవాలి

- పర్యావరణహిత రాష్ట్ర ఆవిష్కరణే లక్ష్యమన్న సీఎం
- హెచ్‌ఎండీఏ లే అవుట్‌లో మొక్క నాటిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: సృష్టికి మూలమైన ప్రకృతిని పదిలంగా కాపాడుకున్నప్పుడే భవిష్యత్ తరాలు సుఖసంతోషాలతో వర్ధిల్లుతాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోకాపేటలోని హెచ్‌ఎండీఏ లే అవుట్ నియో పోలీస్‌లో సోమవారం మధ్యాహ్నం ఆయన మొక్క నాటారు. తెల్లాపూర్ హెచ్‌ఎండీఏ నర్సరీలో పెంచిన మూడేళ్ల వయస్సు కలిగిన 7.5 అడుగుల 'పొన్న' మొక్కను నాటిన సీఎం.. వర్మి కంపోస్ట్ ఎరువు వేసి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం కాపాడితే, ప్రకృతి మనల్ని కాపాడుతుందనే సత్యాన్ని మరవరాదన్నారు.

రాష్ట్రంలో పెరిగిన పచ్చదనం: రాష్ట్ర ప్రభుత్వం



కోకాపేటలో మొక్కనాటి నీళ్లు పోస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సబిత, సంతోష్ తదితరులు

చేపట్టిన చర్యలతో నేడు రాష్ట్రంలో పచ్చదనం పెరిగి జీవ వైవిధ్యం పరిఢవిల్లుతోందని సీఎం చెప్పారు. హరితహారం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో గ్రీన్ కవర్ 7.70 శాతానికి పెరిగిందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించడం గొప్ప విషయమన్నారు. ఇది తెలంగాణ ప్రజల పర్యావరణ పరిరక్షణ దీక్షకు దర్పణం పడుతోందన్నారు. సోలార్ పవర్ ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలవడం, బృహత్ ప్రకృతి వనాలపై నీతి ఆయోగ్ ప్రశంసలు, హరితహారం ద్వారా 273 కోట్ల మొక్కలను నాటడం ప్రపంచంలోనే అతిపెద్ద మానవ ప్రయత్నంగా రికార్డులకెక్కడం లాంటివన్నీ తెలంగాణ సాధించిన విజయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదికలో పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రానికి ప్రథమ స్థానం దక్కడం .. పర్యావరణ పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వానికున్న నిబద్ధతను స్పష్టం చేస్తోందని అన్నారు. పర్యావరణహిత రాష్ట్రాన్ని ఆవిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ కె.కేశవరావు, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, హెచ్‌ఎండీఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ శిక్షణ

▶ మొదటి పేజీ తరువాయి

అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆయారంగాలలో అనుభవజ్ఞులైన మేధావులు, నోబెల్ లారెట్లతో నాయకత్వ శిక్షణ ఇప్పిస్తామని, తద్వారా భారత ప్రజాస్వామిక సౌధాన్ని మరింత పటిష్టం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

సౌకర్యాలు ఎన్నో..

భారత్ భవన్‌లో శిక్షణకు వచ్చే వారికి విలాసవంతమైన వసతులతో పాటు తరగతి గదులు, ప్రొజెక్టర్లతో కూడిన చిన్న, విశాలమైన సమావేశ మందిరాలు ఉంటాయని కేసీఆర్ తెలిపారు. అత్యాధునిక సాంకేతికత కలిగిన డిజిటల్ లైబ్రరీలు, ప్రపంచ మేధావుల రచనలు, గ్రంథాలు, స్థానిక, దేశీయ, అంతర్జాతీయ మీడియా చానల్స్ సమాచార కేంద్రాలుండే ఏర్పాటు చేస్తామన్నారు. దేశ, విదేశీ వార్తాపత్రికలు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రపంచవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో చోటు చేసుకునే పురోగతిని పరిశీలించే వేదికలు కూడా అందుబాటులోకి తెస్తామన్నారు. వార్తలు, కథనాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ విశ్లేషించి, క్రోడీకరించే వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలను నిత్యం ప్రభావితం చేస్తున్న సామాజిక మాధ్యమాలపై అవగాహన కొరకు ప్రత్యేక శిక్షణా తరగతులు ఉంటాయని తెలిపారు. మీడియా రంగంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే దిశగా సీనియర్ టెక్నికల్ బృందాలు సైతం ఇక్కడ పనిచేస్తాయన్నారు. భారత్ భవన్‌కు కేటాయించిన 11 ఎకరాల స్థలంలో కొంత మేరకే నిర్మాణం చేపట్టి ఎక్కువ శాతం పచ్చదనం నింపి ఆహ్లాదకర వాతావరణంలో శిక్షణ ఇస్తామని సీఎం చెప్పారు.

భూ వరాహ హోమం..

శంకుస్థాపన కార్యక్రమానికి ముందు వేదపండితులు నిర్వహించిన భూ వరాహ హోమం పూజల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. భవన నిర్మాణ స్థలమంతా కలియ దిరిగి నాలుగు మూలలా సరిహద్దుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, భవన నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, అధికారులకు పలు సూచనలు చేశారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భవన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, పి.సబితారెడ్డి, మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్ కె. కేశవరావు, ఎంపీలు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, నామా నాగేశ్వర్‌రావు, జోగినిపల్లి సంతోష్‌కుమార్, బీబీ పాటిల్, దామోదర్‌రావు, బి.లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి, కవిత, శేరి సుభాష్‌రెడ్డి, శంభీపూర్ రాజు, మహేందర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, గోరటి వెంకన్న, ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యేలు టి.ప్రకాశ్‌గౌడ్, దానం నాగేందర్, కాలె యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రిలిమ్స్ వాయిదా లేదు

▶ మొదటి పేజీ తరువాయి

పరీక్ష పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాల్సి ఉంది. ప్రస్తుత కమిషన్ ఆధ్వర్యంలో పరీక్ష సాగుతున్నప్పుడే లీకేజీ జరిగింది. అలాంటప్పుడు అదే కమిషన్ తిరిగి ఎలా పరీక్ష నిర్వహిస్తుంది? యూపీఎస్సీ లాంటి ఏదైనా థర్డ్ పార్టీ కమిషన్‌తో నిర్వహిస్తే ఎవరికీ ఎలాంటి అనుమానం, అభ్యంతరం ఉండదు. 'అని అవినాశ్ దేశాయ్ తెలిపారు.

ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి..

'పేపర్ లీకేజీ విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వం స్పందించి పరీక్షలను రద్దు చేసింది. ఇది ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. ఇప్పటివరకు టీఎస్‌పీఎస్సీలోని ఇద్దరు శాశ్వత ఉద్యోగులు, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులకు లీకేజీతో సంబంధం ఉందని తేలడంతో వారిని సస్పెండ్ చేశారు. వారిని దర్యాప్తు అధికారులు అరెస్టు కూడా చేశారు. పరీక్ష రద్దు చేసినప్పుడు ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే త్వరగా నిర్వహించమని అడగాలి తప్ప.. వాయిదా కోరడం సరికాదు. జూన్ 11న పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 3.18 లక్షల మంది గ్రూప్–1కు దరఖాస్తు చేయగా, ఇప్పటికే 1.13 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. మిగతావారు కూడా ఒకట్రెండు రోజుల్లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 995 సెంటర్లలో ఏర్పాట్లు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్ష వాయిదా వేయాలని కోరడం సమంజసం కాదు...' అని బీఎస్ ప్రసాద్ నివేదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. వచ్చే ఆదివారమే పరీక్ష ఉన్న నేపథ్యంలో వాయిదా వేయలేమని స్పష్టం చేస్తూ ఆదేశాలు ఇచ్చింది.

ఒకవైపు వడగాడ్పులు.. మరోవైపు వర్షాలు

- కొన్నిచోట్ల ఒక విధంగా.. మరికొన్ని చోట్ల ఇంకో రకంగా
- రాబోయే మూడు నుంచి ఐదు రోజులు ఇలాంటి పరిస్థితే
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఒకవైపు వర్షాలు.. మరోవైపు వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాగల మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. మంగళవారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఐదు రోజులపాటు ఈ గాలులు ఉంటాయని తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు స్థిరంగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక హైదరాబాద్ దాని చుట్టుపక్కల జిల్లాల్లో 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

సోమవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
జంబుగ (కొమురంభీం)	44.6
జూలూరుపాడు (భద్రాద్రి కొత్తగూడెం)	43.8
ముత్తారం (పెద్దపల్లి)	43.8
కొండాపూర్ (మంచిర్యాల)	43.3
కెరమెరి (కొమురంభీం)	43.2
దామరబందచెర్ల	43.0
మంగపేట (ములుగు)	43.0
యానంబైలు (భద్రాద్రి కొత్తగూడెం)	42.9
ఏదూళ్ల బయ్యారం (భద్రాద్రి కొత్తగూడెం)	42.8
ఖమ్మం	41.4
మెదక్	40.8
రామగుండం	40.8
నల్లగొండ	40.5
భద్రాచలం	40.4
ఆదిలాబాద్	40.3
హనుమకొండ	39.0
నిజామాబాద్	38.1
హైదరాబాద్	37.6
మహబూబ్‌నగర్	37.5

'నైరుతి' దోబూచులాట!

▶ మొదటి పేజీ తరువాయి

జాప్యం జరుగుతోంది. దీంతో ఐఎండీ ముందుగా ఊహించినట్లుగా జూన్ 4వ తేదీ కంటే మరో నాలుగైదు రోజులు ఆలస్యంగా కేరళను తాకనున్నాయి. అంటే సాధారణం కంటే వారం రోజుల ఆలస్యంగా ఇవి కేరళలోకి ప్రవేశించనున్నాయి.

ఆలస్యం ఎందుకంటే..!

నైరుతి రుతుపవనాల ఆగమనంలో జాప్యానికి గత నెలలో సంభవించిన 'మోచా' తుపాను, ఉత్తరాదిన ఏర్పడిన పశ్చిమ ఆటంకాలు (వెస్టర్న్ డిస్టర్బెన్స్) ప్రధాన కారణమని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గత నెల 9న బంగాళాఖాతంలో ఏర్పడిన మోచా తుపాను ఆ తర్వాత అత్యంత తీవ్ర తుపానుగా మారి 15న బంగ్లాదేశ్, మయన్మార్‌ల మధ్య తీరాన్ని దాటింది. దీంతో ఈ తుపాను బంగాళాఖాతంలోని తేమను మయన్మార్ వైపు లాక్కెళ్లిపోయింది. మరోవైపు కొద్దిరోజుల నుంచి ఉత్తరాదిన వెస్టర్న్ డిస్టర్బెన్స్‌లు చురుగ్గా ప్రభావం చూపిస్తున్నాయి. ఇవి దిగువన బంగాళాఖాతంపై ఉన్న తూర్పు గాలులను బలహీన పరిచాయి. ఫలితంగా అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న నైరుతి రుతుపవనాలు వేగంగా ముందుకు విస్తరించడకుండా వెస్టర్న్ డిస్టర్బెన్స్ అడ్డుపడుతున్నాయి. ఈ కారణాల వల్ల నైరుతి రుతుపవనాలు సకాలంలో కేరళలోకి ప్రవేశించకుండా జాప్యానికి కారణమయ్యాయని వాతావరణ శాఖ మాజీ అధికారి రాళ్లపల్లి మురళీకృష్ణ 'సాక్షి'తో చెప్పారు.

రెగ్యులర్‌గా హైటెక్ మాస్ కాపీయింగ్!

- డీఈఈ రమేష్ వ్యవహారంలో సిట్ నిర్ధారణ
- 2018, 2019 టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లోనూ ఇదే తంతు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన పరీక్షల్లో హైటెక్ మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన డీఈఈ రమేష్.. కమిషన్ 2018, 2019ల్లో నిర్వహించిన పరీక్షల్లోనూ ఈ తరహా కాపీయింగ్‌కు పాల్పడ్డాడని సిట్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కోర్టు అనుమతితో సాగుతున్న రమేష్ పోలీసు కస్టడీ సోమవారం రెండో రోజు ముగిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా విద్యుత్ శాఖలో డీఈఈగా పని చేస్తున్న రమేష్, నగరంలోని ఓ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న అలీతో ఒప్పందం కుదుర్చుకుని, అతడి నుంచి పరీక్ష పేపర్ ఎగ్జామ్ ప్రారంభమైన కొన్ని నిమిషాలకే వాట్సాప్ ద్వారా పొందాడు. తన ముఠాతో కలిసి చాట్ జీపీటీ ద్వారా సమాధానాలు గుర్తించి అత్యాధునిక పరికరాల ద్వారా ఒప్పందం చేసుకున్న అభ్యర్థులకు చేరవేశాడు. గతంలో జరిగిన పరీక్షలతో పాటు ఈ ఏడాది జనవరిలో జరిగిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పరీక్షలకు మాత్రమే



రమేష్ ఈ పంథా అనుసరించాడు.

అద్దె గదుల్లో ఉంచి..పేపర్లు చదివించి..

సైదాబాద్‌లో ఉంటున్న రమేష్‌కు అదే ప్రాంతానికి చెందిన రాయపురం విక్రమ్‌తో పరిచయం ఉంది. విక్రమ్‌కు టీఎస్‌పీఎస్సీ మాజీ ఉద్యోగి సురేష్ స్నేహితుడు కావడంతో అతని ద్వారా డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ), అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పేపర్లు అందాయి. దీంతో ఫిబ్రవరి, మార్చిలో జరిగిన ఈ పరీక్షల్లో రమేష్ హైటెక్ మాస్ కాపీయింగ్‌విధానాన్ని అవలంబించలేదు. తనతో ఒప్పందం చేసుకుని, అడ్వాన్స్‌లు చెల్లించిన అభ్యర్థులను సైదాబాద్, కొత్తపేట, వరంగల్‌ల్లో అద్దెకు తీసుకున్న గదులతోపాటు తన ఇంట్లోనూ ఉంచి, మాస్టర్ క్వశ్చన్ పేపర్లు ఇచ్చి చదివించాడు. కాగా రమేష్ నుంచి ఈ రెండు పరీక్షల పేపర్లు పొందిన వాళ్లు 40 మంది ఉన్నట్లు సిట్ గుర్తించింది. వరంగల్, కరీంనగర్‌కు చెందిన నేతల సంతానం కూడా అడ్డదారిలో పరీక్ష రాసినట్లు గుర్తించింది.

మాజీ ఎంపీటీసీ కూతురు హైటెక్ కాపీయింగ్!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ శివారు బొమ్మకల్‌కు చెందిన ఓ మాజీ ఎంపీటీసీ కుటుంబసభ్యులు కూడా రమేష్‌తో ఒప్పందం కుదుర్చుకుని ఏఈఈ పరీక్ష రాసినట్లుగా సిట్ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఇరిగేషన్‌శాఖలో పనిచేస్తున్న తమ బంధువు ద్వారా రమేశ్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ భర్త రూ.75 లక్షలకు ఒప్పందం చేసుకుని అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు మాజీ ఎంపీటీసీ కూతురు ఎలక్ట్రానిక్ డివైస్ ఉపయోగించి హైటెక్ కాపీయింగ్ ద్వారా పరీక్ష రాసినట్లు సమాచారం. కాగా రమేశ్‌ను విచారిస్తున్న క్రమంలో వారం రోజుల క్రితం పోలీసులు బొమ్మకల్‌కు రావడంతో.. అప్పటికే ఇంటికి తాళం వేసిన మాజీ ఎంపీటీసీ కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది.



సింపుల్‌గా ఒక చిన్న లైన్ చెప్పారు.. కథ రెడీ అయిపోయింది.. పాత్రలు ఎలా ఉండాలో, ఏ స్థాయిలో ఉండాలో చెప్పారు.. రేంజ్ సినిమా సిద్ధమైపోయింది.. పిల్లలను బడికి పంపారు.. రోబో టీచర్ వచ్చి పాఠాలు చెప్పింది.. ఏదో పనిమీద బయటికి వెళ్లి బస్సెక్కారు.. పక్కనే ఓ రోబో వచ్చి కూర్చుని పలకరించింది..

.. ఇవన్నీ జస్ట్ ఏడెనిమిదేళ్లలో.. అంటే 2030 సంవత్సరానికల్లా కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వాస్తవంలోకి వచ్చేస్తాయట. ఇవేకాదు అమెరికా, యూకేలకు చెందిన ఏఐ నిపుణులు ఇలాంటి మరెన్నో అంచనాలను వెలువరించారు. అందులో కీలకమైన ఎనిమిదింటిని ప్రఖ్యాత డెయిలీ మెయిల్ వెబ్‌సైట్ తాజాగా ప్రచురించింది.

\- సాక్షి సెంట్రల్ డెస్క్

ఏఐ.. ఏదైనా సాధ్యమే

భవిష్యత్తులో కృత్రిమ మేధ సాంకేతికత కేవలం ఒక్కరోజులోనే మొత్తం సినిమాను రెడీ చేసి ఇచ్చే స్థాయికి చేరుతుందని న్యూయార్క్‌కు చెందిన ప్రఖ్యాత సైన్స్‌–ఫిక్షన్ రచయిత హఫ్ హోవే అంచనా వేశారు. ''ప్రస్తుతం మేం వాడుతున్న కొన్ని ఏఐ ప్రోగ్రామ్‌లు నిజమైనవా, కల్పితమా అని తెలియని స్థాయిలో అద్భుతమైన ఫొటోలను సృష్టిస్తున్నాయి. అదే రెండేళ్ల కింద ఈ స్థాయి లేదు. ఇప్పుడు సినిమాలను సృష్టించే ఏఐ ప్రోగ్రామ్‌లు కూడా ప్రాథమిక స్థాయిలో ఉన్నాయి. కొన్నేళ్లలో కేవలం ఒక్కరోజులోనే సినిమాలను సృష్టించగలవు..'' అని చెప్పారు. ఏఐ ప్రోగ్రాములు ఇప్పటికే కథలు రాసేస్తున్నాయని గుర్తుచేశారు.

ఒక్క రోజులో సినిమా..



అందరి సంపద జూమ్

ఏఐ సాయంతో.. అవసరాలకు, వ్యక్తులకు తగిన ఉత్పత్తుల రూపకల్పన జరుగుతుందని, ఇది ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తుందని లండన్‌కు చెందిన 'బిగ్ ఫోర్' అకౌంటెన్సీ సంస్థ అనలిస్టులు పేర్కొన్నారు. వచ్చే ఏడేళ్లలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విలువ ఏకంగా 45శాతం పెరుగుతుందని.. ఇది భారత్, చైనా ఆర్థిక వ్యవస్థలను కలిపినదానికంటే ఎక్కువని అంచనా వేశారు.

విద్యార్థులకు తగినట్టుగా ఏఐ పాఠాలు



ఒక్కో విద్యార్థికి సంబంధించి వారిలో ఉన్న లోపాలు, అభిరుచులు, మెరుగుపడాల్సిన అంశాలకు తగినట్టుగా.. వేర్వేరుగా పాఠాలను బోధించే ఏఐ రోబోలు రానున్నాయని లండన్‌లోని రావెన్స్‌బోర్న్ యూనివర్సిటీ కంప్యూటింగ్ అండ్ బిజినెస్ విభాగం హెడ్ అజాజ్ అలీ చెప్పారు. దీనితోపాటు అగుమెంటెడ్ రియాలిటీ (ఏఐ)తో వర్చువల్ తరగతులు, పాఠాలు కూడా.. విద్యార్థులకు అద్భుతమైన శిక్షణను ఇస్తాయని అంచనా వేశారు.

ఇంధన కొరతకు చెక్



త్వరలో ఏఐ సాయంతో క్లిష్టమైన అణు సంలీనం (న్యూక్లియర్ ఫ్యూజన్) సాంకేతికత అందుబాటులోకి వస్తుందని చాట్‌జీపీటీని అభివృద్ధి చేసిన ఓపెన్‌ఏఐ సంస్థ వ్యవస్థాపకుడు శామ్ ఆల్ట్‌మ్యాన్ చెబుతున్నారు. కరోనా, ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక సంక్షోభాలు వంటి పరిస్థితుల్లో ఇంధనం, కరెంటు కొరత సమస్యగా మారిందని.. 2030 నాటికి ఏఐ ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని పేర్కొంటున్నారు.

మనుషుల్లాంటి మేధస్సుతో..

2030 నాటికి కృత్రిమ మేధ మనుషుల స్థాయికి చేరుతుందని.. మనుషులు మాత్రమే చేయగలిగే ఉద్యోగాలు, పనులను కూడా ఏఐ రోబోలు చేయగలుగుతాయని గూగుల్ మాజీ ఇంజనీర్, ఫ్యూచరిస్ట్ రే కుర్జ్‌వేల్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే ఏఐ కొంతమేర స్వతంత్రంగా వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. కంప్యూటర్ టెక్నాలజీలు, ఏఐకి సంబంధించి ఆయన గతంలో వేసిన భవిష్యత్తు అంచనాల్లో ఏకంగా 86శాతం వరకు వాస్తవరూపం దాల్చడం గమనార్హం.





పెద్దలను భద్రంగా చూసుకునేలా..


సినిమాల్లో చూపించినట్టుగా.. ఇంట్లో పెద్దలను కనిపెట్టుకుని ఉండటం, వారికి అవసరాలను తీర్చడం కోసం ప్రత్యేకమైన ఏఐ రోబోలు మరో పదేళ్లలో వస్తాయని లండన్‌కు చెందిన గాలియం వెంచర్స్ సంస్థ వ్యవస్థాపకుడు హీదర్ డెలానీ చెప్తున్నారు. ఈ రోబోలు ఆయా వ్యక్తుల ఆసక్తి, అవసరాలను బట్టి.. తాము నడుచుకునే/ప్రవర్తించే తీరును మార్చుకుంటాయని, ఒక మంచి తోడుగా నిలుస్తాయని అంటున్నారు.

వ్యాధి రాబోతోందని ముందే చెప్పేలా..



మన శరీరంలోని అవయవాల పరిస్థితి, వివిధ రసాయన, జీవ సంబంధ అంశాలను, మన అలవాట్లను పరిశీలించి.. భవిష్యత్తులో రాబోయే వ్యాధులను ఏఐ ముందే చెప్పే స్థాయికి చేరుతుందని అమెరికాకు చెందిన ఓమ్ని ఇండెక్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ వ్యవస్థాపకుడు సిమోన్ బైన్ చెప్పారు. ఇలాంటి అవసరాల కోసం ప్రత్యేకమైన ఏఐ ప్రోగ్రామ్స్ వస్తాయన్నారు.

మానవాళి అంతానికి దారి తీయొచ్చు!



ఏఐతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని చాలా మంది శాస్త్రవేత్తలు చెప్తున్నా.. మరోవైపు దీనికారణంగా మానవాళికి పెను ప్రమాదమని స్టీఫెన్ హాకింగ్, ఎలన్ మస్క్ నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు. ''ఏఐ సామర్థ్యం రోజురోజుకు పెరుగుతోంది. ఈ క్రమంలో మనిషిని మించిన తెలివితేటలు ఉన్న ఏఐ రూపొందితే.. అది తనంతట తాను మరింత మెరుగుపర్చుకుంటుంది. మనుషులను నియంత్రించేందుకు, శాసించేందుకు ప్రయత్నిస్తుంది. 2030 నాటికి భూమ్మీద మానవులంతా అంతమయ్యే పరిస్థితి వస్తుంది..''అని అమెరికన్ కంప్యూటర్ సైంటిస్ట్ ఎలిజర్ యుడ్కోవ్‌స్కీ హెచ్చరిస్తున్నారు.

ఏపీ 34 టీఎంసీలే వాడాలి

కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం లేఖ



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ 34 టీఎంసీలకు మించి కృష్ణా జలాలను తరలించరాదని తెలంగాణ ప్రభుత్వం కృష్ణా బోర్డును కోరింది. గత నెల 19న జరిగిన కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సమావేశంలో బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్ ఈ విషయం స్పష్టం చేశారని, దీన్ని సమావేశం మినిట్స్‌లో పొందుపరచాలని చెప్పింది. ఈమేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ తాజాగా కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు.

సమంగా తాత్కాలిక పంపకాలు

'రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల బటావ్డాను.. నదీ వివాదాల పరిష్కార చట్టంలోని సెక్షన్–3 కింద ట్రిబ్యునల్‌కు అప్పగిస్తే సమస్య పరిష్కారం కానుంది. ఈ నేపథ్యంలో మరో ఏడాది కృష్ణా జలాల తాత్కాలిక పంపిణీకి తెలంగాణ సమ్మతి తెలుపుతుంది. అయితే, ఏపీ, తెలంగాణ మధ్య 66:34 నిష్పత్తిలో కాకుండా.. సమంగా, న్యాయంగా కేటాయింపులను సవరించాలి' అని తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ సమావేశంలో పేర్కొన్నారు. బచావత్ ట్రిబ్యునల్ గంపగుత్తగా కేటాయింపులు జరిపిందని తెలంగాణ నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ సమావేశంలో పేర్కొన్న విషయాన్ని మినిట్స్‌లో చేర్చాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. నాగార్జునసాగర్ జలాశయంలో మిగిలి ఉన్న 18 టీఎంసీల జలాలను.. ప్రస్తుత నీటి సంవత్సరం 2023–24 అవసరాల కోసం తమ రాష్ట్రానికి కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. గత నీటి సంవత్సరంలో తమకు కేటాయించిన వాటాను పూర్తి స్థాయిలో వినియోగించుకోకుండా, అత్యవసర అవసరాల కోసం మిగిల్చి ఉంచామని తెలిపింది. ఈ జలాలను ప్రస్తుత నీటి సంవత్సరానికి క్యారీ ఫార్వర్డ్ చేయాలని నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ తాజాగా కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు.

క్లుప్తంగా...

ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తాం: పొన్నం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైతాంగానికి అశనిపాతంగా మారిన ధరణి పోర్టల్‌ను తాము అధికారంలోకి రాగానే బంగాళాఖాతంలో కలిపివేస్తామని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ కారణంగా రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారని, లక్షలాది మంది రైతులు రెవెన్యూ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి పోర్టల్‌ను తెచ్చినందుకు పశ్చాత్తాపం చెందాల్సిన సీఎం, కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపివేయాలనడం దురదృష్టకరమన్నారు. వడగళ్ల వానలతో నష్టపోయిన రైతులకు రూ.10 వేల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం.. ఇంత వరకు ఒక్క రైతుకు కూడా సాయం చేయలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పొన్నం వ్యాఖ్యానించారు.

ధరణిపై విచారణ జరిపిస్తాం

కాంగ్రెస్ కిసాన్‌సెల్ నేత కోదండరెడ్డి




సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌పై విచారణ జరిపిస్తామని ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ ఎం. కోదండరెడ్డి చెప్పారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లోపాల గురించి తాము మొదటి నుంచీ చెపుతున్నామని, తాము చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఉంటే రైతులు ఇన్ని ఇబ్బందులు పడాల్సి వచ్చేది కాదని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలోని 22 లక్షల మంది రైతాంగానికి వారి భూములపై హక్కు పత్రాలు ఇవ్వలేదని చెప్పారు. కేసీఆర్‌కు రైతుల సెగ తగిలిందని, అందుకే కాంగ్రెస్ పార్టీనుద్దేశించి అర్థం లేని విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గ్రామీణ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థలో కీలక పాత్ర పోషించే వీఆర్వో వ్యవస్థను తీసేసి తిమింగలాలకు రెవెన్యూను అప్పగించడంతో అసలు సమస్య మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతుల ప్రయోజనాలను కాపాడేలా భూగ్యారంటీ చట్టాన్ని తీసుకువస్తామని చెప్పారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను విమర్శించడం ద్వారా ఆయన బీజేపీకి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారని, మద్యం స్కాంలో ఇరుక్కుపోయిన కూతురును కాపాడేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.

బీజేపీతో కేసీఆర్ దోస్తీ బయటపడింది : షర్మిల



సాక్షి, హైదరాబాద్: నిర్మల్ వేదికగా కేసీఆర్ ముసుగు తొలగిందని, బీజేపీతో బీఆర్ఎస్ దోస్తీ బయటపడిందని వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. నోరు విప్పితే బీజేపీని తిట్టే కేసీఆర్ ఇప్పుడు మోదీని పల్లెత్తుమాటా అనడం లేదన్నారు. అవసరానికి తగ్గట్టు వేషాలు మారుస్తూ జనాలను పిచ్చోళ్ళను చేయడమే బీజేపీ, బీఆర్ఎస్‌ల రహస్య అజెండా అని ట్విట్టర్‌లో షర్మిల వ్యాఖ్యానించారు. 'నువ్వు కొట్టినట్లు చెయ్యి – నేను ఏడ్చినట్లు చేస్తా'అన్నట్లు ఇన్నాళ్లు బీజేపీతో కేసీఆర్ దోస్తానా నడిపారన్నారు. ఏ ఒప్పందం లేకపోతే కేసీఆర్ అవినీతిపై చర్యలెందుకు తీసుకోవడం లేదని? కవిత అరెస్టుపై ఎందుకీ సాగదీతని షర్మిల ప్రశ్నించారు. ఈ విషయంలో బీజేపీ తక్షణమే నోరు విప్పాలని, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాహుల్ వ్యాఖ్యలు హాస్యాస్పదం: ఇంద్రసేనా



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ ఉండదంటూ.. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి ఎద్దేవాచేశారు. 'ఉట్టికి ఎగరలేనోడు ఆకాశానికి ఎగురుతానన్నాడు'అన్న చందంగా రాహుల్ తీరుందని, కాంగ్రెస్‌ను భూస్థాపితం చేసేందుకే రాహుల్ ఉన్నారని ఆయన మండిపడ్డారు. ఇంద్రసేనారెడ్డి సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కనీసం ప్రాతినిధ్యం కూడా లేని విషయాన్ని కాంగ్రెస్ గుర్తిస్తే మంచిదని హితవు పలికారు. కుటుంబం ద్వారా వచ్చిన అధికారాన్ని కనీసం నిలబెట్టుకోలేని వ్యక్తి, ఇక్కడ బీజేపీ ఉండదంటూ పగటి కలలు కంటున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, లెఫ్ట్ పార్టీలు కలిసినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

టీపీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీస్ సెల్ చైర్మన్‌గా అగర్వాల్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లింగ్విస్టిక్ మైనార్టీస్ సెల్ చైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన ప్రేమ్‌లతా అగర్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అనుమతి మేరకు నియమించినట్లు పేర్కొన్నారు.

విశ్వ నగరానికి ఇంకెంతో దూరం

అంతర్జాతీయ స్థాయిలో చాలా వెనుకబడి ఉన్న హైదరాబాద్: కేటీఆర్

- దేశంలో మాత్రం అత్యుత్తమ నగరంగా అవార్డులు, రివార్డులు
- వ్యర్థాల సమర్థ నిర్వహణపై సరికొత్త ఆలోచనల కోసం 'రీ థింక్'



'రీ థింక్' ప్రారంభోత్సవంలో కేటీఆర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాజధాని హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగాలంటే చేయాల్సింది ఇంకా చాలా ఉందని రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సాధించిన ప్రగతి, పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలన్నింటి ఫలితంగా హైదరాబాద్ ప్రస్తుతం దేశంలోనే అత్యుత్తమ నగరంగా ఎన్నో అవార్డులు, రివార్డులు పొందుతున్నప్పటికీ.. అంతర్జాతీయ స్థాయిలో మాత్రం చాలా వెనుకబడి ఉందని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ అగ్రభాగంలో ఉన్నట్లు సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ తాజా నివేదిక స్పష్టం చేసిందని మంత్రి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి)లో 'రీ థింక్'పథకాన్ని మంత్రి ప్రారంభించారు. వ్యర్థాల సమర్థ నిర్వహణ, పునర్వినియోగం కోసం సరికొత్త, వినూత్న ఆలోచనలు చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేందుకు 'రీ–థింక్'ను ఏర్పాటు చేశామన్నారు. కాగా పర్యావరణపై నిత్యం ఓ కన్నేసి ఉంచేందుకు, తగిన సమాచారాన్ని తెలుసుకునే లక్ష్యంతో ఆస్కి ఏర్పాటు చేసిన ఎన్విరాన్‌మెంటల్ సర్వైలెన్స్ సెంటర్‌ను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కీలకోపన్యాసం చేశారు.

చెత్తపై నిర్లక్ష్యం తగదు..

చెత్తను తమ సమస్య కాదని ప్రజలు అనుకోవడాన్ని కేటీఆర్ తప్పుపట్టారు. వానాకాలం ముందు నాలాల పూడికలు తీసేటప్పుడు వాటిల్లోంచి సోఫాలు, పరుపులు, దిండ్లు.. ఇలా రకరకాల వస్తువులు బయటపడుతుంటాయని చెప్పారు. ప్రజలు నా ఇల్లు మాత్రం శుభ్రంగా ఉంటే చాలని అనుకుంటూ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని స్పష్టం చేశారు. ప్లాస్టిక్, వస్త్రాలు, ఫర్నిచర్, వాడేసిన వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల వంటి వాటిని సేకరించి, వాటిని పునర్వినియోగానికి సిద్ధం చేసేందుకు ఏకంగా 1962 'ఆర్ఆర్ఆర్' కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్ నగరంలో రోజూ సుమారు 300 టన్నుల కంపోస్టు ఉత్పత్తి అవుతోందని మంత్రి చెప్పారు. రాష్ట్రం మొత్తమ్మీద 229 కంపోస్టు షెడ్ల ద్వారా రోజూ 1,120 టన్నుల కంపోస్టు ఉత్పత్తి అవుతుండగా వీటిని అమ్ముకోవడం ద్వారా స్వయం సహాయక బృందాల మహిళలు ఏటా రూ.8.4 కోట్లు ఆర్జిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటివరకు సుమారు 21 మెగావాట్ల విద్యుత్తును చెత్తను మండించడం ద్వారా ఉత్పత్తి చేస్తున్నామని, ఇలాంటి ప్లాంట్లు మరిన్ని ఏర్పాటు చేసి 2024 డిసెంబర్ నాటికి 101 మెగావాట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా మున్సిపాలిటీలు, పంచాయితీల బడ్జెట్‌లోనూ పది శాతం నిధులను పచ్చదనం కోసం కేటాయించేలా చేశామని చెప్పారు. తాజాగా 'రీ–థింక్'ను ఏర్పాటు చేశామని, ఇకపై రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయితీల్లో వారంలో ప్రతి శనివారాన్ని 'రీ–థింక్'రోజుగా నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

వేల పరిశ్రమలు.. లక్షల కోట్ల పెట్టుబడులు

- స్వరాష్ట్రంలో రూ.2లక్షల 64వేల కోట్ల పెట్టుబడులు, 23వేల పరిశ్రమలు.. 17.77లక్షల మందికి ఉపాధి
- తొమ్మిదేళ్లలో రాష్ట్రానికి 23 వేల పరిశ్రమలు
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 'పారిశ్రామిక దినోత్సవం' నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పారిశ్రామిక విధానాన్ని పరిశీలిస్తే.. టీఎస్‌ఐపాస్ అమలు ద్వారా తెలంగాణ 23 వేల పరిశ్రమలకు అడ్డాగా మారగా, ఈ పరిశ్రమల ద్వారా 17 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 లక్షల ఎకరాలను పరిశ్రమలకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించగా, ఇప్పటికే 28,000 ఎకరాల భూమిని వివిధ కంపెనీలకు కేటాయించారు. ఇందులో ఫార్మాసిటీ, జహీరాబాద్ నిమ్జ్, వరంగల్ కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ తదితర పారిశ్రామిక వాడలున్నాయి. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ఫార్మాసిటీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ పార్క్, దీనితో పాటు హైదరాబాద్ –నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా దీన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. మహేశ్వరంలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో చందన్ వల్లి ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. దండుమల్కాపూర్ ఇండస్ట్రియల్ పార్క్, , సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం సుల్తాన్ పూర్ లో 250 ఎకరాల్లో మెడికల్ డివైజెస్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్‌ను 1,190 ఎకరాల్లో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు. దీని ద్వారా రూ.11,586 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 1,13,000 ఉద్యోగాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు.

ఐటీ రంగంలో తెలంగాణ పురోగతి

ఐటీ రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం మేటిగా నిలిచింది. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఐటీ వార్షిక ఎగుమతుల విలువ రూ.2లక్షల కోట్లకు పైగా చేరింది. ఐటీ రంగాన్ని ద్వితీయశ్రేణి నగరాలకు కూడా విస్తరించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, సిద్ధిపేటలో కూడా ఐటీ టవర్లను నిర్మించారు. వినూత్న ఆవిష్కరణలతో ముందుకువచ్చే యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు టీ–హబ్, వీ–హబ్, టీ–వర్క్స్, రిచ్ సంస్థలు పనిచేస్తున్నాయి. నేషనల్ స్టార్టప్ అవార్డులలో టీ–హబ్ ఉత్తమ ఇంక్యుబేటర్‌గా నిలిచింది.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చట్టం

▶ మొదటి పేజీ తరువాయి

తాను సాధించిన పెట్టుబడి ప్రకటనలను, గత ఏడాది కాలంలో తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, కొత్త ఉద్యోగాల కల్పన వివరాలను కేటీఆర్ వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఐటీ రంగంలో కొత్త శిఖరాలకు చేరుకుంటామని.. ప్రాథమిక మౌలిక వసతుల నుంచి అంతరిక్షం దాకా తెలంగాణ శరవేగంగా పురోగమిస్తోందని చెప్పారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు వదులుకోరని, కేసీఆర్ మరోమారు సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టి పోషిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటన్నారు.

ఫార్మా, బయోటెక్నాలజీలోనూ అద్భుత ప్రగతి

ఫార్మా, బయో టెక్నాలజీ, డిజిటల్ ఇన్నోవేషన్ రంగాల్లో తెలంగాణ అద్భుత ప్రగతి సాధిస్తోందని కేటీఆర్ చెప్పారు. 2012లో కేంద్ర ప్రభుత్వం ఐటీఐఆర్ ప్రాజెక్టును ప్రకటించినప్పుడు తెలంగాణలో ఐటీ ఎగుమతులు 2032 నాటికి రూ.2.5లక్షల కోట్లకు చేరుతాయని ప్రకటించిందని.. ఐటీఐఆర్ అమలు చేయకున్నా ఆ గడువుకు 9 ఏళ్ల ముందే లక్ష్యాన్ని చేరుకున్నామని చెప్పారు. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ ఐటీ రంగం మెరుగ్గా రాణిస్తోందని వివరించారు. లైఫ్ సైన్సెస్ రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, టీ–హబ్ సీఈఓ ఎం.శ్రీనివాస్‌రావు, వీ హబ్ సీఈఓ దీప్తిరావు, పలు ఐటీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల అభివృద్ధిని చాటేందుకు..

- రాష్ట్రంలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ నేతలు

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని చాటేందుకు ఉద్దేశించిన 'మహాజన సంపర్క్ అభియాన్'లో భాగంగా పలువురు కేంద్రమంత్రులు, జాతీయనేతలు రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో కేంద్ర సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు, వాటి అమలుతీరును పరిశీలిస్తున్నారు. ఆయా పథకాల కింద ప్రజలకు లబ్ధి చేకూరుతోందా? లేదా? అనే విషయాలపై దృష్టి పెడుతున్నారు. 2, 3 రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నేతు పర్యటిస్తున్నారు. సోమవారం.. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ మల్కాజ్‌గిరి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు భారతీ బెన్ దీరుభాయ్ షియాల్ హైదరాబాద్, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సంస్థాగత ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ నిజామాబాద్, జాతీయ కార్యదర్శి రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ అరవింద్ మీనన్ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో పర్యటించారు. ఇక మంగళవారం భారతీ బెన్.. భువనగిరి పార్లమెంటు పరిధిలో, సునీల్ బన్సల్.. సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో పర్యటించనున్నారు. ఈ నెల 30 దాకా జరగనున్న 'మహాజన సంపర్క్ అభియాన్'లో భాగంగా రాష్ట్రానికి మరికొందరు జాతీయ నాయకులు, కేంద్రమంత్రులు వస్తారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ ప్రవాస్ యోజన రాష్ట్ర ప్రముఖ్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

బంగాళాఖాతంలోకి వెళ్లేదెవరో.. ప్రజలే నిర్ణయిస్తారు

- భయంతోనే కేసీఆర్ అడ్డగోలు మాటలు
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

అచ్చంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తోందని సీఎం కేసీఆర్‌కు భయం పట్టుకుందని, అందుకే హాస్యాస్పదంగా కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో వేయాలని అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం నాగర్‌కర్నూల్ అచ్చంపేట మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా లక్ష్మీదేవిగండితండాలో మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నామని కేసీఆర్ విర్రవీగుతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో పడేస్తారని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు పోలీసులు లేకుండా.. ముందస్తు అరెస్టులు చేయకుండా నాగర్‌కర్నూల్ సభకు వస్తే బంగాళాఖాతంలోకి వెళ్లేది ఎవరో అర్థమవుతుందన్నారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలను 30 నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి కాలయాపన చేసిన సీఎం కేసీఆర్ ఏముఖం పెట్టుకుని నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారని నిలదీశారు.

ఆంధ్రా నుంచి ఎక్కువ కరెంటు రావడం వల్లనే ఇక్కడ కోతల్లేవ్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కరెంట్ పోతుందని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలో పూర్తి చేసిన ప్రాజెక్టుల ద్వారానే ఈ ప్రభుత్వం కరెంట్ ఇస్తోన్న విషయం సీఎం మర్చిపోయి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం చేపట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్‌లో ఇంకా ఉత్పత్తే మొదలవలేదని, భద్రాది పవర్ ప్లాంట్ ట్రయల్ రన్‌లోనే ఉందని, ఇప్పుడు ఇస్తున్న కరెంట్ ఎక్కడి నుంచి వస్తుందో చెప్పాలని నిలదీశారు. సోనియాగాంధీ చొరవతో పునర్విభజన చట్టంలో పొందుపర్చిన విధంగా ఆంధ్ర నుంచి తెలంగాణకు ఉత్పత్తి చేసే పరిశ్రమల ద్వారా ఎక్కువ కరెంటు రావడం వల్లే ఇక్కడ కోతలు లేవన్నారు. తెలంగాణలో కేసీఆర్ సినిమా అయిపోయిందనీ, నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని భట్టి ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు పాదయాత్రలో గిరిజన మహిళలతో కలిసి భట్టి నృత్యం చేసి.. కార్యకర్తలను ఉత్సాహపరిచారు.



గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న భట్టి విక్రమార్క

ఆశాలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు!

- పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులకు మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వారి సేవలను గుర్తించి రూ.9,750 వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. ఇతర మహిళా ఉద్యోగులకు ఇస్తున్నట్లుగానే ఆశా కార్యకర్తలకు, సెకండ్ ఏఎన్ఎంలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇచ్చేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక అందించాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ శ్వేత మహంతీలను మంత్రి ఆదేశించారు. ఆశాలు, ఏఎన్ఎంలతో నెలవారీ సమీక్షలో భాగంగా సోమవారం టెలీ కాన్ఫరెన్స్‌లో మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ ఈ నెల 14న తెలంగాణ వైద్య, ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

ప్రసవాల్లో ప్రభుత్వాసుపత్రులు టాప్..

ప్రభుత్వ ఆసుపత్రుల చరిత్రలోనే మన ఆసుపత్రులు ప్రసవాలు చేయడంలో రికార్డు సృష్టించాయని హరీశ్‌రావు అన్నారు. 69 శాతం ప్రసవాలతో ప్రభుత్వ ఆసుపత్రులు గణనీయమైన వృద్ధి సాధించాయన్నారు. 16 జిల్లాల్లో 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరగటం గొప్ప విషయమన్నారు. అధిక ప్రసవాలు చేసిన సంగారెడ్డి, నారాయణ్ పేట్, మెదక్, జోగులాంబ గద్వాల జిల్లాలకు అభినందనలు తెలిపారు. సి.. సెక్షన్లు అధికంగానూ, ఇతర అంశాల్లో పనితీరు తక్కువగా కనబరుస్తున్న కరీంనగర్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెటర్నిటీ విభాగం జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని వారం పాటు క్షేత్రస్థాయిలో పరిశీలనకు పంపి తగిన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఇమ్యూనైజేషన్ తక్కువగా నమోదవుతున్న సూర్యాపేట జిల్లాకు ఇమ్యూనైజేషన్ విభాగం జేడీని క్షేత్రస్థాయి పరిశీలనకు పంపాలని సూచించారు. కనిష్ఠ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించిన 53 సబ్ సెంటర్లు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు.

రెండే నెలలు... రూ.పది వేల కోట్ల అప్పులు

- వార్షిక బడ్జెట్ ప్రణాళికలో ఈ ఏడాది రుణసేకరణ లక్ష్యం రూ.40,615 కోట్లు
- ఇప్పటికే 25 శాతం అప్పులు సేకరించిన ప్రభుత్వం
- ఆవిర్భావ దినోత్సవం రోజు ఆర్‌బీఐ నుంచి రూ.1,500 కోట్ల రుణం
- అంతకు ముందుకు ఏప్రిల్, మే నెలల్లో మరో రూ.6 వేల కోట్లు
- ఇతర సంస్థల నుంచి ఒక్క ఏప్రిల్ నెలలోనే రూ.3 వేల కోట్లకు పైగా అప్పులు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది రుణ లక్ష్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పుడే 25 శాతం రుణాలను సేకరించింది. తాజాగా రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్ 2న రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి ప్రభుత్వ సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన రూ.1500 కోట్ల రుణంతో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రుణ సేకరణ రూ.10వేల కోట్ల మార్కు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా బహిరంగ మార్కెట్‌లో సమకూర్చుకున్న రూ.5వేల రుణంతో పాటు తాజా రుణాలు కలిపి ఆర్‌బీఐ ద్వారానే రూ.7,500 కోట్లకు చేరుకున్నాయి. ఇక, రెండు నెలల్లో ఇతర ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను కలిపితే ఈ మొత్తం రూ.10వేల కోట్లు దాటనుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.40,615 కోట్ల రుణాలను సేకరించాలని వార్షిక బడ్జెట్ ప్రణాళికలో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనగా తొలి రెండు నెలల్లోనే అందులో 25 శాతం సమకూర్చుకోవడం గమనార్హం.



ఏప్రిల్‌లో రుణాలు రూ.5,026 కోట్లు

కాగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలోని తొలి మాసానికి సంబంధించిన ప్రభుత్వ ఆదాయ, అప్పుల వివరాలను పరిశీలిస్తే ఏప్రిల్ ఒక్క నెలలోనే ప్రభుత్వం రూ.5,026 కోట్లను రుణాల కింద సమకూర్చుకుంది. ఈ మేరకు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు రాష్ట్ర ప్రభుత్వం నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం తీసుకున్న మొత్తం రుణం రూ.5,026 కోట్లు కాగా, అందులో ఆర్‌బీఐ ద్వారా తీసుకున్నది కేవలం రూ.2వేల కోట్లు మాత్రమే. మిగిలిన రూ.3 వేల కోట్లకు అప్పులను ఇతర ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి సమకూర్చుకున్నట్టు ఆర్థిక శాఖ వర్గాలు చెపుతున్నాయి. మొత్తం మీద గత రెండు నెలల కాలంలోనే ఏడాది రుణలక్ష్యంలో 25 శాతం మేర అప్పులు రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు చేరాయన్నమాట.

ఆర్‌బీఐ నుంచి తీసుకున్న రుణాల వివరాలివి:

తేదీ	రుణ మొత్తం (రూ.కోట్లలో)
ఏప్రిల్18	1,000
ఏప్రిల్25	1,000
మే2	1,000
మే16	2,000
మే30	1,000
జూన్2	1,500



ఇరాక్‌లోని కర్బలా నుంచి విజయానికి గుర్తుగా తీసుకువచ్చిన తల్వార్లను హోంమంత్రి మహమూద్ అలీ సోమవారం ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు బహుకరించారు.

కేసీఆర్‌కు మహిళలంటే.. కూతురు కవితే!

- రాష్ట్రం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో మహిళలకు అవమానం
- ఏఐసీసీ అధికార ప్రతినిధి, రాజస్తాన్ ఎమ్మెల్యే కృష్ణ పునియా



కృష్ణ పునియా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి తెలంగాణలో మహిళలకు అవమానం జరుగుతోందని ఏఐసీసీ అధికార ప్రతినిధి, రాజస్తాన్ ఎమ్మెల్యే కృష్ణ పునియా వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఏర్పాటైన మొదటి మంత్రివర్గంలో మహిళలకు స్థానమే కల్పించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, అధికార ప్రతినిధి కల్వ సుజాతలతో కలిసి ఆమె మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో మహిళలపై దాడులు పెరిగాయని, చైన్‌స్నాచింగ్‌ల నుంచి సైబర్ దాడుల వరకు మహిళలకు రక్షణ లేకుండా పోతోందని చెప్పారు. మద్యాన్ని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు ఇప్పటివరకు కొత్తగా పింఛన్లు ఇవ్వలేదని, కల్యాణలక్ష్మి పథకం ఇవ్వాలంటే ఎమ్మెల్యేలు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం, తోటి విద్యార్థుల వేధింపులు భరించలేక మరో మెడికో ఆత్మహత్యలు చేసుకోవడం లాంటి ఘటనలు దారుణమన్నారు. మహిళలకు అడుగడుగునా అన్యాయం చేసిన కేసీఆర్‌కు మహిళలంటే ముందుగా తన కుమార్తె కవిత మాత్రమే గుర్తుకు వస్తారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండూ ఒకటేనని చెప్పిన పునియా.. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో బీఆర్ఎస్ నేతలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అరెస్టు చేసిన సీబీఐ తెలంగాణకు చెందిన వారిని ఎందుకు అరెస్టు చేయరో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారాలతో ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తోందని, ప్రజలు ఏం సంతోషంగా ఉన్నారని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారని ప్రశ్నించారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఏం తప్పు చేసిందని బంగాళాఖాతంలో కలుపుతారో సీఎం కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.


హరితోత్సవం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న 'హరితోత్సవం'ని ర్వహిస్తున్నట్లు అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగానే తొమ్మిదో విడత హరితహారం ప్రారంభమౌతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని మంత్రి కోరారు. సచివాలయంలో సోమవారం 'హరితోత్సవం'పోస్టర్‌ను అటవీశాఖ అధికారులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతీ గ్రామం, పట్టణం, ప్రభుత్వ కార్యాలయాల్లో హరితహారం విజయాలను ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు ఎంత ప్రత్యేకమో, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు అంతే విశిష్టమైనవని కొనియాడారు. 33 శాతం పచ్చదనం సాధన లక్ష్యంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం జాతీయ స్థాయి ప్రశంసలు అందుకుంటోందన్నారు. ఈ కార్యక్రమానికి దక్కుతున్న ప్రతీ అవార్డు, గుర్తింపులో అందరి భాగస్వామ్యం ఉందని, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనం పెంపుదలకు అందరూ పునరంకితం కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఫోన్ పోయిందని..

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

రహమత్‌నగర్(బోరబండ): రెండు సెల్‌ఫోన్లు పోయాయనే బెంగ. మరో ఫోన్ కోసం నాన్నకు భారం కావద్దన్న ఆవేదన.. ఆ యువకుణ్ని ఆత్మహత్యకు పాల్పడేలా చేసింది. 'అన్నా.. అమ్మానాన్నను బాగా చూసుకో' అంటూ సోదరుడికి ఫోన్ చేసి బలవర్మరణం చెందిన ఘటన విషాదాన్ని నింపింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. బోరబండ రాజ్‌నగర్‌కు చెందిన చుక్కా శ్రీనివాస్ పంజగుట్ట నిమ్స్‌మేలో పని చేస్తున్నారు. ఆయన రెండో కుమారుడు సాయికుమార్ (21) నగరంలోని ఓ కాలేజీలో బీకాం కంప్యూటర్స్ చదువుతూనే పార్ట్ టైమ్‌లో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. నెల రోజుల క్రితం సాయికుమార్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. విషయం తెలుసుకున్న తండ్రి శ్రీనివాస్ కుమారుడికి 'ఈఎంఐ' పద్ధతిలో రూ.28 వేల విలువ చేసే మరో సెల్‌ఫోన్ కొనిచ్చాడు. గత శుక్రవారం ఆ ఫోన్ సైతం పోయింది. దీంతో సాయికుమార్ లోలోపల కుమిలిపోయాడు. శనివారం బోరబండ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు అతడు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రం పాదచారుల ఫోన్ ద్వారా తన సోదరుడు వినోద్‌కుమార్‌కు ఫోన్ చేశాడు. తాను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. అమ్మా నాన్నను నువ్వే బాగా చూసుకోవాలని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆందోళన చెందిన బంధువులు నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లతో పాటు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు తుకారం గేటు వద్ద పట్టాలపై ఓ యువకుడి మృతదేహాన్ని గుర్తించిన రైల్వే పోలీసులు శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లిన శ్రీనివాస్ కుటుంబ సభ్యులు మృతదేహం తమ కుమారుడు సాయికుమార్‌దేనని గుర్తించి కన్నీరు మున్నీరయ్యారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

"జీవితం భగవంతుడు దీక్షగా రాస్తుండే నవల. అందులో ఆయన ఉద్దేశించిన మీ పాత్రకు మార్పులు, చేర్పులు చేయాలని మీరు నిరంతరం ప్రార్థిస్తూ ఆయనకు అంతరాయం కలిగించకండి.
- జుడాయిజం

సాక్షి

మంగళవారం, 6 జూన్ 2023

'బాలాసోర్' కళ్లు తెరిపిస్తుందా?

ఒడిశాలోని బాలాసోర్ సమీపంలో రైళ్లు ఢీకొన్న ఘోర ఉదంతం చోటు చేసుకుని మూడు రోజులు గడుస్తోంది. ఇప్పటికీ అనేక కుటుంబాలు తమ ఆప్తుల ఆచూకీ తెలియక తల్లడిల్లుతున్నాయి. 187 మృత దేహాలను ఇంకా గుర్తించాల్సివుందంటున్నారు. శుక్రవారం సంజె చీకట్లు అలుముకుంటున్న వేళ హౌరా నుంచి చెన్నైకి వేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లూప్ లైన్‌లోకి ప్రవేశించి అక్కడున్న గూడ్స్ రైలును ఢీకొట్టడం, ఆ ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిన బోగీల్లో ఒకటి రెండు పక్క ట్రాక్‌పై పడడం, ఆ ట్రాక్‌పై వెళ్లే బెంగళూరు- హౌరా యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ సైతం ప్రమాదంలో చిక్కుకోవడం ఊహకందని ఉత్పాతం. మృతుల సంఖ్య 275 వరకూ ఉండగా, 1100 మంది గాయపడ్డారు. వీరిలో కనీసం వందమంది వరకూ తీవ్ర గాయాలపాలైనవారున్నారు. విద్రోహ చర్యనో, సాంకేతిక తప్పిదమో ఇంకా నిర్ధారించాల్సే ఉన్నా ఆ దుర్ఘటన వందలాది కుటుంబాల భవితవ్యాన్ని తలకిందులు చేసింది. అనేకులు శాశ్వత అంగవైకల్యం బారినపడ్డారు. సహాయ బృందాలు వచ్చేలోగా స్థానికులు చూపిన చొరవ ఎన్నో ప్రాణాలను కాపాడింది. ఇది విద్రోహ చర్య కావొచ్చని ప్రాథమికంగా నిర్ధారణకొచ్చామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెబుతున్నారు. కారకులెవరో కూడా తెలిసిందంటున్నారు. ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు కూడా ఉంటుంది. ఉద్దేశపూర్వకంగా ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థలో మార్పులు చేయడాన్ని కొట్టిపారేయ లేమన్నది రైల్వే అధికారుల మాట. చెప్పడానికి ఇది బాగానేవున్నా... ఆ వ్యవస్థలో లోపాన్ని గుర్తించి మొన్న ఫిబ్రవరిలో నైరుతి రైల్వే జోన్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ రాసిన లేఖ విషయంలో దేశ వ్యాప్తంగా తీసుకున్న చర్యలేమిటో ఉన్నతాధికారులు వెల్లడించాలి. ఆ లేఖలోని అంశాలు భీతి గొలుపుతాయి. ఆ నెల 8న బెంగళూరు నుంచి న్యూఢిల్లీ వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఇప్పుడు బాలాసోర్‌లో కోరమండల్‌కు ఎదురైన లాంటి సమస్యే వచ్చింది. మెయిన్ లైన్‌లో పోవచ్చని వచ్చిన సిగ్నల్‌కు భిన్నంగా ట్రాక్ మారటాన్ని గమనించి లోకో పైలట్ వెంటనే రైలును నిలిపివేశాడు. లేకుంటే అది కూడా పెను ప్రమాదంలో చిక్కుకునేది.

మన దేశంలో అత్యాధునిక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు వరసగా పట్టాలెక్కుతున్నాయి. అహ్మదాబాద్ - ముంబై మధ్య బుల్లెట్ ట్రెన్ పనులు నడుస్తున్నాయి. కానీ మన రైల్వేల పనితీరు అంతంత మాత్రమే. రోజూ మన రైళ్లు 2 కోట్ల 20 లక్షల మంది ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. 1950లో ఉన్న మన రైల్వే ట్రాక్‌ల నిడివి 53,596 కిలోమీటర్లయితే, ఇప్పుడది 68,100 కి.మీ.కి చేరుకుంది. అప్పట్లో మన రైల్వే ట్రాక్‌ల నిడివిలో సగం కన్నా తక్కువగా...అంటే 21,800 కి.మీ. మాత్రమే ఉన్న చైనాలో 1997 నాటికి 66,000 కిలోమీటర్లకు చేరుకోగా, ప్రస్తుతం అది 1,55,000 కి.మీ ఉందని అంచనా. అంటే మనకు రెట్టింపు అన్నమాట. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చేనాటికి ఉన్న కేటాయింపులతో పోలిస్తే ఇప్పుడు రైల్వే కేటాయింపులు అయిదు రెట్ల వరకూ పెరిగిన మాట వాస్తవమే అయినా... దానికి తగినట్టు సదుపాయాలు పెరుగుతున్న దాఖలా గానీ, మెరుగైన బోగీలు తెస్తున్న తీరు గానీ కనబడటం లేదు. భద్రతా అంశాలు సరేసరి. తరచుగా రైళ్లలో ప్రయాణించేవారికి ఇవన్నీ నిత్యానుభవం. ప్రభుత్వ రంగ ఉద్యోగాలు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయి. రైల్వే శాఖ కూడా దీనికి మినహాయింపు కాదు. మొన్న జనవరి గణాంకాల ప్రకారం ఆ శాఖలో 3.12 లక్షల నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీగా పడి వున్నాయి. వీటిల్లో చాలా పోస్టులు భద్రత, నిర్వహణ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవే. సెంట్రల్ రైల్వేలో భద్రతకు సంబంధించిన విభాగంలో 28,650 పోస్టులుంటే అందులో సగం ఖాళీలే. కొత్త రైళ్లు వస్తున్నాయి. వాటి వేగం కూడా పెరుగుతోంది. కానీ అందుకు తగినట్టుగా ట్రాక్‌లు ఉంటున్నాయా? సిబ్బంది పెరుగుతున్నారా? పాలకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. వేగవంతమైన రైళ్లు వచ్చాయని సంబరపడుతున్నాం గానీ...ఇప్పటికీ మన రైళ్ల సగటు వేగం గంటకు 50 కిలోమీటర్లు మించడం లేదు. దీన్ని అయిదేళ్లలో 75 కిలోమీటర్లకు పెంచుతామని 2017లో రైల్వే బోర్డు ప్రకటించింది. కానీ అది కలగా మిగిలిందని ఇటీవలే కాగ్ అక్షింతలు వేసింది. జపాన్, చైనా, టర్కీ, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్‌లలో రైళ్ల సగటు వేగం 150 - 250 కిలోమీటర్ల మధ్య ఉంటుంది. మన రైళ్ల సగటు వేగం నాసిరకంగా ఉన్నా భద్రతాపరంగా మెరుగైన స్థితిలో ఉండలేకపోతున్నాం. రైళ్లు పెరిగినా, వాటి వేగం పుంజుకున్నా అందుకు అనుగుణంగా ట్రాక్‌లు పెరగకపోవటం వల్ల ఉన్న ట్రాక్‌లపైనే ఒత్తిడి పెరుగుతోంది. ట్రాక్‌ల నిర్వహణ, విద్యుత్, సిగ్నలింగ్ వ్యవస్థల పర్యవేక్షణ వంటివి సక్రమంగా సాగటం లేదు. మరమ్మత్తుల కోసం రైళ్లను ఆపాల్సి రావటంతో 'సూపర్ ఫాస్ట్' భుజకీర్తులు తగిలించుకున్న రైళ్లు కూడా సకాలంలో గమ్యం చేరటం లేదు.

రైళ్లను ఎక్కువగా వినియోగించేది సామాన్యులు, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి పౌరులు. ఇప్పుడు ప్రమాదంలో చిక్కుకున్న కోరమండల్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ల మృతుల్లో ఎక్కువ మంది వలస వెళ్లక తప్పని బడుగుజీవులే కావటం యాదృచ్ఛికం కాదు. బాలాసోర్ ఉదంతం మన పాలకుల కళ్లు తెరిపించాలి. ఇతర సర్కారీ కొలువుల మాటెలావున్నా భద్రతకు అగ్ర ప్రాధాన్యమిచ్చి రైల్వేల్లో కొన్నేళ్ళుగా అలా ఉంచేసిన లక్షలాది ఖాళీలన్నిటినీ భర్తీ చేయాలి. ఆదాయం తప్ప మరేమీ పట్టని ధోరణి ఇకనైనా మారాలి. మౌలిక సదుపాయాల మెరుగుదల, భద్రతకు ప్రాధాన్యం లాంటి అంశాల్లో రాజీ పనికిరాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.విదియ ఉ.5.43 వరకు, తదుపరి తదియ రా.3.38 వరకు, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.12 వరకు తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.12.34 నుండి 2.07 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.07 నుండి 8.59 వరకు, తిరిగి రా.10.54 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** రా.9.32 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వాదోపవాదాల విషాదం



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

రైల్వే సిగ్నల్స్ నిర్వహణ వ్యవస్థపై నిరంతరం కన్నువేసి, ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ఉండకపోతే రైలు ప్రమాదాలు తరచూ సంభవించే అవకాశం ఉందని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నైరుతి రైల్వే ప్రధాన అధికారి హెచ్చరించారు! అలాగే, రైలు ప్రయాణికుల భద్రత గురించి 'కాగ్', పార్లమెంటరీ స్థాయీ సంఘం అప్రమత్తం చేస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత కేంద్ర కమిటీలు, ఉన్నతస్థాయి విచారణ సంఘాల నివేదికలను అధికారులు ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు? రైళ్లు ఢీకొనకుండా 'కవచ్' రక్షణ వ్యవస్థను రూపొందించినా, బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గాల్లో కాపలా లేని లెవెల్ క్రాసింగ్స్‌ను కూడా తొలగించినా రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ లోపాల్ని పరిష్కరించడానికి ప్రయత్నించే బదులు.. మంత్రులు రాజీనామాలు చేయాలని, కాదు కాదు... కింది తరగతి రైల్వే ఉద్యోగుల్ని, కార్మికుల్ని శిక్షించాలని వాదోపవాదాలకు దిగడం కూడా విషాదమే!

"వందలాదిమంది ప్రయాణికుల దుర్మరణానికి దారి తీసిన ఒడిశా రైలు ప్రమాదానికి కారకులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఈ శతాబ్దంలోనే ఇది అతి పెద్ద ప్రమాదం."
- ప్రధాని నరేంద్ర మోదీ (4.6.2023)

"చాలాకాలంగా భారత రైల్వేలోని సిగ్నలింగ్ వ్యవస్థ నిర్వహణలో ఉన్న తీవ్రమైన లోపాల గురించీ, వైఫల్యాల గురించీ, రైళ్ల రాకపోకలను తెలియజేసే గుర్తులను సూచించే సరైన పద్ధతుల గురించీ; రైలు బయలుదేరిన తరువాత, రైలు వెళ్లే దిశను మార్చవలసి వస్తే ఆ మార్పును సూచించే గుర్తును తెలిపే విధానం గురించీ స్పష్టంగా ఉంది. కానీ నిర్దిష్టమైన సిగ్నల్స్‌ను అనుసరిస్తూ లోపాల్ని తక్షణం సవరించకపోతే - రైలు దుర్ఘటనలు అనివార్యమవుతాయి..." అని కూడా నైరుతి రైల్వే ప్రధాన అధికారి ఈ ఏడాది ఫిబ్రవరి 9 న హెచ్చరించారు. అంతేగాదు, రైల్వే సిగ్నల్స్ నిర్వహణ వ్యవస్థపై నిరంతరం కన్నువేసి, సరిదిద్దుకుంటూ ఉండకపోతే రైలు ప్రమాదాలు తరచూ సంభవించే అవకాశం ఉందని ఆ ఉన్నతాధికారి హెచ్చరించారు. అలాగే, రైలు ప్రయాణికుల భద్రత గురించి 'కాగ్', పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నివేదికల హెచ్చరికలను పాలకులు పెడచెవిన పెట్టడానికి కారకులెవరన్న ప్రశ్నలకూ సమాధానం లేదు!

ఈ పై కారణాలను పరిశీలించినప్పుడు ఎవరిని నిందించాలి? పాలకుల ఆధ్వర్యంలో నడుస్తున్న కేంద్ర కమిటీలు, దఫదఫాలుగా నియమించిన సాధికార ఉన్నతస్థాయి విచారణ సంఘాల నివేదికలను, వాటి సారాంశాన్ని అధికారులు ఎందుకు పాటించడం లేదన్నది అసలు ప్రశ్న. రైలు ప్రమాద ఘటన సందర్భంగా, మహబూబ్‌నగర్ వద్ద రైలు ప్రమాదంలో 112 మంది ప్రయాణికులు చనిపోయినందుకు విలవిలలాడిన నాటి కేంద్ర రైల్వే మంత్రి, గాంధేయవాది అయిన లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి క్షణాలలో రాజీనామా చేసి ఆదర్శంగా నిలబడ్డారు. ప్రధాని పండిట్ నెహ్రూ 'వద్దని' వారించినా లాల్‌బహదూర్ రాజీనామాకే పట్టుబట్టారు! మహబూబ్‌నగర్ దుర్ఘటన తరువాత కొలది రోజులకే తమిళనాడులోని అరియలూర్ దుర్ఘటనలో 144 మంది చనిపోయారు. ఈ రెండు ఘటనలూ లాల్‌బహదూర్‌ను కుదిపేశాయి.

రెండో మాట



68,100 కిలోమీటర్ల నిడివిగల రైల్వే లైన్లతో కూడిన భారత వ్యవస్థలో గత 15 ఏళ్లలో జరిగిన ప్రధాన దుర్ఘటనలు: జ్ఞానేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (మృతులు 148), ఉత్తర బంగా-వనాంచల్ ఎక్స్‌ప్రెస్ (63 మంది), ఛాప్రా-మథుర ఎక్స్‌ప్రెస్ (63 మంది), హుబ్లీ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (25 మంది), తమిళనాడు-ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ (30), యూపీ సంత్‌కబీర్-గోరఖ్‌ధామ్ ఎక్స్‌ప్రెస్ (25), డెహ్రాడూన్-వారణాసి జనతా ఎక్స్‌ప్రెస్ (30), పాట్నా-ఇండోర్ ఎక్స్‌ప్రెస్ (150), బికనీర్-గౌహతి ఎక్స్‌ప్రెస్ (9 మంది), హౌరా-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ (140).

రైళ్లు ఢీకొనకుండా 'కవచ్' రక్షణ వ్యవస్థను రూపొందించినా, బ్రాడ్‌గేజ్ రైల్వే మార్గాల్లో కాపలా లేని లెవెల్ క్రాసింగ్స్‌ను కూడా తొలగించినా రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదుపాజ్ఞల వ్యవస్థ పకడ్బందీగా లేనందున జరుగుతున్న ఈ వరస రైలు దుర్ఘటనల నివారణకు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కూడా అక్కరకు రావడం లేదు. అంటే సిబ్బందికి ఇచ్చే శిక్షణలో కూడా లోపం ఉందని పలువురు రైల్వే అధికారుల నోట కూడా వినవస్తోంది. కానీ ఈ తీవ్ర లోపాల్ని పరిష్కరించడానికి ప్రయత్నించే బదులు కింది తరగతి రైల్వే ఉద్యోగుల్నీ, కార్మికుల్నీ శిక్షించే మార్గాలను పాలకులు వెతకడానికి ప్రయత్నించడం సమంజసం కాదు.

ఒకవైపున రైల్వేబోర్డే సిగ్నలింగ్‌లో లోపం వల్ల ఒడిశా రైలు ప్రమాదం జరిగిందని చెబుతున్నప్పుడు, ప్రమాద కారణాల్ని కార్మిక సిబ్బందిపైకి నెట్టడానికి ప్రయత్నించడం సరి కాదు. ఆధునిక పరిజ్ఞానం ఆకళింపులో ఉన్నా మానవుల స్వయం పరిమితుల్ని కూడా గమనించుకోవాలి.

అక్కడికీ ఒక సీనియర్ రైల్వే అధికారి ఒక విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారు: "ఇంటర్ లాకింగ్‌లోని సాఫ్ట్ వేర్ లేదా హార్డ్ వేర్ పనిచేయడంలో సంభవించే లోపం వల్ల కూడా రైళ్లకు సూచించవలసిన లూప్‌లైన్, మెయిన్ లైన్ ఎంపికలో గందరగోళానికి అవకాశం ఉంది. అంటే సిగ్నల్ ఒకటై, స్విచ్ ఆపరేషన్ వేరైతే ఈ ప్రమాదానికి ఆస్కారం ఉంది (5.6.23). ఈ ఘోరానికి రైల్వేమంత్రి రాజీనామా పరిష్కారం కాకపోవచ్చుగాని, ఆ స్థానంలో మరొకర్ని విచారణ పేరిట తేలిగ్గా ఇరికించే అవకాశం ఉంది. ఇంతకూ మనిషి (మంత్రి కూడా మనిషే అయితే) స్వార్థం ఎలా పనిచేస్తుందో కవి 'సినారె'కు బాగా తెలిసినట్టుంది:

"తోడుగ సాగే నీడను కూడా
వాడుకుంటుంది స్వార్థం
ఆపై వాణ్ణే పాచిక చేసే
ఆడుకుంటుంది స్వార్థం
మనిషిలోని ఆ చీకటి కోణం
మార్చే వేషాలెన్నో -
చిటికెడు పేరుకు నీతిని
నిలువున చీల్చేస్తుంది స్వార్థం
మూరెడు గద్దె కోసం
జాతి పరువునే ఆరవేస్తుంది స్వార్థం!"

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వృథా వద్దు



'యూజ్ అండ్ త్రో' మనస్తత్వానికి ముగింపు పలకడం అంటే కాలుష్యాన్ని తగ్గించడం మాత్రమే కాదు, సృష్టిని గౌరవించడం కూడా! మన ప్రతి వాడకం బాధ్యతాయుతంగా ఉండాలి. - జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మికవేత్త

అంతులేని విచారణ!



సంతోషించడానికేమీ లేదు. ముఖ్తార్ అన్సారీ అనే గ్యాంగ్‌స్టర్ కమ్ పొలిటీషియన్ 31 ఏళ్ల 10 నెలల తర్వాత గానీ హంతకుడని తేలలేదు. న్యాయ వ్యవస్థ పరిమితులకు ఈ తీర్పు నిదర్శనం. - ప్రవీణ్ పాయ్, సుగంధాల నిపుణుడు

దేశవాళీ నాణ్యత



ఫైజర్, మాడెర్నా కంపెనీల కోవిడ్ వ్యాక్సిన్‌లలో క్యాన్సర్‌ను కలిగించే డీఎన్‌ఏ బయటపడింది! ఈ రెండు సంస్థలు భారతీయ వ్యాక్సిన్‌లతో తమ వ్యాక్సిన్‌లను భర్తీ చేయించాలని నేటికీ తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నాయి. భారతీయ తయారీ వ్యాక్సిన్‌లకు అండగా నిలిచిన మోదీ ప్రభుత్వానికి ఇప్పటికైనా పూర్తి మార్కులు వేద్దామా?
- సిన్హా, పొలిటికల్ ఎనలిస్ట్

ఆ మాటెందుకు!



అశోక్‌జీ! మీ '72 హూరైన్' మూవీ టీజర్ చూశాను. కశ్మీరీ హిందువులపై కూడా మంచి డాక్యుమెంటరీనే వచ్చింది. అయితే చివర్న వాళ్లు, 'ఉగ్రవాదానికి మతం లేదు' అనే కార్డ్ వేశారు. మీపై అలాంటి ఒత్తిడి ఉండదనే ఆశిస్తున్నాను. (కో-డైరెక్టర్ అశోక్ పండిత్‌ను ట్యాగ్ చేస్తూ).
- నీరజ్ అత్రి, రచయిత

శకుని మామ



80లలో, 80లకు ముందు పుట్టిన పిల్లలు ఈ లెజెండ్‌ని ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. ఎందుకంటే మనం ఆయన అద్భుత నటనా నైపుణ్యాన్ని కళ్లార్పకుండా చూశాం. టీవీలో ప్రతి ఆదివారం అంతా ఎదురుచూస్తుండే 'మహాభారతం' సీరియల్ పాత్రలలో ఒకరైన 'శకుని మామ'ను గుఫీ పైంటాల్‌లా వేరెవరూ పోషించలేరు. ఆయనకు శ్రద్ధాంజలి. - ప్రాప్తి, ఎనభైల చిన్నారి

లోపం ఎక్కడుంది?!



బిహార్‌లో గంగానదిపై మరమ్మతులు జరుగుతున్న భాగల్‌పూర్ వంతెన రెండోసారి కుప్పకూలింది! బీజేపీ, జేడీయూలు అధికారంలో ఉండగా 2015లో ఈ వంతెన నిర్మాణం మొదలైంది. 2020లో నిర్మాణం దాదాపుగా పూర్తయింది. మొదటిసారి 2021లో గాలి, వానకు కూలిపోయింది. 1700 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ వంతెన ఇలా మాటిమాటికీ పడిపోవడం ఏమిటి!!
- ఫిజా, యూట్యూబర్

కష్టకాల అసహనం



ఒడిశా రైలు విషాదంలో ఆయన గొప్ప అంకిత భావంతో, చిత్తశుద్ధితో పని చేస్తున్నారు. గత 3 రోజులుగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ నిరంతరం ఘటనా స్థలంలోనే ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కష్టకాలంలో మనం అడగవలసింది మంత్రుల రాజీనామా కాదు, జరగవలసిన సంస్కరణల గురించి!
- డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ అహ్మద్, డిబేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

కరోనా విధ్వంసానికి గురుతుగా...

వర్తమాన కవిత్వ ప్రవాహాన్ని ఒరుసుకుంటూ సాగుతున్న భిన్న భిన్న శోక క్రోధ రస గీతాల లయలు 'నిజం' వచన పద్యాలు. 'నిజం' కలం నుండి వచ్చిన కొత్త పుస్తకం 'బూడిద చెట్ల పూలు' కొన్ని కవితా ఖండికల కూర్పు కాదు, ఒక ఊపు. కవి ఒక మూడ్ లో బందీ అయి కట్లు తెంపుకొని బయట పడే ప్రయత్నంలో పెట్టిన వరుస కేకలు.

ప్రాథమికంగా ఇది కరోనా విలయతాండవాన్ని ఉద్దేశించిన కవితల సంపుటి. పుస్తకం పేరు కరోనా సృష్టించిన శవరాశుల దహన శేషాన్ని ఉద్దేశించినదే. కవితల్లో నిరసన జ్వాలలు ఎక్కువ. 'రాజును మోసి జనాన్ని ద్వేషించే/ వ్యాపారిని ప్రేమించి వ్యాక్సిన్ను చెట్టెక్కించే/ విష వాసల ఆకాశం కింద /అనాథ విత్తుల పైరులై విరగపండుతారు' అంటూ ప్రభు వ్యాపార పక్షపాతాన్ని నిలదీస్తారు కవి. 'కట్టుబట్టలతో కదిలిపోతున్న జాతి, సాటి దేశాలకు తన చిరునామా/ వల్లకాడని చెబుతోంది/ సాహసించి పరామర్శకు రావొద్దని హితవు పలుకుతోంది' అని వల్లకాటి వాఙ్మూలం రాస్తున్నారు. ఇలా కరోనా విలయానికి భస్మమైన జీవుల బూడిద చెట్ల పూలను ఎన్నింటినో తాకవచ్చు.



మిగతా కవితల విషయానికొస్తే కొన్నిట్లో నిరసన కాగడాల్లా ధిక్కార జ్వాల అక్షరాల వరుస కడుతుంది. సామాజిక హింసలో సామాన్యుల గోస కవి గుండెల్ని కెలికినట్లు వేదన, ఆర్ద్రత కంటిని తడిపేస్తుంది. 'ప్రజలందరూ దేవతావస్త్రాల్లో వెలిగిపోతున్నారు/ అన్నాకలుండని రామ భజనామృత సేవనంలో తరిస్తున్నారు' అని తెలుగు కవిత్వానికి తెగువనద్దుతున్నారు. బాల్యాన్నీ, ప్రకృతినీ, అడవినీ, పక్షులనూ 'నిజం' తన కవితల్లో సందేశాత్మకంగా వాడుకున్నారు.


ఈ కవిలో ఉన్న మరో ప్రత్యేకత భాషా ప్రయోగం. పత్రికా రచనతో వచ్చిన పట్టు వల్ల పదాలతో సర్కస్ చేయించగలరు. కొత్త అర్థాలను చెప్పే పదజతులను సృష్టించగలరు. సుమారుగా ప్రతి కవితలోనూ ఈ మెరుపు కనిపిస్తుంది. 'చమత్కారంతో కూడిన నూతన పదసృష్టి ఈ కవి హాల్ మార్క్. వాటిలో అద్భుతమైన, ఆహ్లాదకరమైన చమత్కారం, హాస్యం దాగి ఉన్నాయి' అంటూ ఎలనాగ ఈ కవిత్వంలోని శిల్ప సమన్వయాన్ని తన మాటల్లో పేర్కొన్నారు.

ఈ పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థను శాస్త్రీయంగా అర్థం చేసుకోలేక, భ్రమలకు లోనవుతున్న కాలంలో మనసా వాచా రాజ్యంపై తిరగబడే కవిగా గార శ్రీరామమూర్తి (నిజం) పూర్తిగా 'నిజం' వైపు నిలబడుతున్నారు. తన కవిత్వం ద్వారా అంతా నిజమే చెబుతానని మనిషిపై ప్రమాణం చేస్తున్నారు. ఈ విలక్షణత తెలుగు కవిత్వానికి ఎంతో అవసరం.

- బి. నర్సన్, విశ్లేషకుడు, 94401 28169

ఫ్యూడల్ ఔదార్యాల పరిమితులు!

అభిప్రాయం



దివికుమార్

ఇటీవల ఫేస్‌బుక్‌లో ఎవరో రాసిన ఒక అభిప్రాయాన్ని మా మిత్రుడు ఒకరు ప్రశ్న రూపంలో నాపై సంధించాడు. జవాబు నన్ను చెప్పమంటాడు. దాని సారాంశమేమిటంటే... తెలంగాణలో ఆధునిక విద్యా సౌకర్యాల్లాంటివి కల్పించిన మహాఘనత వహించిన నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడటం, తెలంగాణకు కమ్యూనిస్టులు చేసిన ద్రోహం కాదా అని! కురుక్షేత్ర మహాసంగ్రామంలో శ్రీకృష్ణుడు యుద్ధాన్ని నడిపించాడే కానీ యుద్ధం చేయలేదు. అలాగే మన సందర్భంలో పోరాడితే తప్ప తమ బతుకులు బాగు చేసుకోలేని తెలంగాణ రైతాంగం యుద్ధం చేసింది. అందుకు అన్ని రకాల నిర్మాణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించింది కమ్యూనిస్టు పార్టీ.

నిజాం కాలేజీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం లాంటి మహావిద్యాలయాలు ఆధునిక ఆసుపత్రులు, వరంగల్లులో ఆజం జాహి మిల్లులు తరహా ఆధునిక పరిశ్రమలు అందించిన నైజాం ప్రభువు గురించి ఈ తరహా వాదన చేయడం ఇది మొదటిసారి కాదు. మన పల్లెల్లో ప్రాచుర్యం పొందిన సామెత ఒకటి ఉంది. 'మంచివాని బుద్ధి... మాంసం కాడ తెలుస్తుంది' అని! అందుకు నిదర్శనంగా కొన్ని ఉదాహరణలు చూద్దాం.

1950లకు పూర్వం సూర్యాపేట - కోదాడ నడుమ మునగాల పరగణా ఉండేది. ఆ పరగణా జమీందారు నాయని వెంకటరంగారావు. తన వద్ద దివానుగా ఉన్న కొమర్రాజు లక్ష్మణరావు చేసిన సాహిత్య, సాంస్కృతిక కృషికి మునగాల జమీందారు చాలా సహాయపడ్డారు. కానీ ఆ రాజావారి జమీలో కౌల్దారీ రైతుల హక్కుల పోరాటం మొదలయేసరికి వారి ఉద్యమాన్ని క్రూరంగా అణచివేయడానికీ, చిత్రహింసల పాల్జేయడానికీ, ఆఖరికి దాదాపు 14 మంది రైతాంగ కార్యకర్తలను బలితీసుకోవడానికి రాజా వెనుదీయలేదు.



అలాగే 1946లో గుర్రం జాషువాకు బెజవాడలో గజారోహణతో నగరవీధులలో ఊరేగింపు జరపడానికి చల్లపల్లి కోట నుండి జమీందార్ రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహద్దరు తన ఏనుగును పంపి ఔదార్యాన్ని చాటారు. కానీ అదే సంవత్సరం - 1946లోనే కృష్ణానదిలోని గాజుల్లంకలో రైతులు, తమకు గల భూమిపై హక్కుల కోసం పోరాడితే ముగ్గురిని కాల్చి చంపారు. వారిలో బావిరెడ్డి వియ్యమ్మ అనే మహిళా రైతు కూడా ఒకరున్నారు. కొన్ని సందర్భాలలో ఎంతో ఔదార్యాన్ని ప్రదర్శించినవారే తమ వర్గ ప్రయోజనాల దగ్గర కొచ్చేసరికి ఎంత కఠినాత్ములైపోతారో ఈ విషయం స్పష్టం చేయడం లేదా!

మైసూర్ పాలకులు హైదరాలీ, ఆయన కొడుకు టిప్పు సుల్తాన్‌లపై బ్రిటిష్‌వాళ్లు దురాక్రమణ యుద్ధాలు చేసినపుడు నిజాం నవాబులు బ్రిటిష్ వారికే సహాయపడ్డారు. 1857 నాటి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా బ్రిటిష్ వారికి రక్షకులుగా నిజాం నవాబులు ఉన్నారు. ఆ రకంగా అనాటి చరిత్రలో రాజకీయంగా వారిది పూర్తిగా అభివృద్ధి నిరోధక పాత్ర. చిట్టచివరి నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ కూడా అంతే! తన ఫ్యూడల్ రాచరికానికి మూలస్తంభాలైన (హిందూ) దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, పటేళ్ళు, పట్వారీలపై తెలంగాణ రైతాంగం ఉద్యమం ప్రారంభం నుండీ ప్రజల్ని తీవ్రంగా అణచివేశాడు నిజాం.

పాలకులు ధనంతో సులువుగా లభించే కీర్తి ప్రతిష్ఠలను తమ తమ ఉదార పద్ధతులతో సాధించుకుంటారు. ప్రజా సౌకర్యాల కల్పన ద్వారా మరికొన్ని ప్రశంసలు అందుకుంటారు. వారి ఉదార గుణశీలతను వ్యాప్తి చేసే యంత్రాంగం నెలకొల్పుకుంటారు. విశ్లేషకులు కొందరు తమ తమ అభీష్టాలను బట్టి ఒకటో, కొన్నో సుగుణాల్ని చూపి, నూరు దోషాలను విడిచిపెడతారు.

వ్యాసకర్త అధ్యక్షుడు, జనసాహితి
మొబైల్: 94401 67891

క్షణభంగురం

ఒక అందమైన, ఆహ్లాదకరమైన ప్రకృతి చిత్రాన్ని ఆసరాగా చేసుకొని మానవ జీవితానికి సంబంధించిన ఒక గంభీరమైన వేదాంత సత్యాన్ని చెబితే, చదివిన పాఠకుని మనసును అది ఎంతో సౌమ్యంగా ఆకట్టుకుంటుంది. ఈ భూమి మీద నివసించే ప్రాణికోటిలో ఏ ఒక్క ప్రాణి జీవితమూ శాశ్వతమైనది కాదన్న సత్యం అందరూ ఎరిగినదే. బతుకు చంచలత్వానికి సంబంధించిన ఈ నిజాన్ని జక్కరాజు వెంకటకవి తాను రచించిన 'ఆంధ్ర కామందకము' కావ్యంలో 'తొలకెడి జలముల లోపలి/కలువల చెలికాని నీడగతి సకలప్రా/ణుల బ్రతుకు చంచలంబని/తలచి విభుడు మంచిపనులె తా జేయదగున్' (ద్వితీయాశ్వాసం, 38 కంద పద్యం) అనే పద్యంలో వర్ణించిన ఒక అందమైన ప్రకృతి చిత్రంలో పొందుపరిచి చెప్పాడు. ఆ ప్రకృతి చిత్రం ఇది:



అది ఒక పౌర్ణమి నాటి రాత్రి. నిండు చంద్రుడు పండు వెన్నెలను కురిపిస్తున్నాడు. ఆ వెన్నెల చల్లదనంలో ప్రకృతి పులకించిపోతూవుంది. విరబూసిన కలువలతో నిండి ఉన్న ఒక కొలను అందులో భాగమై ఉంది. నిశ్చలంగా ఉన్న ఆ కొలనులోని నీరు, ఎక్కడి నుంచో మృదువుగా వీస్తూ వచ్చిన గాలి తెరలకు అంతే మెత్తగా అలలుగా కదలసాగింది. అలా కదులుతున్న కొలను నీటి అలలలో, అప్పటి దాకా నిశ్చలంగా ఉన్న చందమామ ప్రతిబింబం కూడా ఎవరో కదిలించినట్లుగా కదలసాగింది. అలా సన్నగా వీచిన ఒక గాలి తెరకే కదిలిపోయిన కొలను నీటిలోని చందమామ నీడతో, ప్రపంచంలోని సకల ప్రాణుల మనుగడలోని క్షణికత్వాన్నీ పోల్చి చెప్పి, ఏ మనిషి బతుకైనా సరే ఇక్కడ శాశ్వతం కాదు. కనుక బతికున్న రోజులలో సాధ్యమైనన్ని మంచి పనులను చెయ్యాలని చెప్పడం ఇందులో ముఖ్యోద్దేశం. అందరూ గుర్తించి ఆచరించవలసిన అంశం.

- వెంకట్ భట్టు

క్లుప్తంగా...

అన్ని సౌకర్యాలున్నాయి.. చేర్పించండి

- ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరిన డీఈఓ



పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్న డీఈఓ

వైరా: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు – మన బడి పథకం 'ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు సమకూరాయని ఖమ్మం విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ తెలిపారు. బడిబాటలో భాగంగా వైరా పట్టణంలో సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మాటూరుపేట కాలనీలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలను అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడమే కాక ఉచితంగా నోట్ పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నందున తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే సింగరేణి రక్షణ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడడం, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండడంతోనే అమ్మలాంటి సింగరేణి బొగ్గు గనుల సంస్థను కాపాడుకోగలిగామని ఎమ్మెల్సీ కె.కవిత అన్నారు. సంస్థ విస్తరణ చేపట్టి కొత్తగా సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఇతర రాష్ట్రాలకు విద్యుత్ ఇవ్వడంతో పాటు రాష్ట్రంలో వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చుకోగలిగామని పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింగరేణి సంబరాలు జరుపుకుంటున్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆమె ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి కార్మికులకు ఇంక్రిమెంట్లు, వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలను సాధించుకున్నామని తెలిపారు. కారుణ్య ఉద్యోగం వద్దనుకున్న వారికి గతంలో ఇచ్చిన రూ.10 లక్షల పరిహారాన్ని రాష్ట్రం వచ్చాక రూ.25 లక్షలకు పెంచామన్నారు. సింగరేణి క్వార్టర్స్‌కు ఉచిత విద్యుత్, ఏసీ సౌకర్యాలు, ఇంటికి రూ.పది లక్షల వరకు వడ్డీలేని రుణాలు, మహిళా కార్మికులకు రెండేళ్ల చైల్డ్ కేర్ లీవ్, దివ్యాంగులకు ఉద్యోగాలు, కార్మికుల పిల్లలకు ఐఐటీ, ఐఐఎం లాంటి చదువులకు ఫీజురీయింబర్స్‌మెంట్ చేయడం వంటి అనేక చర్యలను ప్రభుత్వం తీసుకుందని ఆ ప్రకటనలో వివరించారు.

'..ఇది కల్వకుంట్ల ఖజానోత్సవం'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రభుత్వ పరంగా నిర్వహించిన విద్యుత్ విజయోత్సవంపై ట్విట్టర్ వేదికగా బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ సెటైర్లు వేశారు. 'డిస్కంల నిండా అప్పులు.. విద్యుత్ కొనుగోళ్ల పేరిట స్కాములు.. ప్రజలకేమో ఛార్జీల తిప్పలు'అంటూ ఎద్దేవా చేశారు. 'ఇది విద్యుత్ విజయోత్సవం కాదు కల్వకుంట్ల ఖజానోత్సవం'అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

'వ్యవసాయం'లో గణనీయ వృద్ధి: ఆగ్రోస్ ఎండీ

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదేళ్లలో వ్యవసాయ రంగంలో రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందని ఆగ్రోస్ ఎండీ, తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రాములు తెలిపారు. సోమవారం అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యవసాయ కమిషనరేట్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. రాములు మీడియాతో మాట్లాడుతూ సీఎం స్వయంగా రైతు కావడంతో దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేశారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.రాజారత్నం మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వ్యవసాయరంగ రూపురేఖలను మార్చివేశాయన్నారు. సీఎం దిశానిర్దేశంలో వ్యవసాయశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుందని సంఘం రాష్ట్ర కార్యదర్శి జె.తిరుపతి తెలిపారు.

డీజీపీ ఆఫీసులో పర్యావరణ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం డీజీపీ కార్యాలయంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, డీజీపీ అంజనీకుమార్, పలువురు సీనియర్ పోలీస్ అధికారులు మొక్కలు నాటారు. అలాగే, సోమవారమే దామోదర్ జన్మదినం కావడంతో ఆయనకు పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. మొక్కలు నాటిన వారిలో అడిషనల్ డీజీలు రాజీవ్‌రతన్, సంజయ్ కుమార్ జైన్, ఐజీలు కమల్‌హాసన్‌రెడ్డి, ఎం.రమేశ్ ఉన్నారు.

రేషన్ డీలర్ల సమ్మెబాట

- రాష్ట్రవ్యాప్తంగా తెరుచుకోని చౌకధరల దుకాణాలు
- 22 డిమాండ్ల కోసం డీలర్ల పట్టు
- బుజ్జగింపు ప్రయత్నాలు విఫలం
- నేటి వరకు గడువు ఇచ్చిన మంత్రి గంగుల
- సమ్మె విరమించకపోతే ప్రత్యామ్నాయ మార్గాల్లో బియ్యం పంపిణీ చేస్తామని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌డీలర్లు సమ్మె బాట పట్టారు. డీలర్ల కమీషన్ పెంపు, గౌరవ వేతనంతోపాటు ఇతర డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్నట్లు డీలర్ల సంఘం నాయకులు ప్రకటించారు. సమ్మె బాట పట్టకుండా పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గత నెల 22న వీరితో చర్చలు జరిపి ఒప్పించినప్పటికీ, హామీలు నెరవేర్చలేదనే కారణంతో అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 3 నుంచే సమ్మెలోకి వెళ్తున్నట్లు నిర్ణయించుకొని రాష్ట్రవ్యాప్తంగా డీలర్లకు సమాచారం అందించారు. సోమవారం నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించాల్సి ఉండగా, పూర్తిస్థాయిలో సమ్మెకు దిగారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు తెరుచుకోలేదు. డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ఇతర సంఘాల నాయకులు, 33 జిల్లాల రేషన్ డీలర్లు సోమవారం సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమ్మె సమయంలో వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయాలని తీర్మానించారు. తమ 22 డిమాండ్లలో 20 తీర్చేందుకు మంత్రి గంగుల సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, జీవోలేవీ వెలువడలేదని సంఘాల నాయకులు చెప్పారు.

ప్రభుత్వ దిద్దుబాటు చర్యలు షురూ!

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11వేల మంది రేషన్ డీలర్లు నిరవధిక సమ్మెకు దిగడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మంత్రి గంగుల సోమవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఇతర అధికారులతో మాట్లాడి ప్రజలకు బియ్యం పంపిణీ జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ డీలర్ల సంఘాల నాయకులతో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదని సమాచారం. జిల్లాల వారీగా అధికారులు డీలర్ల సంఘాల నాయకులతో జరిపిన సంప్రదింపులు ఫలించలేదు. దీంతో మంత్రి స్వయంగా డీలర్ల సంఘాల నాయకులతో మాట్లాడినట్లు తెలిసింది. సమ్మె విరమణకు మంగళవారం వరకు గడువు ఇచ్చారు.

ఇప్పటికే దుకాణాలకు చేరిన బియ్యం

జూన్ నెలకు సంబంధించిన బియ్యం కోటాకు సంబంధించి మే 28నే ఇండెంట్ వచ్చింది. దీంతో 29 నుంచి ఆయా జిల్లాల్లోని రేషన్ షాపులకు బియ్యం సరఫరా ప్రారంభమైంది. 3వ తేదీ నుంచే ఈనెలలో బియ్యం పంపిణీ చేయాలని భావించారు. అయితే 2వ తేదీ సాయంత్రమే డీలర్ల సంఘాల నాయకులు దుకాణాలు తెరవొద్దని రాష్ట్రంలోని 11వేల మంది రేషన్ డీలర్లకు స్పష్టం చేశారు. సాధారణంగా ప్రతి నెలా 5 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభం కావలసి ఉండటంతో సమ్మె గురించి ఎవరూ పట్టించుకోలేదు. సోమవారం ఉదయం నుంచే కార్డుదారులు రేషన్ దుకాణాలకు వచ్చినప్పటికీ, దుకాణాలు తెరుచుకోకపోవడంతో డీలర్లకు ఫోన్‌లు చేసి బియ్యం ఎందుకు పోయడం లేదని ప్రశ్నించడం ప్రారంభమైంది. డీలర్లు సమ్మెలోకి దిగినట్లు చెప్పడంతో పేదలు ఆందోళన చెందుతున్న పరిస్థితి.

పేదల ప్రయోజనాలు ముఖ్యం

రేషన్ డీలర్ల 22 డిమాండ్లలో 20 నెరవేర్చేందుకు ఒప్పుకున్నాం. కమీషన్ పెంపు, గౌరవ వేతనం అంశాలు ముఖ్యమంత్రి పరిధిలోనివి అని చెప్పడంతో సమ్మె ఆలోచన విరమిస్తున్నట్లు చెప్పారు. కానీ, ఇప్పుడు మళ్లీ ఎందుకు సమ్మెకు దిగారో తెలియదు. ప్రభుత్వానికి పేదల ప్రయోజనాలు ముఖ్యం. 90.40 లక్షల కార్డుల మీద 2.90 కోట్ల పేదలకు బియ్యం ఇస్తున్నాం. డీలర్లు కూడా పేదల ఆకలిని గుర్తించాలి. మంగళవారంలోగా సమ్మె విరమించకపోతే ఐకేపీ మహిళా సంఘాలు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తాం.

– పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

విద్యుత్ వినియోగంలో రాష్ట్రం నంబర్‌వన్

- తెలంగాణ ఏర్పడ్డాక చీకట్లు మాయమయ్యాయి
- 'విద్యుత్ ప్రగతి'సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి



రవీంద్రభారతిలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట)/గన్‌ఫౌండ్రీ: విద్యుత్ వినియోగంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. జాతీయ తలసరి వినియోగంతో పోల్చితే రాష్ట్రంలో 69.40 శాతం విద్యుత్‌ను ఎక్కువగా వాడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులోని 420 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వహించిన 'విద్యుత్ ప్రగతి'సభకు మంత్రి హాజరయ్యారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లోనూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడ్డాక చీకట్లు మాయమై గ్రామాలు సైతం విద్యుత్‌కాంతులతో మెరిసిపోతున్నాయని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన రోజు 7,778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఉంటే, కేసీఆర్ సీఎం అయ్యాక 18,567 మెగావాట్లకు పెరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పీక్ డిమాండ్ 13 వేల మెగావాట్లు ఉంటే, ఇప్పుడు ఒక్క తెలంగాణలోనే 14,700 మెగావాట్లు ఉందని చెప్పారు. 2014కు ముందు లేని 24 గంటలు విద్యుత్ సరఫరా, రాష్ట్రం ఏర్పడ్డాక సాధ్యమయ్యిందన్నారు. విద్యుత్ సంక్షోభ సమయంలో ఎండిపోయిన పంట పొలాలను చూసి తట్టుకోలేక రైతులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. పవర్ హాలిడే వల్ల పారిశ్రామికవేత్తల ఆందోళనల పరిస్థితుల నుంచి.. 24 గంటలు విద్యుత్ సరఫరా చేసే స్థాయికి ఎదిగామన్నారు. ఈ విద్యుత్ విజయాలకు సీఎం కేసీఆర్ కారణమని కొనియాడారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, గోపాల్‌రావు ఇతర అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

9 సంవత్సరాలు.. రూ.97,321 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి అన్నారు. వినియోగదారుల సమస్యలను సత్వరంగా పరిష్కరించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాసరావు, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.50 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం: శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఐదేళ్లలో బొగ్గు ఉత్పత్తిని వంద మిలియన్ టన్నులకు, థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 4వేల మెగావాట్లకు పెంచడం ద్వారా రూ.50 వేల కోట్ల వార్షిక టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. దీని కోసం 8 కొత్త బొగ్గుగనులతో పాటు కొత్త థర్మల్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన సింగరేణి సంబరాల్లో ఆయన మాట్లాడారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ నుండి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కానుందన్నారు. ఉత్తమ సేవలందించిన డిప్యూటీ సూపరింటెండెంట్ సీహెచ్ నాగమణి, సెక్యూరిటీ గార్డు ఉబేదుల్లా, డీజీఎం చక్రధర్‌రావు, ఎస్వోఎం కృష్ణాచారిని సన్మానించారు.

21 నుంచి ఎప్పుడైనా నిరవధిక సమ్మె

- గ్రామపంచాయతీ సిబ్బంది హెచ్చరిక
- సర్కారుకు జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ సమ్మె నోటీసు



డిప్యూటీ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక నేతలు

సాక్షి, హైదరాబాద్: సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 21 తర్వాత నుంచి ఎప్పుడైనా నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రభుత్వానికి తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ సమ్మె నోటీసునిచ్చింది. గ్రామ పంచాయతీ సిబ్బంది పర్మినెంట్, జీపీ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాల పెంపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు, కారోబార్, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ సెక్రటరీలుగా నియామకం, ఇతర సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఐడీ యాక్ట్ 1947 సెక్షన్ 22 ప్రకారం నోటీసు అంజేసింది. సోమవారం ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకు సీఐటీయూ, ఏఐటీయూసీ, టీజీకేబీయూ, ఐఎఫ్‌టీయూలతో కూడిన కార్మికసంఘాల జేఏసీ నోటీస్‌ను అందించింది. ఈ ప్రతినిధి బృందంలో జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్, ఎస్.యజ్ఞనారాయణ్, సదానందం, చాగంటి వెంకటయ్య, ఆర్‌కేనాయుడు, వెంకటరాజ్యం, ఎస్.దాసు, పి. అరుణ్‌కుమార్, జయచంద్ర, శివబాబు, ఆర్.మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు. పీఆర్ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ కమిషనర్‌కు ఈ నోటీస్‌ను అందజేశారు.

12,769 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది సిబ్బంది..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,769 గ్రామ పంచాయతీల్లో 50 వేల మంది జీపీ సిబ్బందిలో పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు తదితర విధులు నిర్వహిస్తున్నారు. గత ఇరవై, 30 ఏళ్లుగా పనిచేస్తున్నా పర్మినెంట్, పనికి గుర్తింపు, భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమ వంటివి అమలు కావడం లేదని ఈ నోటీస్‌లో పేర్కొన్నారు. జీపీ సిబ్బందిని అందరినీ పర్మినెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన మేరకు పంచాయతీ సిబ్బందికి రూ.19వేలు చెల్లించాలని, అప్పటిదాకా జీవో 60లో పేర్కొన్న విధంగా కేటగిరిల వారీగా నెలకు రూ. 15,600 కారోబార్, బిల్లు కలెక్టర్లకు, ఇతర స్కిల్డ్ సిబ్బందికి రూ. 19,500 చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను అసిస్టెంట్ పంచాయతీ సెక్రటరీలుగా ప్రమోషన్లు ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతుల్లోనే వివిధ కేటగిరీలను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వానికి జేఏసీ విజ్ఞప్తి చేసింది.

ఒకరి కోసం ఒకరు వెళ్లి..

- నలుగురి ప్రాణాలు బలితీసుకున్న ఈత సరదా
- కృష్ణానదిలో మునిగి మృత్యువాత
- జోగుళాంబ గద్వాల జిల్లా మంగంపేట వద్ద ఘటన



నవసీన్



సమీర్



రియాన్



ఆఫ్రిన్

మానవపాడు/ ఎర్రవల్లి చౌరస్తా: ఈత సరదా వారి ప్రాణాలను బలి తీసుకుంది. ఒకరిని కాపాడబోయి మరొకరు.. చివరికి నలుగురు మృతిచెందిన విషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం మంగంపేటలో జరిగింది. కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి కథనం ప్రకారం.. ఇటిక్యాల మండలం వల్లూరుకు చెందిన అన్నదమ్ములు ఇస్మాయిల్, ఇబ్రహీంలు బతుకుదెరువు కోసం 20 ఏళ్ల క్రితం ఏపీలోని కర్నూలుకు వలస వెళ్లారు. వేసవిసెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలసి మానవపాడు మండలంలోని బోరవెల్లిలో బంధువుల ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఇస్మాయిల్ కుమారులు సమీర్ (18), రియాన్(14), ఇబ్రహీం కూతుళ్లు ఆఫ్రిన్ (17), నవసీన్ (13) వారి మేనత్త కుమారుడైన ఇమాంతో పాటు మరో ఐదుగురు కలసి మంగంపేట శివారులోని కృష్ణానదిలో ఈతకోసం వెళ్లారు. నదిలో లోతు గమనించకుండా ముందుకు వెళ్లిన రియాన్ మునిగిపోగా అతడిని కాపాడేందుకు ఆఫ్రిన్, నవసీన్ వెళ్లారు. ముగ్గురికీ ఈత రాకపోవడంతో గల్లంతయ్యారు. వెంటనే వీరిని కాపాడేందుకు వెళ్లిన సమీర్ సైతం నీటిలో మునిగిపోయాడు. ఈ నలుగురూ గల్లంతవడంతో ఇమాం కేకలు వేయగా చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మత్స్యకారుల సహాయంతో గాలించగా నలుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బలవన్మరణానికి కారణమేమిటి?

- మెడికో మానస ఆత్మహత్యపై కొనసాగుతున్న విచారణ
- బంక్‌లో సీసీ ఫుటేజీ సేకరించిన పోలీసులు
- హనుమకొండలో ముగిసిన అంత్యక్రియలు



మానస మృతదేహాన్ని తీసుకువెళుతున్న బంధువులు

ఖమ్మం అర్బన్, నయీంనగర్: మెడికో సముద్రాల మానస(22) ఆత్మహత్య ఘటనపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని బలవన్మరణానికి పాల్పడేంతటి పరిస్థితి ఆమెకు ఎందుకొచ్చిందనే దానిపై కూపీలాగుతున్నారు. ఖమ్మంలోని మెడికల్ కళాశాలలో బీడీఎస్ నాలుగో సంవత్సరం చదువుతూ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న మానస ఆదివారం సాయంత్రం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం పోస్టుమార్టం అయిన తర్వాత బంధువులు మృతదేహాన్ని హనుమకొండ కిషన్‌పురకు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యుల కన్నీటి వీడ్కోలు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మానస తల్లిదండ్రులు చనిపోవడంతో చిన్నమ్మ ప్రణతి తలకొరివి పెట్టారు.

మృతిపై అనుమానం ఉందంటూ ఫిర్యాదు

మానస ఆత్మహత్యపై తమకు అనుమానాలు ఉన్నాయని ఆమె చిన్నమ్మ ప్రణతి, మేనత్త, మేనమామ ఫిర్యాదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు. మానస తాను ఉంటున్న ప్రైవేట్ హాస్టల్ భవనం సమీపంలోని పెట్రోల్ బంక్‌కు సీసా, బ్యాగ్‌తో వెళ్లి రెండు లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసింది. ఆమె పెట్రోల్ తీసుకుని వెళ్తున్న దృశ్యాల సీసీ ఫుటేజీలు మీడియా ద్వారా వెలుగులోకి రాగా, పోలీసులు ఉదయమే బంక్‌కు వెళ్లి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు.

మానస ఫోన్ ఎక్కడ?

పెట్రోల్ బంక్ నుంచి ఫుటేజీ సేకరించిన పోలీసులు, మానస ఆత్మహత్య చేసుకున్న గదిలో ఏమైనా ఆధారాలు లభిస్తాయేమోనని పరిశీలించారు. ఆమె ఫోన్ లభించకపోవడంతో ఏమై ఉంటుందోనని ఆరా తీస్తున్నారు. మానస నిప్పంటించుకున్నప్పుడు ఫోన్ కూడా దగ్ధమైందా అనే కోణంలో విచారిస్తున్నారు. ఈ మేరకు మానస ఫోన్ నంబర్ ఆధారంగా కాల్ డేటా సేకరించి చివరి సారిగా ఎవరితో మాట్లాడిందో తెలుసుకుంటే కేసు విచారణ ఓ కొలిక్కి వచ్చే అవకాశముందని పోలీసులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా మానస గదిలో ఆమె డైరీని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా, అలాంటిదేమీ లేదని కొట్టిపారేశారు.

ఆ బాలిక ఖరీదు.. రూ.13 లక్షలు?

- ఓ గిరిజన బాలిక జీవితానికి వెలకట్టిన పెద్దలు

సాక్షి, వరంగల్: ప్రేమపేరుతో నమ్మించి.. ఆపై వంచించిన నిందితుడిపై బాలిక ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదైంది. ఆ కేసును నీరుగార్చేందుకు మధ్యవర్తులుగా వ్యవహరించిన పెద్దలు గద్దలుగా మారారు. రూ.13 లక్షలు బాధితురాలి కుటుంబానికి ఇచ్చేలా తీర్మానం చేసి.. భారీగానే నొక్కేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీస్ అధికారి సమక్షంలోనే ఈ సెటిల్‌మెంట్ జరిగిందన్న విషయం నర్సంపేటలో చర్చనీయాంశమైంది. బాధితురాలిపై ఒత్తిడి పెరగడంతో.. ఆమె వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కలిసి న్యాయం చేయాలని కోరినట్టు సమాచారం. నర్సంపేట పట్టణానికి చెందిన ఓ యువకుడు.. పట్టణానికి సమీపంలో ఉండే ఓ తండాకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. బాలిక తల్లిదండ్రులు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటుండడంతో ఈమె తరచూ వస్తూ, వెళ్తుండేది. ఈ క్రమంలోనే ప్రేమపేరుతో ఆమెకు దగ్గరైన యువకుడు హైదరాబాద్‌కు వెళ్లి మరీ కొంతకాలం కలిసి ఉన్నాడు. ఆ తర్వాత మొహం చాటేయడంతో.. బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2022 ఆగస్టు 14న యువకునిపై పోక్సో కేసు నమోదైంది. అరెస్టయిన యువకుడు జైలుకెళ్లి బెయిల్‌పై బయటకొచ్చాడు. తర్వాత అబ్బాయి బంధువులు, అమ్మాయి బంధువులతో కేసు సెటిల్‌మెంట్‌కు ప్రయత్నాలు చేశారు. రూ.13 లక్షలు ఇచ్చేలా నిర్ణయించి.. ముందు రూ.5 లక్షలు, కేసు కాంప్రమైజ్ అయ్యాక మిగిలిన రూ.8 లక్షలు ఇచ్చేలా తీర్మానం రాశారు. బాలిక కుటుంబానికి రూ.2 లక్షలు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని పెద్దలే నొక్కేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారమంతా ఓ పోలీసు అధికారి సమక్షంలోనే జరిగిందని సమాచారం. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న బాలిక.. న్యాయం కోసం కమిషనర్‌ను ఆశ్రయించినట్టు సమాచారం.

చెయ్యి తెగితే.. మరొకరి చెయ్యి అతికిస్తారిక్కడ

▶ మొదటి పేజీ తరువాయి

జీవితాన్ని కల్పించింది. ఈ ఆస్పత్రికి చెందిన తల, మెడ, ప్లాస్టిక్ సర్జరీ శస్త్రచికిత్స విభాగాధిపతి సుబ్రమణ్యం అయ్యర్ దేశంలోనే తొలిసారిగా మనుకు చేతి మార్పిడి శస్త్రచికిత్స చేశారు. బ్రెయిన్‌డెడ్ అయిన ఒక వ్యక్తికి చెందిన రెండు చేతులను తీసుకుని మనుకు అమర్చారు. ఇందుకోసం క్లిష్టమైన సర్జరీ చేయడంతోపాటు ఆరు నెలల పాటు ఫిజియోథెరపీ, ఇతర చికిత్సలు చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మను తన 'కొత్త'చేతులను మామూలుగా వినియోగించడం మొదలుపెట్టారు. ఈ చేతి మార్పిడి తర్వాత.. మరెంతో మంది ఇలాంటి చికిత్సల కోసం వస్తున్నారని వైద్యులు చెప్తున్నారు.

కొన్ని ఆస్పత్రుల్లోనే ఈ చికిత్సలు

మన దేశంలో కిడ్నీ, లివర్, గుండె మార్పిడి వంటి శస్త్రచికిత్సలు చాలా ఆస్పత్రులలో జరుగుతున్నాయి. కానీ ఏదైనా ప్రమాదంలో రెండు చేతులూ కోల్పోయిన వారికి ఇతరుల చేతులను అమర్చే శస్త్రచికిత్సలు ఐదారు ఆస్పత్రుల్లో మాత్రమే జరుగుతున్నాయి. అందులో మొట్టమొదటగా కొచ్చిలోని అమృత ఆస్పత్రిలో జరిగింది. ఎక్కువ చికిత్సలూ అక్కడే చేశారు. దేశంలో ఇప్పటివరకు దాదాపు 40 మంది రోగులకు చేతులు మార్పిడి చేయగా.. అందులో 14 మంది రోగులకు అమృత ఆస్పత్రిలోనే జరిగాయి. ఈ 14 మందికి కలిపి 26 చేతులను మార్పిడి చేశారు. ఇద్దరికి భుజాలు దెబ్బతినడంతో ఒక్కో చేతిని మాత్రమే మార్పిడి చేశారు. ఇలాంటి ఇన్ని చికిత్సలు చేయడం ప్రపంచంలోనే అమృత ఆస్పత్రిలో ఎక్కువని అక్కడి వైద్యులు చెప్తున్నారు.

నాలుగు వైద్య బృందాలతో...: చేతుల మార్పిడి శస్త్రచికిత్స కోసం నాలుగు వైద్య బృందాలు కలిసి పనిచేస్తాయని వైద్యులు తెలిపారు. రెండు బృందాలు రోగికి చేతిని అమర్చేందుకు ఏర్పాట్లు చేస్తాయని.. మరో రెండు బృందాలు బ్రెయిన్‌డెడ్ వారి నుంచి చేతులను తీసుకోవడానికి సిద్ధం చేస్తాయని వివరించారు. శస్త్రచికిత్స తర్వాత రోగి కొన్నినెలల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని, ఫిజియో థెరపీ, ఇతర చికిత్సలతో అమర్చిన అవయవం సరిగా పనిచేస్తుందో లేదో చూస్తారని వెల్లడించారు. 18 ఏళ్లు పైబడిన వారికే చెయ్యి మార్పిడి చేయవచ్చని, చికిత్సకు రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు.

4 రోజుల్లో పనిచేయడం మొదలవుతుంది

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల నుంచే వారి కుటుంబ సభ్యుల అనుమతి మేరకు చేతులను స్వీకరిస్తాం. ఆ వ్యక్తి, అమర్చే వారి బ్లడ్ గ్రూప్ ఒకటే అయి ఉండాలి. చెయ్యి మార్పిడి చికిత్స చేసిన నాలుగు రోజుల్లో రోగి 'కొత్త'చేతులతో మంచినీటి గ్లాసు పట్టుకోగలరు. పూర్తిస్థాయిలో చెయ్యి పనిచేయాలంటే ఆరు నెలల సమయం పడుతుంది. ప్రమాదాల్లో చేతులు కోల్పోయిన బాధితులకు అవసరమైన మేర అవయవాలు దొరకడం లేదు. బ్రెయిన్‌డెడ్ అయిన పేషెంట్ల కుటుంబ సభ్యులు దానానికి ముందుకు రావాలి. ఈ మేరకు ప్రజల్లో అవగాహన రావాల్సి ఉంది. – డాక్టర్ సుబ్రమణ్యం అయ్యర్, అమృత ఆస్పత్రి వైద్యుడు

క్లుప్తంగా...

గ్యాంగ్‌స్టర్ ముఖ్తార్ అన్సారీకి జీవిత ఖైదు

1991 నాటి హత్యకేసులో శిక్ష ప్రకటించిన వారణాసి కోర్టు



లక్నో: ముప్పై ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ నేత సోదరుడి హత్య కేసులో గ్యాంగ్‌స్టర్–రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీకి వారణాసి కోర్టు జీవిత ఖైదు విధించింది. 1991 ఆగస్టు 3వ తేదీన కాంగ్రెస్ నేత అజయ్ రాయ్ సోదరుడు అవధేశ్ రాయ్ వారణాసిలోని ఆయన ఇంటిగేటు వద్దే హత్యకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించి అన్సారీతోపాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అవధేశ్ రాయ్ హత్య కేసును విచారించిన ఎంపీ–ఎమ్మెల్యే కోర్టు ప్రత్యేక జడ్జి అవనీశ్ గౌతమ్ అన్సారీకి జీవిత ఖైదుతోపాటు రూ.1.20 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు లాయర్ ఒకరు చెప్పారు. బందా జైలులో ఉన్న అన్సారీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా విచారణకు హాజరయ్యారు. వేర్వేరు రాష్ట్రాల్లో 61కి పైగా క్రిమినల్ కేసులను అన్సారీ ఎదుర్కొంటున్నాడు. ఇప్పటివరకు ఆరు కేసుల్లో దోషిగా తేలింది. ఒక కేసుకు సంబంధించి ఏప్రిల్‌లో ఘాజీపూర్ కోర్టు అన్సారీకి 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. యూపీలోని మౌసదర్ స్థానం నుంచి అయిదు పర్యాయాలు అన్సారీ ఎమ్మెల్యే అయ్యాడు. 2022 ఎన్నికల్లో ఆయన కొడుకు అబ్బాస్ అన్సారీ సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు.

మేజిక్ షోలు చేసైనా సంపాదిస్తా

రాజస్తాన్ సీఎం గెహ్లోత్



జోధ్‌పూర్: రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ తనను తాను ప్రజల ప్రథమ సేవకుడిగా అభివర్ణించుకున్నారు. డబ్బు అవసరమైతే మేజిక్ షోలు చేసైనా సంపాదిస్తాను కానీ, జోధ్‌పూర్ ప్రజలను మాత్రం నిర్లక్ష్యం చేయనని చెప్పారు. నగరంలోని మెహ్రాన్‌గఢ్ సందర్శనకు వచ్చే పర్యాటకుల కోసం కొత్తగా నిర్మించిన 'రావ్ జోధా మార్గ్' రోడ్డును ఆయన సోమవారం ప్రారంభించారు. 42 ఏళ్ల క్రితం తాను తొలిసారి జోధ్‌పూర్ ఎంపీగా గెలిచినప్పుడు ఇక్కడ ఏ సౌకర్యాలు లేవని, ఇప్పుడు మాత్రం అన్నీ సమకూరాయని చెప్పారు. గెహ్లోత్‌ది జోధ్‌పూర్‌కు చెందిన మెజీషియన్ల కుటుంబం. ఆయన వ్యాఖ్యలను బీజేపీ ఎద్దేవా చేసింది. కేంద్రం పథకాలను తనవిగా చెప్పుకుంటూ ట్రిక్కులు ప్రదర్శిస్తున్నారని ఆరోపించింది.

"నాకు జీవితంపై ఇక ఎలాంటి ఆశలు లేవు. మమ్మల్ని చదువుకోనివ్వడం లేదు. స్వేచ్ఛగా బతికే అవకాశం లేదు. కుంగుబాటు, ఆందోళన నన్ను వేధిస్తున్నాయి. ఈ జీవితాన్ని ముగించాలన్న ఆలోచనలు తరచుగా వస్తున్నాయి. ఈ బాధలు భరించలేను. నా ఆవేదన ఎవరైనా వింటే బాగుండు. ఇది కేవలం నా ఒక్కరి దుస్థితి కాదు. నాతోపాటు యూనివర్సిటీలో చదువుకున్న యువతులంతా ఇలాగే మదన పడుతున్నారు. ఆత్మహత్య ఆలోచనలతో నిత్యం సతమతం అవుతున్నారు. బతకలేక చావలేక కుమిలిపోతున్నారు"

- అఫ్గానిస్తాన్‌లో 20 ఏళ్లకుపైగా వయసున్న ఓ యువతి కన్నీటి గాథ ఇది.

"మహిళా కళాశాలలను తాలిబన్లు మూసేశారు. దాంతో నా ఉద్యోగం పోయింది. ఎక్కడా ఉపాధి దొరకలేదు. ఇంట్లో అందరినీ పోషించాల్సింది నేనే. పని దొరక్క చేతిలో చిల్లిగవ్వ లేకుండాపోయింది. నిర్భయంగా బయట తిరగలేం. ఇంట్లోనే ఉండిపోవాలి. ఎలా బతకాలో తెలియడం లేదు. అందుకే మరోదారి లేక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశా.

-మెహర్ అనే అధ్యాపకురాలి ఆవేదన ఇది



ఈ ఏడాది మార్చి నెలలో స్కూల్ పునఃప్రారంభం కాగా, తరగతులకు హాజరయ్యేందుకు తన కుమార్తె ఉత్సాహంగా సిద్ధమైందని, తీరా అక్కడికి వెళ్లాక రావొద్దని చెప్పడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిందని నాదిర్ అనే వ్యక్తి చెప్పాడు. పెద్ద చదువులు చదువుకొని, దేశానికి సేవ చేయాలని తన బిడ్డ కలలు కనేదని తెలిపాడు. తాలిబన్ పాలకులు బాలికల పాఠశాలలను మూసివేశారని వెల్లడించాడు.

చదువుల్లేక, ఉద్యోగాల్లేక.. ఉరికొయ్యలే దిక్కై!

అఫ్గానిస్తాన్ యువతుల్లో ఆత్మహత్య ఆలోచనలు

నానాటికీ పెరుగుతున్న మానసిక అనారోగ్య సమస్యలు

- ఇప్పటికే వందలాది మంది బలవన్మరణం
- భరించలేనంత వివక్ష, ఆంక్షలు: బాధితులు

అఫ్గానిస్తాన్‌లో 2021 ఆగస్టు నుంచి తాలిబన్ల పరిపాలన మళ్లీ మొదలైంది. అమెరికా సేనలు వెనక్కి వెళ్లిపోవడంతో తాలిబన్ ముష్కరులు అధికారంలోకి వచ్చారు. తాము పూర్తిగా మారిపోయామని, ప్రజలను కన్నబిడ్డల్లా కాపాడుకుంటామని తొలుత ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేశారు. ఆచరణలో మాత్రం రాక్షస పాలనకు తెరతీశారు. మహిళలపై కఠినమైన ఆంక్షలు విధించారు. వారిపై దారుణమైన వివక్ష కొనసాగుతోంది. చదువులు లేవు, ఉద్యోగాలు లేవు. ఆర్థిక స్వేచ్ఛ అసలే లేదు. అఫ్గాన్ బాలికలకు కొన్నిచోట్ల ప్రాథమిక విద్య మాత్రమే అందుబాటులో ఉంది. అంటే ఆరో తరగతి వరకూ పాఠశాలలకు వెళ్లి చదువుకోవచ్చు. ఆ తర్వాత ఇంటికి పరిమితం కావాల్సిందే. ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు నిరాకరిస్తున్నారు. కాలేజీ, యూనివర్సిటీ చదువులు యువకులకు మాత్రమే అన్నట్లుగా అనధికార శాసనం అమల్లోకి వచ్చింది. ఈ పరిణామాలన్నీ యువతుల్లో మానసిక సమస్యలను, అనారోగ్యాలను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే వందలాది మంది అర్ధంతరంగా జీవితాలను చాలించినట్లు తెలుస్తోంది. సైకాలజిస్టులను సంప్రదించే బాధితుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. ఉత్తర అఫ్గానిస్తాన్‌లోని సంగ్‌చారక్ జిల్లాలో రెండు పాఠశాలల్లో ఇటీవలే దాదాపు 80 మంది విద్యార్థినులపై విష ప్రయోగం జరిగింది. స్కూళ్లకు రాకుండా బాలికలను భయపెట్టడానికే విద్రోహులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

రాక్షస పాలనలో నిత్య నరకం

శరీరంలోకి విషం ఎక్కించినట్లుగా..



అఫ్గాన్ యువతుల్లో ఆత్మహత్య ఆలోచనలు ఒక మహమ్మారిలా వ్యాప్తి చెందుతున్నాయని సైకాలజిస్టు డాక్టర్ అమల్ చెప్పారు. పరిస్థితి దిగజారుతోందని, ఇక్కడి వాస్తవాలు ప్రపంచానికి తెలియడం లేదని అన్నారు. ఆకలి చావులు, ఆహార సంక్షోభం గురించి మాత్రమే వార్తా పత్రికల్లో రాస్తున్నారని, మానసిక అనారోగ్య సమస్యల గురించి ఎవరూ రాయడం లేదని, మాట్లాడడం లేదని వెల్లడించారు. శరీరంలోకి నెమ్మదిగా విషం ఎక్కించినట్లుగా యువత ప్రవర్తిస్తున్నారని, జీవితంపై ఆశలు కోల్పోతున్నారని డాక్టర్ అమల్ ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో యువతులకు ప్రవేశం లేదంటూ తాలిబన్లు ప్రకటించినప్పుడు మొదటి రెండు రోజుల్లో తనకు 170 ఫోన్‌కాల్స్ వచ్చాయన్నారు. ఇప్పుడు నిత్యం దాదాపు 10 కాల్స్ వస్తున్నాయని తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది బాలికలు, యువతులే ఉంటున్నారని వివరించారు. వారిలో ఆత్మహత్య ఆలోచనలు పోగొట్టి, స్ఫూర్తిని నింపే ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించాలి

అఫ్గానిస్తాన్‌లో పితృస్వామ్య వ్యవస్థ బలంగా పాతుకుపోయింది. మహిళలపై ఆంక్షలు, వివక్ష, వేధింపులు అనేవి సహజంగా మారిపోయాయి. దేశంలో ప్రతి ఇద్దరిలో ఒకరు మానసికపరమైన ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. బాధితుల్లో మహిళలే గణనీయంగా ఉంటారని తెలియజేసింది. తాలిబన్ల పెత్తనం మొదలయ్యాక పరిస్థితి మరింత దిగజారిందని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. ఆంక్షలు, వివక్షకు ఆర్థిక సంక్షోభం కూడా తోడయ్యిందని, ఇవన్నీ మహిళలను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్నాయని అంటున్నారు. హెరాత్ ప్రావిన్స్‌లో ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో.. కౌమార వయసులో ఉన్నవారిలో మూడింట రెండొంతుల మందిలో ఆందోళన, కుంగుబాటు లక్షణాలు ఉన్నట్లు వెల్లడయ్యింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో చికిత్స అందించకపోతే వారు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. దేశంలో ఆత్మహత్యల సంఖ్యను తాము రికార్డు చేయడం లేదని తాలిబన్లు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, తాలిబన్ ప్రభుత్వాన్ని ప్రపంచ దేశాలు అధికారికంగా గుర్తించాలని అఫ్గాన్ ప్రజలు కోరుతున్నారు. అలాగైతే తాలిబన్ల వైఖరిలో మార్పు వచ్చే అవకాశం ఉందని, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళలపై ఆంక్షలు రద్దవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

'వాతావరణ న్యాయం' కోరుతున్నాం

సంపన్న దేశాల ఎదుట గొంతెత్తుతున్నాం: మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన కొన్ని దేశాలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలకు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. 'వాతావరణ న్యాయం' కోసం అభివృద్ధి చెందిన దేశాలను డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ సోమవారం ఒక సందేశం విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ నడుం బిగించాలని, కలిసికట్టుగా పనిచేయాలి, ఈ విషయంలో సొంత ప్రయోజనాలు పక్కనపెట్టాలని సూచించారు. వాతావరణాన్ని చక్కగా కాపాడుకోవాలని, ప్రపంచదేశాలు దీనిపై తక్షణమే దృష్టి పెట్టాలని హితవు పలికారు. మొదట దేశాన్ని అభివృద్ధి చేసుకుందాం, ఆ తర్వాత పర్యావరణం గురించి ఆలోచిద్దామన్న ధోరణి ప్రపంచమంతటా పెరిగిపోతోందని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఇలాంటి అభివృద్ధి మోడల్‌తో విధ్వంసమే తప్ప ఆశించిన ప్రయోజనం ఉండదన్నారు. ఒకవేళ అభివృద్ధి లక్ష్యాలు సాధించినప్పటికీ దాని మూల్యం ఇతర దేశాలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలు అమలు చేస్తున్న తప్పుడు విధానాలను ఇప్పటిదాకా ఎవరూ పెద్దగా ప్రశ్నించలేదని గుర్తుచేశారు. 'వాతావరణ న్యాయం' కోసం అభివృద్ధి చెందిన దేశాల ఎదుట భారత్ బిగ్గరగా గొంతెత్తున్నందుకు తనకు సంతోషంగా ఉందని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బడా దేశాల స్వార్థానికి చిన్న దేశాలు ఎందుకు నష్టపోవాలని ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణ అనేది భారతీయ సంస్కృతిలో వేలాది సంవత్సరాలుగా ఒక భాగంగా కొనసాగుతూ వస్తోందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున పెట్టుబడులు పెడుతున్నామని, అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. 4జీ, 5జీ కనెక్టివిటీ మాత్రమే కాదు, మరోవైపు అడవుల పెంపకం చేపడుతున్నామని తెలియజేశారు. సింగిల్–యూజ్ ప్లాస్టిక్ నిషేధం కోసం ప్రజలంతా సహకరించాలని కోరారు. గత ఐదేళ్లుగా ఈ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం స్పష్టమైన రోడ్డుమ్యాప్‌తో ముందుకెళ్తున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

అమెరికాతో రక్షణ రోడ్డు మ్యాప్ ఖరారు

- రక్షణ రంగంలో పరస్పర సహకారం
- రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ భేటీ



ద్వైపాక్షిక భేటీ సందర్భంగా ఆస్టిన్, రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో అమెరికా, భారత్ మధ్య పరస్పర సహకారానికి రోడ్డు మ్యాప్ ఖరారైంది. ఢిల్లీలో సోమవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ సుదీర్ఘంగా చర్చించి, ఈ మేరకు రోడ్డు మ్యాప్ సిద్ధం చేశారు. రక్షణ పారిశ్రామిక రంగంతోపాటు రక్షణ ఉత్పత్తుల తయారీలో ఇకపై ఇరు దేశాలు సహకరించుకుంటాయి. ఫాస్ట్–ట్రాక్ టెక్నాలజీ ఒప్పందాలు కుదుర్చుకుంటాయి. గగనతల, భూ ఉపరితల యుద్ధానికి అవసరమైన ఆయుధాలను కలిసికట్టుగా తయారు చేసుకుంటాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో డ్రాగన్ దేశం చైనా దూకుడు పెరుగుతున్న సమయంలో భారత్, అమెరికా మధ్య ఈ రోడ్డు మ్యాప్ ఖరారు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో రెండు వారాల తర్వాత అమెరికాలో పర్యటించబోతున్నారు. రెండు దేశాల నడుమ సంబంధాలు మరింత బలోపేతం కావడానికి ఈ పర్యటన దోహదపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా దుందుడుకు చర్యలు, ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర నేపథ్యంలో అంతర్జాతీయంగా వివిధ దేశాల సార్వభౌమత్వానికి ముప్పు పొంచి ఉందని అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ చెప్పారు. రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వేచ్ఛాయుత ఇండో–పసిఫిక్‌కు భారత్–అమెరికా బంధం ఒక మూలస్తంభమని అభివర్ణించారు. భారత సైన్యం ఆధునీకరణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని పునరుద్ఘాటించారు. భారత్, అమెరికా నడుమ రక్షణ రంగంలో సహకారం విషయంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడానికే రోడ్డు మ్యాప్ ఖరారు చేసుకున్నట్లు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం 'పెంటగాన్' వెల్లడించింది. ఫైటర్ జెట్ ఇంజన్లకు అవసరమైన ఆధునిక టెక్నాలజీని భారత్‌కు అందజేయానికి జనరల్ ఎలక్ట్రిక్స్ సంస్థ ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసింది. అలాగే 30 ఎంక్యూ–9బీ ఆర్మ్‌డ్ డ్రోన్లను అమెరికా రక్షణ రంగ సంస్థ నుంచి కొనుగోలు చేయాలని భారత్ భావిస్తోంది. ఈ రెండు అంశాల గురించి లాయిన్ ఆస్టిన్ వద్ద రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు తెలిసింది. ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడానికి 2020 అక్టోబర్‌లో బేసిక్ ఎక్స్ఛేంజ్, కో–ఆపరేషన్ అగ్రిమెంట్(బీఈసీఏ) కుదిరింది.

మోదీ వెనకచూపు!

అందుకే తరచూ ప్రమాదాలు: రాహుల్ వ్యంగ్యాస్త్రాలు



న్యూయార్క్: "ప్రధాని మోదీ భారతీయ కారును రియర్‌వ్యూ అద్దంలో చూస్తూ నడిపేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి" అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీజేపీకి గానీ, ఆర్ఎస్ఎస్‌కి గానీ భవిష్యత్తులోకి చూడగలిగే సామర్థ్యం లేదని విమర్శించారు. ఆయన ఆదివారం ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్–అమెరికా విభాగం ఆధ్వర్యంలో న్యూయార్క్‌లోని జవిట్స్ సెంటర్‌లో భారతీయ అమెరికన్లనుద్దేశించి మాట్లాడారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లు అసమర్థులు. ఏదడిగినా గతం తవ్వుతారు. ఒడిశా రైలు ప్రమాదం లాంటివి ఎందుకు జరుగుతున్నాయని అడిగితే '50 ఏళ్లనాడు కాంగ్రెస్ అలా చేసినందుకే...' అంటారు. పీరియాడిక్ టేబుల్‌ను పాఠ్య పుస్తకాల్లోంచి ఎందుకు తీసేశారంటే 60 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఇలా చేసిందని చెబుతారు" అని చెణుకులు విసిరారు. "రియర్ మిర్రర్‌లో చూస్తూ కారు నడిపితే వరుస ప్రమాదాలు ఖాయం. మోదీ అలవాటు అదే. భారతీయ కారును సైడ్ మిర్రర్‌లో మాత్రమే చూసుకుంటూ నడుపుతున్నారు. అది ముందుకు పోకుండా ప్రమాదాలెందుకు జరుగుతున్నాయో అర్థం చేసుకోవడం లేదు" అన్నారు.

మెగా విద్వేష షాపింగ్ మాల్: నడ్డా

న్యూఢిల్లీ: ప్రేమ దుకాణం పేరిట రాహుల్ మెగా విద్వేష షాపింగ్ మాల్ తెరిచారంటూ బీజేపీ చీఫ్ జేపీ నడ్డా మండిపడ్డారు. "మోదీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో దేశం అభివృద్ధిని ప్రపంచమే గుర్తించింది. దాన్ని యువరాజు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకవైపు సర్జికల్ స్ట్రైక్స్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తారు. హిందువులు, ముస్లింలను విడదీయడంపై మాట్లాడుతారు. సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తుంటారు. మరోవైపు ప్రేమ దుకాణం నడుపుతున్నానంటూ చెప్పుకుంటుంటారు. నిజానికది మెగా విద్వేష షాపింగ్ మాల్" అన్నారు.

కొడుకును కాపాడబోయి...

భారతీయ అమెరికన్ దుర్మరణం

న్యూయార్క్: భారతీయ అమెరికన్ ఒకరు తన కొడుకును కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయారు. కాలిఫోర్నియాలోని శాంటాక్రజ్ కౌంటీలో వారం క్రితం ఈ విషాదం చోటుచేసుకుంది. జొన్నలగడ్డ శ్రీనివాసమూర్తి కుటుంబంతో పాంథెర్ బీచ్‌కు వెళ్లారు. అలల్లో కొట్టుకుపోతున్న 12 ఏళ్ల కొడుకును కాపాడేందుకు నీళ్లలోకి దిగారు. మరొకరి సాయంతో కొడుకును ఒడ్డుకు తీసుకొచ్చారు. అంతలో బలమైన అల మూర్తిని లోపలికి లాక్కెళ్లింది. ఈత రాని ఆయన లోతైన నీళ్లలో మునిగిపోయారు. తీవ్రంగా గాయపడిన మూర్తిని సహాయక సిబ్బంది బయటికి తీసి హెలికాప్టర్‌లో హాస్పిటల్‌కు తరలించినా ప్రాణాలు దక్కలేదు.



ఉత్తరాఖండ్‌లో మంచుమయమైన హేమకుండ్ సాహిబ్ గురుద్వారాను దర్శించుకుని తిరిగొస్తూ హిమపాతంలో చిక్కుకుని గల్లంతైన భక్తుల కోసం అన్వేషిస్తున్న రాష్ట్ర విపత్తు స్పందన దళ సభ్యులు. ఈ దుర్ఘటనలో ఒక మహిళ మృతదేహాన్ని ఎస్‌డీఆర్ఎఫ్ వెలికితీసింది.

ఆ ట్రాక్‌లు సిద్ధం



ప్రమాద మార్గంలో ట్రాక్ పునరుద్ధరణ తర్వాత వెళ్తున్న రైళ్లు . శిథిలాలు కన్పించకుండా కట్టిన తెరలు

ఒడిశాలో పెను ప్రమాదం జరిగిన లైన్లపై రైళ్ల రాకపోకల పునరుద్ధరణ

- రైల్వే విచారణ వేగవంతం
- డ్రైవర్ల స్టేట్‌మెంట్ నమోదు
- రంగంలోకి సీబీఐ విచారణ బృందం
- మోదీకి ప్రచార యావ: ఖర్గే

భువనేశ్వర్: ఒడిశాలో మూడు రైళ్ల ఘోర రైలు ప్రమాదంతో ఛిన్నాభిన్నమైన రైల్వే ట్రాక్‌లను శరవేగంగా పునరుద్ధరిస్తున్నారు. రెండు ప్రధాన ట్రాక్‌లను ఇప్పటికే సిద్ధం చేశారు. వాటిపై తొలుత ఆదివారం రాత్రి వైజాగ్–రూర్కెలా గూడ్స్, అనంతరం సోమవారం ఉదయం వందేభారత్ ప్రయాణించాయి. మూడు రోజులుగా ఘటనా స్థలి వద్దే ఉండి పనులను పర్యవేక్షిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతులూపి రైళ్లను స్వాగతించారు. కోరమండల్, హౌరా ఎక్స్‌ప్రెస్‌లు, మరో గూడ్స్ రైలు శుక్రవారం రాత్రి ఒడిశాలోని బహనగా బజార్ స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదానికి గురైన మహా విషాదం 275 మందిని బలి తీసుకోవడం తెలిసిందే. దేశాన్ని కలచివేసిన ఈ ప్రమాదంపై రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ విచారణ ముమ్మరంగా సాగుతోంది. భువనేశ్వర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న కోరమండల్ రైలు డ్రైవర్, అసిస్టెంట్ల స్టేట్‌మెంట్‌ను రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) సోమవారం నమోదు చేశారు. డ్రైవర్ కోలుకుని ఐసీయూ నుంచి వార్డుకు మారగా అసిస్టెంట్ తలకు సర్జరీ జరగాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో రైలు డ్రైవర్ల తప్పిదమేమీ లేదని రైల్వే శాఖ ఇప్పటికే ప్రకటించడం, మొత్తం ఉదంతంపై సీబీఐ విచారణకు సిఫార్సు చేయడం తెలిసిందే. 10మంది సభ్యులతో కూడిన బృందం సోమవారం ఘటనా స్థలిని సందర్శించింది. ఇప్పటిదాకా 170 మృతదేహాలను గుర్తించారు. ఒడిశా ప్రభుత్వం వాటిని ఉచితంగా స్వస్థలాలకు తరలిస్తోంది. ప్రమాదంలో మరణించిన, కాళ్లూ చేతులూ పోగొట్టుకున్న పశ్చిమబెంగాల్ వాసుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. మృతుల సంఖ్య తాజాగా 278కి పెరిగింది.

ఒడిశాలో పట్టాలు తప్పిన గూడ్సు

ఒడిశాలో సోమవారం మరో రైలు పట్టాలు తప్పింది. బారాఘర్ వద్ద ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన నారో గేజ్ లైన్లో లైమ్‌లైన్ లోడుతో వెళ్తున్న గూడ్స్ తాలూకు ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. డుంగ్రీ లైమ్‌స్టోర్ గనులకు, బారాఘర్ ఏసీసీ సిమెంట్ ప్లాంట్‌కు మధ్య ఉన్న ఈ లైనుతో రైల్వేకు సంబంధం లేదు.

చార్లెస్ సంతాపం

ప్రమాదంపై బ్రిటన్ రాజు చార్లెస్–3 సంతాపం తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఈ మేరకు ఆయన సందేశం పంపారు. ఈ దారుణం తనను, రాణిని తీవ్ర షాక్‌కు గురి చేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1980ల్లో తన ఒడిశా పర్యటన తనకెన్నో తీపి గుర్తులు అందించిందని గుర్తు చేసుకున్నారు. భారత్‌కు తన హృదయంలో ప్రత్యేక స్థానముందని చార్లెస్ తెలిపారు.

మోదీకి ఖర్గే లేఖాస్త్రం

రైల్వేలను ప్రాథమిక స్థాయి నుంచి బలోపేతం చేయకుండా కేవలం పైపై మెరుగులు దిద్దుతూ వార్తల్లో నిలవడంపైనే ప్రధాని మోదీ దృష్టి పెట్టారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ప్రమాదానికి అసలు కారణాలను బయట పెట్టాలంటూ మోదీకి లేఖ రాశారు. "నేరాలను దర్యాప్తు చేసే సీబీఐ రైలు ప్రమాదం విషయంలో ఏం చేస్తుంది? సాంకేతిక, వ్యవస్థాగత, రాజకీయ వైఫల్యాలను సీబీఐ నిగ్గుదేల్చగలదా?" అని ప్రశ్నించారు.

దడ పుట్టించిన చేజింగ్

బుల్లి విమానాన్ని వెంటాడిన ఫైటర్ జెట్

అమెరికా రాజధానిలో కలకలం

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో ఓ చిన్న విమానాన్ని జెట్ విమానం వెంబడించడం కలకలం రేపింది. అసాధారణ వేగంతో ప్రయాణిస్తూ యుద్ధ విమానం నుంచి వెలువడిన సోనిక్ శబ్దం వాషింగ్టన్ వాసుల గుండెల్లో దడ పుట్టించింది. ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏవియేషన్ విభాగం సమాచారం ప్రకారం.. ఆ సెస్నా సైటేషన్ విమానం టెన్నెస్సీలోని ఎలిజబెత్‌టన్ నుంచి బయలుదేరింది. లాంగ్ ఐల్యాండ్‌లోని మెక్ ఆర్థర్ ఎయిర్‌పోర్టుకు చేరుకోవాల్సి ఉంది. అయితే అనూహ్యంగా, న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్ మీదుగా, సరాసరి వాషింగ్టన్ డీసీ వైపుగా వచ్చింది. దేశ రాజధానిలోని అత్యంత భద్రత కలిగిన నిషిద్ధ ప్రాంతాల మీదుగా అది వెళ్లడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రేడియో సిగ్నళ్లకు పైలట్ స్పందించకపోవడంతో వెంటనే ఎఫ్–16 జెట్ విమానాన్ని పంపారు. అది సోనిక్ శబ్దంతో ప్రయాణిస్తూ దూసుకెళ్లింది. ఆ శబ్దం వాషింగ్టన్‌తోపాటు, మేరీల్యాండ్, వర్జీనియాలోని కొన్ని ప్రాంతాల వారికి సైతం వినిపించింది. సదరు విమానం పైలట్ దృష్టిలో పడేందుకు ఫైటర్ జెట్ ఎఫ్–16 విమానం మంటలను సైతం వదులుతూ వెళ్లింది. భూమిపైని వారి భద్రతను, సదరు విమానం భద్రతను దృష్టిలో ఉంచుకునే ఈ మేరకు చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో వర్జీనియాలోని మౌంట్ మొంటెబెల్లోకు సమీపంలోని పర్వత ప్రాంతంలో చివరికి చిన్న విమానం కుప్పకూలింది. విమానం మండిపోయిందని, అందులో వారెవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు తెలిపారు. చివరి క్షణంలో అది నిమిషానికి 30 వేల అడుగుల చొప్పున వేగంగా నేలవైపుగా దూసుకొచ్చిందని ఫ్లైట్ ట్రాకింగ్ రికార్డులు చెబుతున్నాయి. పర్వత ప్రాంతంలో విమానం కూలిన చోటుకు కాలినడకన చేరుకునేందుకు పోలీసులకు దాదాపు నాలుగు గంటలు పట్టింది. ఫ్లోరిడాకు చెందిన ఎన్‌కోర్ మోటార్స్ పేరిట ఆ విమానం రిజిస్టరై ఉంది. ఈ కంపెనీ నిర్వాహకుడు జాన్ రంపెల్ మాట్లాడుతూ..ఆ విమానంలో పైలట్‌తోపాటు తన కూతురు, రెండేళ్ల మనవరాలు, ఆయా ఉన్నారన్నారు. వీరు నార్త్ కరోలినా నుంచి ఈస్ట్ హాంప్టన్‌కు వస్తున్నారన్నారు. విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్లు తనకు తెలియదన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది. ఇది 1999 నాటి ఘటనను గుర్తుకు తెచ్చింది. అప్పట్లో లీయర్‌జెట్ విమానం సాంకేతిక లోపం తలెత్తి అడ్డదిడ్డంగా తిరుగుతూ సౌత్ డకోటా ప్రాంతంలో కూలిపోయింది. అందులోని ఆరుగురూ చనిపోయారు.



కూలింది ఈ రకం విమానమే

మనీశ్ సిసోడియాకు హైకోర్టులో దక్కని ఊరట



న్యూఢిల్లీ: ఆప్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సిసోడియాకు బెయిలిస్తే సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. తన భార్య సీమా సిసోడియా అనారోగ్యంతో బాధపడుతున్నందున ఆరు వారాల మధ్యంతర బెయిలివ్వాలంటూ పెట్టుకున్న అర్జీపై జస్టిస్ దినేశ్ కుమార్ శర్మ సోమవారం విచారణ జరిపారు. అయితే, సీమా సిసోడియాను ఆమె చికిత్స పొందుతున్న ఆస్పత్రిలో లేదా ఇంటి వద్ద ఒక రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేందుకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఆ సమయంలో ఇంటర్నెట్ వాడరాదు, మీడియాతో మాట్లాడరాదని, కుటుంబ సభ్యులు మినహా ఇతరులను కలవరాదని షరతులు విధించారు. ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీమా సిసోడియాకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించింది.మద్యం విధానం కేసులో ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్ట్ చేయగా, మార్చి 9న ఈడీ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన తిహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

శివసేన, బీజేపీ కలిసే పోటీ: షిండే

ముంబై: స్థానిక సంస్థలు సహా భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ శివసేన(షిండే వర్గం), బీజేపీ కలిసే పోటీ చేస్తాయని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. మహారాష్ట్రలో ఈ రెండు పార్టీలు అధికారాన్ని పంచుకుంటున్న విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎం ఫడ్నవీస్‌తో కలిసి తాను ఆదివారం రాత్రి ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షాతో సమావేశమైనట్లు షిండే సోమవారం ట్వీట్ చేశారు. లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీకి దిగాలని ఆ సమావేశం నిర్ణయం తీసుకున్నాం. కలిసి పోటీ చేస్తాం. మెజారిటీతో విజయం సాధిస్తాం'అని షిండే పేర్కొన్నారు.

చేయని నేరానికి 20 ఏళ్లు జైల్లో...!

కాన్‌బెర్రా: ఓ మహిళ తన నలుగురు పిల్లలను చంపిన నేరంపై 20 ఏళ్లపాటు ఖైదీగా గడిపింది. ఆమె పిల్లలు సహజ కారణాలతో చనిపోయారంటూ తాజాగా శాస్త్రీయంగా రుజువు కావడంతో క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేశారు. ఆస్ట్రేలియాలోని న్యూసౌత్‌వేల్స్ రాష్ట్రం గ్రాఫ్టన్‌కు చెందిన కాథ్లీన్ ఫోల్బిగ్‌కు కలెబ్, పాట్రిక్, సారా, లారా అనే నలుగురు పిల్లలు. వీరంతా 1989–99 మధ్య దశాబ్ద కాలంలో 19 రోజుల నుంచి 19 నెలల వయస్సుల్లో చనిపోయారు. ఆ సమయంలో ఫోల్బిగ్ పిల్లల పెంపకంలో కష్టనష్టాల గురించి తన డైరీలో రాసుకున్నారు. వీటితోపాటు ఇతర సాక్ష్యాల ఆధారంగా 2003లో ఆమెకు 30 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఫోల్బిగ్ మాత్రం నేరం చేయలేదంటూ కోర్టులో పోరాటం సాగిస్తున్నారు. అరుదైన ఈ కేసు దేశవ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆమె సంతానం సహజంగానే, 'కామ్2–జీ114ఆర్'అనే జన్యుపరంగా వచ్చే గుండె జబ్బులతో చనిపోయారని నిపుణులు తేల్చారు. ఆమెకు మద్దతుగా 90 మంది నిపుణుల సంతకాలతో ప్రభుత్వానికి అర్జీ వెళ్లింది. అన్నిటినీ పరిశీలించిన ప్రభుత్వం ఫోల్బిగ్(55)కు బేషరతుగా క్షమాభిక్ష ప్రసాదిస్తూ సోమవారం విడుదల చేసింది.

ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర

ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్‌స్టేషన్ పరిధి గల టేకుమెట్ల అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఉదయం కూంబింగ్ సమయంలో ఎండుటాకుల కింద అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి సీఆర్‌పీఎఫ్ 85వ, 222వ బెటాలియన్లకు చెందిన ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యారు. వీరిని మొదటి గంగులూరుకు, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో రాయ్‌పూర్‌కు తరలించారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 6 । జూన్ । 2023



క్వింటాల్ పత్తి ధర రూ.7,350

జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్‌లో సోమవారం క్వింటాల్ పత్తి గరిష్ట ధర రూ.7,350, మోడల్ ధర రూ.7,250, కనిష్ట ధర రూ.6,900 పలికింది.



క్షణాల్లో ఘోరం..

మాటలకందని విషాదం.. మరికొన్ని రోజుల్లో ప్రసవం జరిగి, ఆ ఇంట్లోకి శిశువు రానుందన్న వారి ఆనందాన్ని రోడ్డు ప్రమాదం క్షణాల్లో తీసుకెళ్లిపోయింది.

8లో▸

గరిష్టం/కనిష్టం
39.0/29.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు



కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న జడ్జి

హుజూరాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత సీనియర్ సివిల్ జడ్జి డీవీ నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజూరాబాద్ కోర్టు ఆవరణలో పర్యావరణ విశిష్టతను తెలియజేస్తు, అదనపు మెజిస్ట్రేట్ అలేఖ్య, రెండో అదనపు మెజిస్ట్రేట్ స్వాతి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు యతిపతి అరుణ్ కుమార్, గవర్నమెంట్ ప్లీడరు కేతిరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహమూర్తి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తన జన్మదినం సందర్భంగా ఒక మొక్క నాటడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న నగరపాలకసంస్థ కమిషనర్



తలసాని చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థకు రాష్ట్ర స్థాయిలో వచ్చిన పర్యావరణ అవార్డును సోమవారం హైదరాబాద్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా కమిషనర్ సేవా ఇస్లావత్ అందుకున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ (రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్) అమలులో భాగంగా ఐదు నగరాల్లో కరీంనగర్ మొదటి స్థానంలో నిలవడం తెలిసిందే. అవార్డు స్వీకరణలో ఎన్విరాన్ మెంట్ ఇంజినీర్ స్వామి, శానిటరీ సూపర్‌వైజర్ రాజమహోహర్ తదితరులు పాల్గొన్నారు.

పర్లపల్లి గ్రామ పంచాయతీకి..

తిమ్మాపూర్(మానకొండూర్): పరిశుభ్రత, పచ్చదనం విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పర్లపల్లి గ్రామపంచాయతీకి రాష్ట్రస్థాయి పర్యావరణ పురస్కారం వరించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్ సనత్‌నగర్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా పర్లపల్లి సర్పంచ్ భారతి పురస్కారం స్వీకరించారు. పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు పర్లపల్లి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమినరీకి సిద్ధంగా ఉండాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



కరీంనగర్: ఈ నెల 11న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఒక ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలో 16,829 మంది అభ్యర్థుల కోసం 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీరు, టాయిలెట్ తదితర వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను, అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సందేహాలు, సమస్యల పరిష్కారం కోసం 18004254731 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

బండి, ఈటల ఆధిపత్యమేల?

- ఇద్దరినీ వ్యతిరేకిస్తున్న సీనియర్లు
- కమలంలో తిరుగుబాటు!
- పాతవారితో సమన్వయమేదని ఆవేదన
- కొత్తవారికి మితిమీరి ప్రాధాన్యంపై ఆందోళన



గుజ్జుల ఇంట్లో సమావేశమైన ఈటల, సుగుణాకర్‌రావు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ బీజేపీలో మరోసారి ముసలం పుట్టేలా ఉంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి వ్యతిరేకంగా పావులు కదుపుతున్న సీనియర్లు మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో తమను కాదని కొత్త వారికి పెద్ద పీట వేయడంపై ఇంతకాలం కినుక వహించి నేడు తమ మనసులో మాట బయటపెట్టారు. పార్టీలో బండి–ఈటల ఆధిపత్యాన్ని సహించేది లేదని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు పెద్దపల్లిలోని గుజ్జుల రామకృష్ణారెడ్డి ఇంట్లో చేరికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత పొలసాని సుగుణాకర్ రావు కూడా పాల్గొనడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ ముగ్గురూ సమావేశమైన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కి వ్యతిరేకంగానే వీరు సమావేశమయ్యారన్నది మాత్రం స్పష్టమవుతోంది.

ఆధిపత్యం సహించలేకపోతున్నాం

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ గెలిచినప్పటి నుంచి తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పార్టీ కార్యకలాపాల్లో కలుపుకోవడం లేదని ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్లు గుజ్జుల రామకృష్ణారెడ్డి, సుగుణాకర్‌రావులు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు పార్టీకి మంచివికావని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న కొందరు నేతలను దూరం పెట్టడంతో కేడర్‌లో ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని ఆవేదన చెందుతున్నారు. కొత్తవారికి అవకాశాలు ఇవ్వాల్సిందేనని, అలాగని సీనియర్లను విస్మరించడం తగదని హితవు పలుకుతున్నారు. బండికి పార్టీ పగ్గాలు ఇవ్వడం ఇష్టం లేని అదే సీనియర్లు, ఇటీవల పార్టీలో చేరిన ఈటల రాజేందర్‌కు కీలక బాధ్యతలు అప్పగించడంపై గుర్రుగా ఉండడం గమనార్హం. కొత్తగా పార్టీలో చేరిన వారికి కీలక బాధ్యతలు అప్పగించడాన్ని సీనియర్లు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ఇలాంటి విధానాలతోనే 2018, 2019 ఎన్నికలలో నిజాయితీగా పనిచేసిన చాలామంది పార్టీకి దూరమయ్యారని, ఇది ఇలాగే కొనసాగితే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది తరువాత

గతేడాది ఆరంభంలోనూ ఇదే విషయమై కొందరు అనుచరులతో కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో తిరుగుబాటు సమావేశం నిర్వహించారు. దీనిపై అప్పట్లో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్రంగా పరిగణించారు. అధిష్టానం ఆయనకే అండగా నిలిచింది. ఒకదశలో సీనియర్లు అయిన గుజ్జుల రామకృష్ణారెడ్డి, సుగుణాకర్‌రావులకు షోకాజ్ నోటీసులు జారీచేయాలన్న విషయాన్ని పరిశీలించింది. కానీ, సీనియర్లు కావడంతో మరో సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి మధ్యవర్తిత్వం వహించి ఆ వివాదాన్ని శాంతింపజేశారు. చాలా రోజులుగా బండిపై నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి కాస్తా.. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ ఓటమి తరువాత బయటపడింది. బండి వ్యవహార శైలితో తామెలా ఇబ్బంది పడుతున్నామో పలుమార్లు ఢిల్లీ పెద్దలకు వీరు ఫిర్యాదులు చేశారు. తాజాగా అధిష్టానం కూడా బండిని ఢిల్లీకి పిలిపించింది. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురూ సమావేశమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా బండి విషయంలో ఏం చేయాలి? ఎలా ముందుకు వెళ్లాలి? అన్న విషయాలే అజెండాగా ఈటల, గుజ్జుల, పొల్సానిల సమావేశం జరిగిందని సమాచారం.

సీనియర్లపై బండి వర్గం మండిపాటు

రాష్ట్రంలో ఏడు శాతంగా ఉన్న బీజేపీ ఓటు బ్యాంకును ఏకంగా 35 శాతానికి పెంచిన సంజయ్‌కి వ్యతిరేకంగా పనిచేయడం దారుణమని బండి వర్గం భగ్గుమంటోంది. దుబ్బాక, హుజూరాబాద్, జీహెచ్ఎంసీ ఎన్నికలలో బండి సంజయ్ నేతృత్వంలో పార్టీ విజయం సాధించిందా? అసంతృప్త- తిరుగుబాటు నేతల వల్ల గెలిచిందా? అని ప్రశ్నిస్తున్నారు. ఉప ఎన్నికల్లో వరుస విజయాలు, పాదయాత్రలతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసిన బండిపై నిందలు వేయడాన్ని తీవ్రంగా తప్పుబడుతున్నారు. కొత్త తరాన్ని ప్రోత్సహించాల్సిన సీనియర్లు కాళ్లల్లో కట్టెలు పెట్టే విధానాలు మానుకోవాలని, పార్టీ పటిష్ట స్థితిలో ఉన్న సమయంలో ఇలాంటి తిరుగుబాటు సమావేశాలు చేటు చేస్తాయని సూచిస్తున్నారు.

అభివృద్ధిలో విద్యుత్ శాఖ కీలకం



విద్యుత్ శాఖ బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వం అద్భుత పథకాలు ప్రవేశపెట్టి విజయాలు సాధించగలిగిందంటే అందులో ప్రధానపాత్ర విద్యుత్ శాఖదేనని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం నుంచి శుభంగార్డెన్స్ వరకు నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం విద్యుత్ విజయోత్సవం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిననాటి నుంచి సరైన ఆదరణ లేక అన్ని రంగాల్లో తెలంగాణ వెనకబడిపోయిందని, గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు సరిగా రాకపోవడంతో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ముంబాయ్, భీవండి, దుబాయ్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లిపోయే పరిస్థితులు ఉండేవన్నారు. 2014 కంటే ముందు జిల్లాలో తలసరి విద్యుత్ వినియోగం 1,550 యూనిట్లు ఉంటే, ప్రస్తుతం 2,729 యూనిట్ల తలసరి విద్యుత్‌ను వినియోగిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఒక్కో రైతుపై నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రభుత్వమే ఖర్చుచేస్తుందని, కరెంట్ కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. తెలంగాణ అన్నిరంగాల్లో ముందుకు సాగుతోందంటే ప్రధాన పాత్ర విద్యుత్ శాఖకే దక్కుతుందన్నారు. అనంతరం విధి నిర్వహణలో వెలుగులు నింపి అసువులు బాసిన ఎంతోమంది లైన్‌మెన్, విద్యుత్ ఉద్యోగులకు మంత్రి సంతాపం తెలిపారు.

అధికారులతో సమీక్ష

సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన సంస్కరణలతో రాష్ట్రంలో కరెంటు కష్టాలు పోయాయన్నారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్‌ఫ్రంట్ పనులను పరిశీలించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈనెల 21న కేబుల్ బ్రిడ్జి ప్రారంభానికి రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రానున్నారని పేర్కొన్నారు. 21, 22 తేదీల్లో సాంస్కృతి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేలా కార్యచరణ రూపొందించాలని సూచించారు. కమాన్ నుంచి కేబుల్ బ్రిడ్జి మీదుగా సదాశివపల్లి వరకు లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కేబుల్ బ్రిడ్జి లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, మేయర్ సునీల్‌రావు, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, విద్యుత్ ఎస్ఈ గంగాధర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ఎంపీపీ లక్ష్మయ్య, ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఏవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్
- 178 దరఖాస్తులు స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కరీంనగర్ అర్బన్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో 178 దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ అధికారికి సంబంధించినవి 9, కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి 12, మున్సిపల్ కార్పొరేషన్ 23, తహసీల్దార్ కొత్తపల్లి 14, తహసీల్దార్ హుజురాబాద్ 10, తహసీల్దార్ కరీంనగర్ రూరల్ 11, మిగిలిన శాఖలకు సంబంధించి 99 ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని కలెక్టరేట్ ఏవో జగత్‌సింగ్ వివరించారు. జెడ్పీ సీఈఓ ప్రియాంక, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో, ఆర్డీవో ఆనంద్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఆందోళనలు, నిరసనలు కొనసాగుతుండగా నియంత్రణ చర్యలు చేపట్టారు. ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏఎస్ఐ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

యూఏఈలో దశాబ్ది వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎన్నారైలు

కరీంనగర్ అర్బన్: యూఏఈలో రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక సంక్షేమ సంఘం(ఈటీసీఏ), భారత జాగృతి యూఏఈ ఆధ్వర్యంలో అజ్మన్‌లోని హాబిటాట్ స్కూల్ ఆడిటోరియంలో ఉత్సవాలు జరిపారు. జాతీయ గీతం ఆలపించి, తొలి దశ నుంచి మలి దశ ఉద్యమం వరకు ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళి అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్, కొమురంభీం, చాకలి ఐలమ్మ, నారాయణరెడ్డి, శ్రీకాంతాచారి, యాదయ్య, కిష్టయ్యల త్యాగాలను స్మరించుకున్నారు. తెలంగాణ చారిత్రక వైభవాన్ని, ఉద్యమ శైలిని తలపించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గల్ఫ్‌లో నివసిస్తున్న తెలంగాణ బిడ్డల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. గల్ఫ్ సంక్షేమంపై బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీచర కిరణ్ కుమార్, రాధారపు సత్యం, మామిడి శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్‌రావు, రాగం అరవింద్ బాబు, వినోద్, కటకం సాయిచందర్, పీచర వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఈటీసీఏ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి..

ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మామిడి శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా చీటి జగదీశ్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వినోద్ ఆచార్యులు, నిర్వాహక కార్యదర్శిగా ఎలిగేటి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా గుండవేని శేఖర్ గౌడ్, ఎస్పీ కస్తూరి, అంబటి సురేశ్ రెడ్డి, వెలమ జలంధర్ రెడ్డి, గొల్లపల్లి వేణు, చకినం చైతన్య, తిరుమలరావు, తిరుపతి రెడ్డి, సంతోష్‌కుమార్ స్తంభంకాడి, రఘు ఎలిగేటి, రాణి కోట్ల ఎన్నికయ్యారు.

నాణ్యమైన సేవలందించాలి



మాట్లాడుతున్న సీతేశ్‌కిషన్

కరీంనగర్ అర్బన్: కస్టమర్లకు డీలర్లు నాణ్యమైన సేవలు అందించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇండేన్ ఎల్పీజీ ఐఓసీఎల్ ముఖ్య అధికారి సీతేశ్‌కిషన్ అన్నారు. నగరంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇండేన్ డీలర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్రోలియం మంత్రిత్వ శాఖ, ఆయిల్ కంపెనీలు పొందుపరచిన పారామీటర్లను కొనసాగించాలని సూచించారు. కాలం చెల్లిన రబ్బరు ట్యూబులను అవగాహన లోపంతో చాలా మంది వాడుతున్నారని, వాటి స్థానంలో ఐదేళ్ల కాలపరిమితి కలిగిన సురక్ష రబ్బరు ట్యూబ్ వాడాలని తెలిపారు. ఐఓసీఎల్ డీజీఎం బాలాజీ మాట్లాడుతూ, వంట గ్యాస్ ప్రమాదాల నివారణకు కస్టమర్లకు అవగాహన తరగతులు నిర్వహించాలని కోరారు. సీనియర్ డీలర్లు భాగ్యలత, మదన్‌మోహన్, రాధక్రిష్ణ, చరణ్, ప్రవీణ్, భాస్కర్, గట్టు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి'

జమ్మికుంట(హుజూరాబాద్): రైతు దినోత్సవం సందర్భంగా రైతుబంధు తీసుకుంటూ రుణమాఫీ, పరిహారం ఎందుకు అడుగుతున్నారనే విధంగా అన్నదాతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలవకుండా, ఓటు వేయకుండా సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీని చేస్తే కొమ్ములు వచ్చాయని అనుకోవడం పొరపాటన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో పని చేస్తున్న జీఎస్‌డబ్ల్యూఓ, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, సెక్యూరిటీ సిబ్బందిపై పలు ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ప్రవర్తన మార్చుకోకుంటే చర్యలు తప్పవని ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్ హెచ్చరించారు. జిల్లా ఆసుపత్రిలో జరుగుతున్న అవకతవకలపై ‹సాక్షి›లో ప్రచురితమైన వరుస కథనాలపై సూపరింటెండెంట్ స్పందించారు. సోమవారం ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడారు. కొంతమంది సిబ్బంది రోగులను ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయని, కొంతమంది డ్యూటీకి మద్యం సేవించి హాజరవుతున్నారని పద్ధతి మార్చుకోవాలని సూచించారు. వార్డులో పనిచేసే ఇన్‌చార్జిలు నియమ నిబంధనలు పాటించాలన్నారు. విధులకు హాజరుకాని సిబ్బందిపై ఎప్పటికప్పుడు నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. సిబ్బందికి రోస్టర్ ప్రకారం విధులు కేటాయించాలని ఒకే చోట విధులు వేయకుండా చూడాలన్నారు.

వర్గీకరణ లక్ష్యంగా పోరాడాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కరీంనగర్: రాష్ట్రంలో మాదిగలకు అడుగడుగునా తీరని అన్యాయం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల చట్టబద్ధతకు సోమవారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ఆవశ్యకతపై క్షేత్రస్థాయిలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి మాదిగలను జాగృతం చేస్తూ, వర్గీకరణే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. మాదిగ, మాదిగ ఉపకులాలకంటే మాలలు రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని, మాదిగలకు రాజకీయ వాటా దక్కకుండా చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. 2017 నవంబర్‌లో భారతీ మాదిగ చనిపోయిన రోజున నిండు అసెంబ్లీ సభలో సీఎం కేసీఆర్ రెండు రోజుల్లో అఖిలపక్ష కమిటీతో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని మాట ఇచ్చి ఆరేళ్లయిన దానిపై నోరువిప్పకపోవడం దుర్మార్గమన్నారు. వర్గీకరణ సాధనకు విద్యార్థులు, యువత, మహిళలు గ్రామాల్లోకి వెళ్లి రాజకీయాలకు అతీతంగా మాదిగల్లో చైతన్యం తేవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బెజ్జంకి అనిల్, మంద దేవేంద్రప్రసాద్, ఇంజం వెంకటస్వామి, బుర్రి సతీష్, దండు అంజయ్య, తడగొండ శంకర్, కొత్తూరి రాజన్న, తుంగ ఆంజనేయులు, చెంచాల నవీన్, నురుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి

వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జక్కం సంపత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడారు. వికలాంగులు చట్టసభలు, స్థానిక సంస్థల్లో పోటీ చేసేలా రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. వికలాంగుల సమస్యల సాధనకు ఎమ్మార్పీఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తక్షణమే ప్రధాన డిమాండ్లను నెరవేర్చకుంటే పాలక వర్గాలకు తగిన గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణే మానవాళికి రక్ష

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్



కరీంనగర్ అర్బన్: వాతావరణ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ కాలుష్య నివారణ ర్యాలీని కలెక్టరేట్ వద్ద జెండా ఊపి, ప్రారంభించారు. గీతా భవన్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కాలుష్య నివారణ కోసం అందరూ క్లాత్, జూట్ బ్యాగులను వాడాలని, సొంత స్టీల్ వాటర్ బాటిల్స్ క్యారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ వీరేష్, ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎఫ్ఆర్వో శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు, ఎన్జీవోలు, పరిశ్రమలు, హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షించాలి



విద్యానగర్(కరీంనగర్): ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజా సంఘాల నాయకులు, పర్యావరణ ఉద్యమకారులు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో తెలంగాణ భూమి రక్షణ సంఘం, రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడారు. ఏటా 8 మిలియన్ టన్నుల వ్యర్థాలు సముద్రంలో కలుస్తుండడం వల్ల సముద్ర జలాలు కాలుష్యం అవుతున్నాయని, మంచి నీటి వనరులు కాలుష్యం అవుతూ మనిషి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. వ్యవసాయ రంగంలో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడడంతో భూసారం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి పరిరక్షణలో ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు పి.సుగుణాకర్‌రావు, తెలంగాణ భూమి రక్షణ సంఘం బాధ్యులు మార్వాడి సుదర్శన్, వివిధ సంఘాల బాధ్యులు వెంకట మల్లయ్య, రాజయ్య, శ్రీపతి రాజగోపాల్, వడ్డెపల్లి మల్లేశం, జుపాక శ్రీనివాస్, ప్రసాద్, లక్ష్మి, సురేందర్‌రెడ్డి, బోయిని అశోక్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై కేసు

మానకొండూర్: మండలంలోని వేగురుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంరాజయ్య, అతడి భార్య పద్మపై కేసు నమోదు అయినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. వేగురుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న టీచర్ దాసరి మమత సోమవారం బడి బాట కార్యక్రమంలో పాల్గొంది. ఈక్రమంలో మమత బడిబాటలో పాల్గొన్న ఫొటోలను పద్మ తీసి రాంరాజయ్యకు పంపించగా వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. కాగా తన ఫొటోలు పోస్టు చేసి అవమాన పరిచారని, అడిగితే ఇష్టం వచ్చినట్లు ఇరువురు బూతులు తిట్టారని మమత ఫిర్యాదు చేయగా, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

‘సీఎం కప్-2023’లో నిరాశ

- రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపని ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- మొత్తంగా సాధించిన పతకాలు మూడే..
- టీం విభాగంలో ఖాతా తెరవని వైనం
- పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఒక్కటీ రాలే



ఆర్చరీలో పోటీ పడుతున్న క్రీడాకారులు (ఫైల్)



రజత పతకంతో సాత్విక్‌రాజ్





హన్సికరావు అభినందిస్తున్న, శైలజకు కాంస్య పతకం అందిస్తున్న శాట్స్ చైర్మన్ ఆంజనేయులు

కరీంనగర్ స్పోర్ట్స్: కన్నారం పాత జిల్లా క్రీడారంగంలో ఒక వెలుగు వెలిగింది. రాష్ట్ర పోటీలు ఏ ఆటలోనైనా అది వ్యక్తి గత ఈవెంటా.. టీం ఈవెంటా అనే భేదం లేకుండా ఏదో ఒక పతకంతో తిరిగొచ్చే చరిత్ర ఉన్న జిల్లా. అలాంటిది ప్రస్తుతం అట్టడుగు స్థానంలో నిలవడం కలవరపెడుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో క్రీడారంగం కుదేలైందని ఇటీవలి కాలంలో జరుగుతున్న పోటీలను చూస్తుంటే తెలుసోతందని పలువురు క్రీడా విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్ర, జాతీయ పోటీల్లో ఉమ్మడి జిల్లా పతకాల పట్టికలో కింది వరుసలో నిలుస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగిన తొలి చీఫ్ మినిస్టర్స్ కప్-2023 రాష్ట్రస్థాయి పోటీల్లో మన క్రీడాకారుల పేలవ ప్రదర్శన బాధ కలిగించిదని చెబుతున్నారు. గంపెడాశతో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు రాష్ట్ర పోటీలకు పంపిస్తే పతకాలు సాధించలేకపోయారు. 690 మందికి పైగా క్రీడాకారులు, 100 మంది కోచ్‌లు, మేనేజర్లు, లైజనింగ్ అధికారులు పాల్గొన్న ఆ మెగా టోర్నీలో కేవలం 3 పతకాలు దక్కాయి. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాలోని మూడు జిల్లాలు పతకాల ఖాతా తెరవకపోవడం ఇక్కడ క్రీడారంగ దుస్థితి అద్దం పడుతోందని క్రీడాభిమానులు అంటున్నారు.

లోపించిన పారదర్శకత...

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఆయా జిల్లాల్లో చేపట్టిన జిల్లాస్థాయి పోటీల్లో జట్ల ఎంపికలో పారదర్శకత లోపించిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరికల్లాంటి క్రీడాకారులను వెలుగులోకి తేవాలన్నది చీఫ్ మినిస్టర్స్ కప్ లక్ష్యం. అందుకే క్రీడాకారుల అర్హత వయసు 15 నుంచి 36 ఏళ్ల వరకు నిర్ణయించారు. కానీ పక్క జిల్లాలవారు సీనియర్ క్రీడాకారులను తీసుకొచ్చి, పతకాలను కొట్టుకుపోతే మనోళ్లు ఆ పని చేయలేకపోయారని చెబుతున్నారు. స్మార్ట్‌సిటీతో కరీంనగర్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నా కేవలం వ్యక్తిగత విభాగంలో పతకాలు సాధించడం, టీం విభాగంలో చేతులెత్తేయడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తూతూమంత్రంగా ఆయా జట్లను కూర్చి, రాష్ట్ర పోటీలకు పంపారని సమాచారం.

కరీంనగర్‌కే 3 పతకాలు..

చీఫ్ మినిస్టర్స్ కప్‌లో పతకాలు సాధించి, ఉమ్మడి జిల్లా కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆశిస్తే నిరాశే మిగిలింది. కరీంనగర్ జిల్లా కేవలం 3 పతకాలు అది కూడా వ్యక్తిగత విభాగంలో సాధించింది. పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు ఒక్క పతకం కూడా సాధించలేపోయాయి. కరీంనగర్ జిల్లా నుంచి స్విమ్మింగ్ 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో సాత్విక్ రాజ్, ఆర్చరీలో 50 మీటర్ల కంపౌండ్ విభాగంలో హన్సికరావులు రజత పతకాలు సాధించగా, అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల రన్నింగ్‌లో శైలజ కాంస్య పతకం సాధించి, ఊరటనిచ్చారు.

కరీంనగర్ జిల్లా..

క్రీడాకారులు	220 మంది
పాల్గొన్న క్రీడలు	17
సాధించిన పతకాలు	3 (వ్యక్తిగత విభాగంలో)

పెద్దపల్లి..

క్రీడాకారులు	159 మంది
పాల్గొన్న క్రీడలు	11
సాధించిన పతకాలు	0

రాజన్న సిరిసిల్ల..

క్రీడాకారులు	152 మంది
పాల్గొన్న క్రీడలు	10
సాధించిన పతకాలు	0

జగిత్యాల..

క్రీడాకారులు	160 మంది
పాల్గొన్న క్రీడలు	16
సాధించిన పతకాలు	0

8న అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల వేలం

కరీంనగర్ అర్బన్: నాల్గో విడత అంగారిక టౌన్‌షిప్ ప్లాట్ల ప్రత్యక్ష వేలం ఈనెల 8న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ మండలం మహాత్మనగర్‌లోని శ్రీవేంకటేశ్వర కల్యాణ మండపంలో అంగారిక టౌన్‌షిప్‌లోని 75 ప్లాట్ల అమ్మకం ప్రక్రియ నిర్వహిస్తామని పేర్కొన్నారు. నివాస స్థలం ప్లాట్‌లకు చదరపు గజానికి రూ.6,000, వాణిజ్యస్థలం చదరపు గజానికి రూ.8,000 చొప్పున వేలం వేయనున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనేవారు దరఖాస్తుతో పాటు ధరావత్తు సొమ్ము డిస్ట్రిక్ట్ కలెక్టర్ కరీంనగర్, రాజీవ్ స్వగృహ పేరున (ఈఎండీ) రూ.10,000 డీడీ తీయాలని, పాత రాజీవ్ స్వగృహ దరఖాస్తుదారులు ఎవరైతే రూ.3,000, రూ.5,000 రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించారో ఆ ఒరిజినల్ ఈ- సేవ రశీదు, ఏవేని రెండు ఐడెంటి ప్రూఫ్స్‌ను సుడా కార్యాలయంలో అందజేసి టోకెన్ పొంది 8న జరిగే వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో ప్లాట్ తీసుకున్న వారు పూర్తి సొమ్మును 7 రోజుల లోపు 33 శాతం, 45 రోజుల లోపు 33 శాతం, 90 రోజుల లోపు 33శాతం చెల్లించాలన్నారు. పూర్తి సొమ్ము నెల లోపు చెల్లిస్తే 2శాతం డిస్కౌంట్ ఉంటుందని వివరించారు.

‘ఉపాధిహామీ’ ఎత్తివేతకు కేంద్రం కుట్ర



అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న బీకేఎంయూ నాయకులు

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ఆరోపించారు. ఈ తప్పుడు ఆలోచన మానుకోవాలని, లేనిపక్షంలో ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూలీల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. దేశంలోని కోట్లాది మంది పేదలకు చేతినిండా పని కల్పించాలన్న లక్ష్యంతో పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో కోత పెడుతోందని మండిపడ్డారు. పథకం పనుల్లో అనేక ఆంక్షలు పెడుతూ పని ప్రదేశాల్లో కూలీల ఫొటోను రెండు సార్లు అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపారు. వారికి శ్రమకు తగిన ఫలితం ఇవ్వడం లేదన్నారు. కూలీని రూ.200 నుంచి రూ.600కు పెంచాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించి, పనిముట్లు అందజేయాలని, వేసవి అలవెన్సు ఇవ్వాలన్నారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, దరిపెల్లి అంకుస్, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

జమ్మికుంట(హుజూరాబాద్): ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, భావితరాలకు పచ్చని పర్యావరణం అందించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలిటెక్నిక్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని కేవీకేలో లైఫ్(మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్వీరాన్‌మెంట్)లో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం, ప్రకృతి వ్యవసాయంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకంతో గాలి, నేల, నీరు కలుషితం అవుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్త వేణుగోపాల్ పర్యావరణ పరిరక్షణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, సేద్యపు విభాగ శాస్త్రవేత్త విజయ్ రసాయనిక వ్యవసాయం వల్ల కలిగే అనర్థాలు, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. అనంతరం రైతులకు కరివేపాకు, మామిడి మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకేలో శిక్షణ పొందుతున్న ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, పాలిటెక్నిక్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

క్షణాల్లో ఘోరం.. అమ్మతనానికి దూరం

- ఆధార్ అప్‌డేట్ కోసం వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్కూటీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- తీవ్రంగా గాయపడి, భర్త చేతిలోనే ప్రాణాలు వదిలిన గర్భిణి
- ఎన్టీపీసీ క్రషర్‌నగర్ వద్ద ఘటన





భార్యను కాపాడుకునేందుకు భర్త ఆరాటం, ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



భర్త క్రాంతితో నిహారిక (ఫైల్)



బాధితులను పరామర్శిస్తున్న మక్కాన్‌సింగ్

జ్యోతినగర్(రామగుండం): మాటలకందని విషాదం.. మరికొన్ని రోజుల్లో ప్రసవం జరిగి, ఆ ఇంట్లోకి శిశువు రానుందన్న వారి ఆనందాన్ని రోడ్డు ప్రమాదం క్షణాల్లో తీసుకెళ్లిపోయింది. కారు రూపంలో వచ్చిన మృత్యువు ఓ గర్భిణిని కబళించింది. భర్తతో కలిసి స్కూటీపై వెళ్తున్న ఆమెను వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో గర్భిణి తీవ్రంగా గాయపడి, మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన నిహారిక, రామగుండం మండలంలోని మల్యాలపల్లెకు చెందిన కత్తెరమల్ల క్రాంతి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆమె ఓ మెగా మార్కెట్‌లో పని చేస్తోంది. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భిణి. ఆధార్ అప్‌డేట్ కోసం భర్తతో సోమవారం స్కూటీపై ఎన్టీపీసీ రామగుండం వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తుండగా క్రషర్‌నగర్ రాజీవ్ రహదారిపై పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన నిహారికను గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కడుపులో ఉన్న శిశువు కళ్లు తెరవకుండానే ప్రాణాలు విడిచింది. కొన్ని నిమిషాల్లో ఇంటికి చేరేవారని, ఈలోగా ఇంత ఘోరం జరిగిందంటూ మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు ఆస్పత్రిలో కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి, మృతురాలి భర్త నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ..

పెద్దపల్లి డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాగూర్ మక్కాన్‌సింగ్ గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో నిహారిక మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఫకృద్దీన్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, రామగుండం పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శిరిషెట్టి సతీశ్, మడ్డి తిరుపతి గౌడ్, బరుపాటి శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యుత్ రంగంలో అద్భుత పురోగతి

- ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: తెలంగాణ వచ్చాక విద్యుత్‌రంగంలో అద్భుత పురోగతి సాధించి దేశానికి దారి చూపే టార్చ్ బేరర్‌గా రాష్ట్రం నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక మధువని గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రగతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 2014కు ముందు కరెంట్ కోతలు, పవర్ హాలీడేలు, కరెంట్ కోసం ధర్నాలు, సబ్‌స్టేషన్ల ముట్టడి, రాస్తారోకోలు నిత్యకృత్యాలుగా కనిపించేవని గుర్తుచేశారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ అకుంఠిత దీక్షతో కరెంట్ నిరంతరాయంగా వెలుగులు పంచుతుందని, నేడు దేశంలో కరెంటు కోతలు లేని ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఆర్థిక, పారిశ్రామిక, ఐటీ లాంటి రంగాలకు గుండెకాయలాంటి హైదరాబాద్‌ను సీఎం కేసీఆర్ ‘పవర్ ఐలాండ్’గా మార్చారన్నారు. నగరం చుట్టూ మూడు వలయాల్లో విద్యుత్ ఐలాండ్ నెలకొల్పారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎంపీపీ ఇరుమళ్ల రాణి, జెడ్పీటీసీ పడిదం బక్కారెడ్డి, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, విద్యుత్ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ పరీక్ష-2024కు ఉచిత భోజన వసతితో బంజారాహిల్స్ హైదరాబాద్ నందు శిక్షణ పొందేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా, పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి జూలై 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 9న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పంపించాలని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదని, ఈ సంవత్సరం(2023-24) ఏ కళాశాలలోనైనా, ఏదైనా కోర్సు చదువుతున్న వారు లేదా ఉద్యోగం చేస్తున్నవారు అనర్హులని తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆబ్జెక్టివ్ టైప్ ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23546552 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీ’



మాట్లాడుతున్న వేణుగోపాల్

విద్యానగర్(కరీంనగర్): సీఎం కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీగా మారిందని ప్రజామిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కొరివి వేణుగోపాల్ విమర్శించారు. సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కేసీఆర్ పాలనలో కలెక్టర్లు, ఎస్పీలు బీఆర్ఎస్ కార్యకర్తలుగా మారారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రజాసంఘాలను బంగాళాఖాతంలో పడేస్తామని సీఎం కేసీఆర్ నిర్మల్ సభలో అనడం హాస్యాస్పదంగా ఉందని, ఎవరు ఎవరిని విసిరేస్తారో త్వరలోనే తెలుస్తుందన్నారు. ప్రజలు నమ్మి కేసీఆర్‌కు పట్టం కడితే ఇష్టారాజ్యంగా రాచరిక పాలన కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. ధరణి తీసివేస్తే రైతులకు రైతుబంధు ఎలా వస్తుందని అంటున్న సీఎంకు సాఫ్ట్‌వేర్ ద్వారా వేయవచ్చన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. గతంలో ఉన్న విధానమే బాగుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, 22 లక్షల ఎకరాలను నిషేధిత భూముల లిస్టులో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ఈనెల 10న ఫిలింభవన్‌లో ‘ధరణి ఒక పీడ’ పేరిట నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరు మురళి, హైకోర్టు న్యాయవాది సాదిక్ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో చిగురు శ్రీధర్, శ్రీరాములు, బండ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

కరీంనగర్‌టౌన్: రెడ్ల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం చింతకుంటలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని ప్రతి రెడ్డి కుటుంబం హాజరై విజయవంతం చేయాలని ఐక్యవేదిక అధ్యక్షుడు వంచ సుదర్శన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎస్సారార్ కళాశాల మైదానంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రెడ్లకు రూ.5వేల కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు చేయాలని, 50 ఏళ్లు దాటిన ప్రతి రెడ్డి రైతుకు రే.5వేల పెన్షన్ ప్రకటించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోగూరు బాపురెడ్డి, బండ రమణారెడ్డి, నరహరి లక్ష్మారెడ్డి, రేకులపల్లి రవీందర్‌రెడ్డి, చింతల శ్రీనివాసు రెడ్డి, వి.మహిపాల్‌రెడ్డి, గన్ను మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సి.వినోద్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వి.వెంకటేశ్వర్లు హైదరాబాద్ జోన్‌కు బదిలీ కాగా, హైదరాబాద్ బస్‌భవన్‌లో పీఅండ్ఏఎం, సీఐఈడీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేసిన వినోద్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్‌కు కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎస్.సుచరిత, రీజనల్ మేనేజర్లు జానీరెడ్డి, ప్రభులత, ఉషాదేవి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) కృపాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వినోద్‌కుమార్ రీజనల్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. జోనల్ వర్క్‌షాపు వర్క్స్ మేనేజర్ సుగుణాకర్, కరీంనగర్ జోన్ డిప్యూటీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్నకుమార్, కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్)ఎస్.చందర్ రావు, కరీంనగర్ జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (లాజిస్టిక్స్) భానుకిరణ్, స్టోర్స్ ఆఫీసర్ భూపతిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కరీంనగర్1, 2 డిపోల మేనేజర్లు ప్రణీత, మల్లయ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడిని చంపిన ముగ్గురికి యావజ్జీవ శిక్ష

జగిత్యాల జోన్: స్నేహితుడిని చంపిన ముగ్గురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమా సోమవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్రీవాణి, జంగిలి మల్లికార్జున్ తెలిపిన ప్రకారం.. మల్యాల మండలం రామన్నపేటకు చెందిన నూనె సమ్మక్క బోళ్లు విక్రయిస్తూ జీవనం గడుపుతుంది. సమ్మక్కకు నలుగురు కుమారులు కాగా రెండో కొడుకు తిరుపతికి, మల్యాల క్రాస్ రోడ్డుకు చెందిన పన్నాటి శ్రీను, మల్యాల మండల కేంద్రానికి చెందిన మిట్టపెల్లి రమణ, దూస అశోక్, రుద్రోజు రాంమోహన్ స్నేహితులు. 2017 జనవరి 1న వీరంతా విందు చేసుకున్నారు. పాత కక్షలతో తిరుపతిపై స్నేహితులు దాడిచేసి బంగ్లాపై నుంచి తోసేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జనవరి 3, 2017 రోజున తిరుపతి మృతిచెందాడు. దీనిపై మృతుడి తల్లి సమ్మక్క పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అప్పటి సీఐ, ప్రస్తుత డీఎస్పీ కృపాకర్ కేసు దర్యాప్తు చేశారు. ఈ మేరకు నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ బృంద సభ్యులు రాజునాయక్, ఎం.కిరణ్‌కుమార్, కె.వీ సాగర్ కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. దీంతో మిట్టపెల్లి రమణ, దూస అశోక్, రుద్రోజు రామ్మోహన్‌కు యావజ్జీవ శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న పన్నాటి శ్రీను విచారణ సమయంలోనే మృతిచెందడంతో కేసు తొలగించారు.

వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: ఉప సర్పంచ్‌పై దాడిచేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం బాలపల్లి గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ గంగారెడ్డిపై అదే గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి సోమవారం దాడిచేశాడు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ భూపతిరెడ్డి ఉపసర్పంచ్ మధ్య గొడవ జరుగుతుండగా సర్పంచ్ కుమారుడు రేవంత్‌రెడ్డి గంగారెడ్డిపై దాడిచేయగా అతడికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అన్నను చంపిన తమ్ముడు

బుగ్గారం(ధర్మపురి): నిద్రిస్తున్న అన్నపై రోకలి బండతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బుగ్గారం మండలం చిన్నాపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఇడగొట్టు తిరుపతి (45), ఇడగొట్టు శ్రీనివాస్ అన్నదమ్ములు. కొంతకాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. 2015లో తిరుపతి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదైంది. దీంతో కేసుపై రాజీకి రావాలని శ్రీనివాస్ తిరుపతిని కోరాడు. అందుకు తిరుపతి నిరాకరించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య గొడవలు మరింత ముదిరాయి. ఆదివారం తిరుపతి తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో శ్రీనివాస్ రోకలి బండతో అన్నపై దాడిచేశాడు. దీంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వీరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

‘బడిబాట’లో ఉపాధ్యాయులు

- ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలపై విస్తృత ప్రచారం
- ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులు
- 3నుంచి 9వరకు అడ్మిషన్లకు స్పెషల్‌డ్రైవ్


దుర్శేడ్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్‌: 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా విద్యార్థులను చేర్పించేందుకు ఈనెల 3నుంచి 9వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రవేశాల కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. దీనిలో భాగంగా కరీంనగర్‌ నియోజకవర్గంలోని కరీంనగర్‌అర్బన్‌, రూరల్‌, కొత్తపల్లి మండలాల్లోని గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ పాఠశాలల్లోని సౌకర్యాలపై ముద్రించిన కరపత్రాలను ఉపాధ్యాయులు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. ప్రైవేట్‌ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్‌మీడియం ప్రవేశపెట్టామని వివరిస్తున్నారు. ఇటీవల ఎస్సెస్సీ ఫలితాల్లో పాఠశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో ఇంటింటికీ తిరుగుతూ కొత్తగా విద్యార్థులను చేర్పించుకుంటున్నారు. సోమవారం కరీంనగర్‌ మండలం దుర్శేడ్‌లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సర్పంచ్‌ గాజుల వెంకటమ్మ, ఉప సర్పంచ్‌ సుంకిశాల సంపత్‌రావు, వార్డు సభ్యులు కల్లెపల్లి అశోక్‌, తిరుపతి, రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోని సౌకర్యాలపై విస్తృత ప్రచారం

మన ఊరు–మన బడి కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం గతేడాది నిధులు మంజూరు చేసింది. కరీంనగర్‌ నియోజకవర్గంలో మొదటి విడతలో 35 పాఠశాలలను ఎంపిక చేశారు. కరీంనగర్‌రూరల్‌లో 10 పాఠశాలలకు రూ.62.55లక్షలు, కరీంనగర్‌అర్బన్‌లో 14 పాఠశాలలకు రూ.26.15 లక్షలు, కొత్తపల్లి మండలంలో 11 పాఠశాలలకు రూ.20.31 లక్షలు మంజూరు చేశారు. ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్‌, అదనపు తరగతి గదులు, వంటగదులను నిర్మించారు. తాగునీరు, విద్యుత్‌ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో పనులు చివరిదశలో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ పంపిణీ, మధ్యాహ్నభోజనం, డిజిటల్‌ విద్యాబోధన తదితర సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మూడు రోజుల్లో కరీంనగర్‌ అర్బన్‌లో 117మంది, రూరల్‌లో 22, కొత్తపల్లి మండలంలో 74 మంది చొప్పున మొత్తం 213 మంది కొత్త విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు.

ప్రవేశాల కోసం ప్రత్యేక కార్యాచరణ

బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల ప్రవేశాల కోసం ఈనెల 3నుంచి 9వరకు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నాం. బడీడు పిల్లలు, బడి మానేసిన పిల్లలు, బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నాం. 12నుంచి 17వరకు రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాం. పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకొస్తున్నారు.

– మధుసూదనాచారి, మండల విద్యాధికారి

క్లుప్తంగా

హైమాస్ట్‌ లైట్లు ప్రారంభం


హైమాస్ట్‌ లైట్లను ప్రారంభించిన సర్పంచ్‌

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం బొమ్మకల్‌, గుంటూరుపల్లి గ్రామాల్లో ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్‌లైట్లను సర్పంచ్‌ పురుమల్ల శ్రీనివాస్‌, బీజేపీ పార్లమెంట్‌ కన్వీనర్‌ ప్రవీణ్‌రావులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ ఎం.సత్యనారాయణ, వార్డుసభ్యులు సాయవేణి సుజాతరవీందర్‌, మాజీ ఉప సర్పంచ్‌ చెట్టి జగన్‌, శ్రీనివాస్‌, రాజకొమురయ్య, మల్లయ్య, బీజేపీ నాయకులు దుబాల శ్రీనివాస్‌, పాశం తిరుపతి, సదానందం, శ్రీధర్‌, పెద్ది లక్ష్మణ్‌, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని భగత్‌నగర్‌ జెడ్పీ క్వార్టర్స్‌లోని శ్రీవేంకటేశ్వరాలయంలో సోమవారం శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, విశ్వక్సేనపూజ, అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి కొన్న కాంతారెడ్డి, నిర్వహకులు ఈద సతీశ్‌, భాస్కర్‌, చక్రధర్‌రావు, అర్చకులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం నుంచి సుప్రభాతసేవ, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, నిత్య హోమం జరుగనున్నాయి.

‘వింధ్యావాలీ’ విద్యార్థులకు పతకాలు


పతకాలతో క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: కరీంనగర్‌లో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌ పోటీల్లో వింధ్యావాలీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలు కైవసం చేసుకున్నారు. వరుణ్‌ చంద్ర, రోహిత్‌ , కార్తికేయ, నైతికలు కటాస్‌ స్పారింగ్‌లో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్‌ జి.ప్రశాంత్‌ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల కరస్పాండెంట్‌ రామవరపు లక్ష్మీప్రకాశ్‌రావుతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

7 నుంచి చేప మందు పంపిణీ

విద్యానగర్‌(కరీంనగర్‌): ధన్వంతరి ఆయుర్వేద కళానికేతన్‌ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని క్లాక్‌ టవర్‌ వద్ద ఈనెల 7, 8, 9 తేదీల్లో చేప మందు పంపిణీ చేయనున్నట్లు కామారపు నరహరస్వామి, విశ్వనాథం తెలిపారు. ఈ చేప మందు దగ్గు, దమ్ము, దీర్ఘకాల జ్వరం ఉన్న వారికి దివ్య ఔషధంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో అల్పాహారం పంపిణీ


అల్పాహారం అందజేస్తున్న క్లబ్‌ సభ్యులు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌లోని హౌసింగ్‌ బోర్డుకాలనీలో గల వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో సోమవారం లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ బొమ్మకల్‌ సభ్యులు మాసినేని లక్ష్మీప్రసన్న–మారుతీశ్వర్‌ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌ అధ్యక్షుడు చింతల కిషన్‌, ప్రతినిధులు వెంకటరమణరెడ్డి, నర్సింహరెడ్డి, ర్యాకం మోహన్‌, కాల్వ శ్రీనివాస్‌, తంగెళ్ల శ్రీనివాస్‌, లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మెట్ల పైనుంచి పడి వ్యక్తి మృతి

కరీంనగర్‌ క్రైం: మెట్ల పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్‌ త్రీటౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన బిట్ల మహేశ్వర్‌(58) భూపాలపల్లిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పని చేసేవాడు. వారానికి ఒకసారి ఇంటికి వచ్చి, వెళ్లేవాడు. ఈ నెల 3న ఇంటికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం మద్యం సేవించి, రాత్రి సిగరెట్‌ తాగేందుకు ఇంటి దాబాపైకి ఎక్కాడు. దిగే క్రమంలో మెట్ల పైనుంచి జారిపడటంతో తలకు గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు కార్తీక్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆధ్యాత్మికం

ముగిసిన బ్రహ్మోత్సవాలు


నగరంలోని మంకమ్మతోటలో గల శ్రీవేంకటేశ్వరాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం సుదర్శన, నారసింహ హోమం, పూర్ణాహుతి జరిగింది. ద్వాదశారాధన, సప్తావరణాలు, ఏకాంత సేవ, ఆశీర్వచనంతో ఉత్సవాలు సమాప్తమయ్యాయి. ఈవో ఎన్‌.శ్రీనివాస్‌, అర్చకులు పీచర నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

– కరీంనగర్‌కల్చరల్‌

రాజగోపురం శిఖర ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభం



కరీంనగర్‌ కల్చరల్‌: నగరంలోని మంకమ్మతోటలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రాజగోపుర శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. విశ్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, మతసంగ్రహణం, అంకురార్పణ చేశారు. శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం నుంచి పుట్ట బంగారం, ఎదుర్కోలు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎస్‌.శ్రీనివాస్‌, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ స్పృహ కలిగి ఉండాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న కోర్స్‌ డైరెక్టర్‌ శంకర్‌

సప్తగిరికాలనీ: ప్రతిఒక్కరూ పర్యావరణ స్పృహ కలిగి ఉండాలని కోర్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ శంకర్‌ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం కరీంనగర్‌లోని ధన్గర్‌వాడీ పాఠశాలలో జరుగుతున్న టెక్నికల్‌ టీచర్‌ ట్రైనింగ్‌లో పాల్గొన్న వారితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. తమవంతు బాధ్యతగా ప్లాస్టిక్‌ వాడకాన్ని నిషేధించాలన్నారు. కోర్స్‌ కోఆర్డినేటర్‌ కోట లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇంటిలోని ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకొని పచ్చని మొక్కను నాటాలని అన్నారు. పర్యావరణం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిత్యం మనం అనేక తప్పిదాలు చేయడం, వనరులను దుర్వినియోగపరచడం వల్ల అనర్థాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్‌ హెడ్మాస్టర్‌ ఏనుగు ప్రభాకర్‌రావు, సైన్స్‌ అధికారి జైపాల్‌రెడ్డి, బాలల జాతీయ సైన్స్‌ కాంగ్రెస్‌ అకాడమిక్‌ కోఆర్డినేటర్‌ కేఎస్‌ అనంతాచార్య ,ఇన్‌స్ట్రక్టర్స్‌ కన్నం రమేశ్‌, అరుణ, రాజేశం, శ్రీనివాస్‌, తిరుపతి, వీరన్న శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఎల్‌ఎండీలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కరీంనగర్‌ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఎం.వెంకటరాంబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని ప్రతిఒక్కరూ వారి ఇంటి పరిసరాల్లో ఒక్కో ఇంట్లో ఐదు మొక్కలు నాటాలని కోరారు. ఐటీఐ ప్రిన్సిపాల్‌ సరిత మాట్లాడుతూ కాలుష్యాన్ని కలిగించే ప్లాస్టిక్‌ వస్తువుల వాడకం తగ్గించాలని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చిత్ర కథ

అంటుకుంటే ముప్పే



వరిగడ్డి రవాణా ప్రమాదకరంగా మారింది. ఇటీవల చాలా చోట్ల ట్రాక్టర్‌ ట్రాలీల్లో తరలిస్తున్న వరిగడ్డికి విద్యుత్‌ వైర్లు తగిలి మంటలు లేచాయి. దీనికి తోడు గ్యాస్‌ సిలిండర్‌లు సైతం ఎండ తాకిడికి పేలాయి. అయినప్పటికీ వారి రవాణా తీరు మారడం లేదు. సోమవారం ఇలా రక్షణ చర్యలు లేకుండా వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌, సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ కనిపించాయి. పైన టార్పాలిన్‌ వేసుకొని వెళ్లినట్లయితే ప్రమాదం నుంచి బయటపడే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, కరీంనగర్‌



‘ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి’


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్‌: ఎలాంటి అనుమతి లేకుండా వైద్యం చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి డిమాండ్‌ చేశారు. సోమవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌ గరిమాఅగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆస్పత్రులకు పార్కింగ్‌ స్థలాలు, ఫైర్‌సేఫ్టీ, అర్హులైన వైద్య సిబ్బంది లేకున్నా ఎటువంటి తనిఖీలు నిర్వహించకుండానే అనుమతులు ఇస్తున్నారని అన్నారు. సూపర్‌ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, సంతాన సాఫల్య కేంద్రాలు లాంటి రకరకాల తోకపేర్లు పెడుతూ ఒకే డాక్టర్‌ పేరు పది ఆస్పత్రుల్లో బోర్డులపై ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేస్తూ లక్షల్లో దండుకుంటున్నారని అన్నారు. వైద్య అధికారులు పట్టించుకోకుండా కనీసం నిజనిర్ధారణ కమిటీలు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు నరేశ్‌, తదితరులు పాల్గొన్నారు.

‘రైతులకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న అంబటి జోజిరెడ్డి

కరీంనగర్‌: రైతులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి డిమాండ్‌ చేశారు. కరీంనగర్‌లోని సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జమ్మికుంటలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో ఓ రైతు మీరు ఇచ్చిన హామీ అమలు చేశారా? అని ప్రశ్నించినందుకు అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. రైతుల పేరు చెప్పుకుంటూ రైతులనే మోసం చేస్తున్నారని అన్నారు. వరి ధాన్యం ఇంకా 40శాతం కల్లాల్లోనే ఉండి ఇబ్బందులు పడుతుంటే వారి గురించి మాట్లాడకుండా ఉత్సవాల పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐఎఫ్‌బీ నాయకులు శంకర్‌, రమేశ్‌, పెద్దెల్లి శేఖర్‌, ఎంఎస్‌ విజయకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం


బహుమతులు అందజేస్తున్న వైద్యులు

కరీంనగర్‌స్పోర్ట్స్‌: క్రీడలతోనే విద్యార్థులు, క్రీడాకారులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ప్రముఖ వైద్యులు శ్రీమాన్‌రావు, మహేందర్‌లు అన్నారు. కరీంనగర్‌ అంబేడ్కర్‌ ఇండోర్‌ స్టేడియంలో శిక్షణ పొందుతున్న బ్యాడ్మింటన్‌ క్రీడాకారులు సోమవారం బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో పాల్గొని మాట్లాడారు. క్రీడల ద్వారా శరీరం దృఢంగా ఉంటుందని, సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవిస్తారని అన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు అంబాడి జోజిరెడ్డి, సభ్యులు రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌, శివ, నామ రమేశ్‌, దామోదర్‌, గూడ నరేశ్‌కుమార్‌, డాక్టర్‌ తిరుపతిరెడ్డి, యుగంధర్‌ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళి


ఇటీవల ఒడిశా రాష్ట్రంలో జరిగిన కోరమండల్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు ప్రమాదంలో మృతులకు సంతాప సూచకంగా కరీంనరగ్‌లోని తెలంగాణ చౌక్‌లో సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ, యూటీఎఫ్‌, ఎస్‌టీయూ, టీఆర్‌టీఎఫ్‌, టీపీటీఎఫ్‌ తెలంగాణ, డీటీఎఫ్‌, ఎస్‌జీటీయూ, టీటీయూ, ఆర్‌యూపీపీ, పేట, బీటీఎఫ్‌ నాయకులు ఎ.మోహన్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, జావేద్‌, రవీంద్రచారి, తిరుపతిరావు, ఎన్‌.విద్యాసాగర్‌, సీహెచ్‌.అశోక్‌రావు, పోరెడ్డి దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్‌, గోనె శ్రీనివాస్‌, తూముల తిరుపతి, బి.విజయేందర్‌రెడ్డి, ఆదర్శనరెడ్డి, జి.చంద్రశేఖర్‌ ఎన్‌.చైతన్య కరుణాకర్‌, శ్రీనివాస్‌, అంజన్‌బాబు, వి.లక్ష్మీనారాయణ, మల్లేశం, సలీం, కిషన్‌, దామోదర్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

– కరీంనగర్‌

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్‌ టూటౌన్‌ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌ జిల్లా కుమ్మరికుంట్లకు చెందిన పోలోజు వెంకటాచారి (55) కరీంనగర్‌లోని మంకమ్మతోటలో నివాసముంటూ సప్తగిరికాలనీలో కార్పెంటర్‌ దుకాణం నడిపిస్తున్నాడు. గిరాకీ తగ్గడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఇల్లు కూడా గడవలేని పరిస్థితి తలెత్తడంతో మనోవేదనకు గురై, సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆలయ భూమిని కాపాడండి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌: నగరంలోని హైదరాబాద్‌రోడ్డు కోతిరాంపూర్‌లో గల శ్రీబాలాంజనేయ ఆలయానికి సంబంధించిన భూమిని ఆక్రమిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ కార్పొరేటర్‌ కోడూరి రవీందర్‌గౌడ్‌, బొడ్డు ప్రభాకర్‌, పైడిపల్లి రాజులు సోమవారం అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందజేశారు. కోతిరాంపూర్‌లోని శ్రీబాలాంజనేయ స్వామి ఆలయానికి 1982లో అప్పటి కలెక్టర్‌ శర్మ 12 గుంటల స్థలం కేటాయించారని, అప్పటి నుంచి ఈ స్థలంలో ఇంటి నం.8–7–329 కలిగి ఉన్న దానిని చుట్టుపక్కల ఖాళీస్థలంలో ఆలయ పూజారి భార్య అమరావతికి సెల్ఫ్‌ అసైన్‌మెంట్‌ కింద ఒక తాత్కాలిక షెడ్డు నిర్మించారని తెలిపారు. ఇటీవల కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి ఆ స్థలంలో భవన నిర్మాణం చేపడుతున్నారని, ఈ నిర్మాణ పనులపై మున్సిపల్‌ కమిషనర్‌కు తెలిపినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు సుంకరి శంకర్‌, బాలయ్య, కూన రవీందర్‌, పరశురాములు గాలి రవియాదవ్‌, ధర్మరాజు, శ్రీనివాస్‌, కిషన్‌, సాయన్న, సత్యనారాయణ, నాగేందర్‌, జలపతి, మల్లేశం, తిరుపతి, కుమార్‌, వీరేశం, రాములు, మల్లేష్‌, మనోహర్‌ తదితరులు పాల్గొన్నారు.



బ్రాండన్ కింగ్ సెంచరీ: విండీస్ గెలుపు

యూఏఈ జట్టుతో షార్జాలో జరిగిన తొలి వన్డేలో వెస్టిండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. యూఏఈ నిర్దేశించిన 203 పరుగుల లక్ష్యాన్ని విండీస్ 35.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ బ్రాండన్ కింగ్ (112 బంతుల్లో 112; 12 ఫోర్లు, 4 సిక్స్‌) సెంచరీ చేశాడు. అంతకుముందు యూఏఈ 47.1 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. విండీస్ బౌలర్లలో కీమో పాల్ మూడు వికెట్లు తీయగా.. డ్రేక్స్, ఒడెన్ స్మిత్, యానిక్ కరియాలకు రెండు వికెట్లు చొప్పున లభించాయి.

మాపై ఎలాంటి ఒత్తిడీ లేదు: ద్రవిడ్

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌ను ఎలాగైనా గెలవాలనే ఒత్తిడి తమపై లేదని, ఒక వేళ ఓడినా ఇటీవల టెస్టుల్లో సాధించిన విజయాల విలువ తగ్గదని భారత జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ అభిప్రాయపడ్డాడు. గత రెండేళ్లుగా కష్టపడ్డారు కాబట్టి ముగింపుగా ఐసీసీ ట్రోఫీ గెలిస్తే సంతోషిస్తామని... అయితే ఆడిన ప్రతీ చోటా తమదైన ముద్ర వేయడం టీమిండియా సాధించిన ఘనతేనని ద్రవిడ్ గుర్తు చేశాడు.



సింధు సత్తాకు పరీక్ష!

నేటి నుంచి సింగపూర్ ఓపెన్ టోర్నీ

సింగపూర్: సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవాలంటే భారత స్టార్ షట్లర్ పీవీ సింధు విశేషంగా రాణించాల్సి ఉంటుంది. నేడు మొదలయ్యే ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ సింధుకు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ అకానె యామగుచి (జపాన్)తో సింధు తొలి రౌండ్‌లో ఆడనుంది. ముఖాముఖి రికార్డులో సింధు 14-9తో ఆధిక్యంలో ఉంది. భారత్‌కే చెందిన మరో స్టార్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ రచనోక్ (థాయ్‌లాండ్)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో వాంగ్‌చరోన్ (థాయ్‌లాండ్)తో కిడాంబి శ్రీకాంత్... కొడాయ్ నరోకా (జపాన్)తో ప్రణయ్... సునెయామ (జపాన్)తో ప్రియాన్షు రజావత్... చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్ ఆడతారు.



భారత్‌కు రెండో విజయం



కాకామిగహారా (జపాన్): మహిళల జూనియర్ ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మలేసియా జట్టుతో సోమవారం జరిగిన పూల్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (10వ ని.లో), దీపిక (26వ ని.లో) ఒక్కో గోల్ సాధించగా... మలేసియా జట్టుకు దియాన్ నజేరి (6వ ని.లో) ఏకైక గోల్ అందించింది. రెండు మ్యాచ్‌లు ముగిశాక భారత్, కొరియా ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. నేడు జరిగే మ్యాచ్‌లో కొరియాతో భారత్ ఆడుతుంది.

నిరసనలకు విరామం!

- ఉద్యోగాల్లో చేరిన బజరంగ్, సాక్షి
- పోరాటం కొనసాగిస్తామన్న రెజ్లర్లు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో రెజ్లర్లు కొనసాగిస్తున్న నిరసనల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిరసనను ముందుండి నడిపించిన ఒలింపిక్ పతక విజేతలు బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ రైల్వే శాఖలో తమ ఉద్యోగ బాధ్యతల్లో చేరారు. దాంతో పోరాటం నుంచి వీరు తప్పుకున్నట్లేనని, ఫలితం లేకుండానే నిరసన ముగిసినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు బ్రిజ్‌భూషణ్‌పై 'పోక్సో' కేసుకు కారణమైన మైనర్ రెజ్లర్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకున్నట్లుగా కూడా ప్రచారం జరిగింది. అయితే బజరంగ్, సాక్షి వీటిని ఖండించడంతో పాటు తమ పోరాటాన్ని ముగించలేదని స్పష్టం చేశారు. శనివారం అర్ధరాత్రి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అనంతరమే ఇవన్నీ జరగడం విశేషం.

ఉద్యోగం కూడా చేయాలి కదా!

శనివారం రాత్రి అమిత్ షాతో రెజ్లర్లు భేటీ అయ్యారు. కేంద్ర హోం మంత్రి ఎలాంటి హామీ ఇచ్చారనే దానిపై స్పష్టత లేకపోయినా, అంతా చట్ట ప్రకారమే వ్యవహరిస్తాం అని మాత్రమే ఆయన చెప్పినట్లు సమాచారం. అయితే రైల్వేలో ఓఎస్‌డీలుగా పని చేస్తున్న బజరంగ్, సాక్షి సోమవారం తమ ఉద్యోగాల్లో చేరిపోవడంతో ఆ సమావేశంలో ఏదో జరిగిందని వినిపించింది. కానీ సాక్షి వీటిని కొట్టిపారేసింది. అది సాధారణ భేటీ మాత్రమేనని, అందులో ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆమె వెల్లడించింది. ఉద్యోగంలో చేరడంపై సాక్షి స్పష్టతనిచ్చింది. 'నేను ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ హోదాలో పని చేస్తున్నాను. నాకూ కొన్ని బాధ్యతలున్నాయి. నిరసనల్లో పాల్గొనని సమయంలో అధికారిక బాధ్యతలు నిర్వహించాలి కదా' అని 2016 రియో ఒలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకం సాధించిన సాక్షి మలిక్ చెప్పింది.



రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియా, సాక్షి మలిక్ (ఫైల్)

ఉద్యమం ఆగదు!

ఉద్యోగంలో చేరినంత మాత్రాన తాము నిరసన నుంచి తప్పుకున్నట్లు కాదని, వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లి పోరాడతామని రెజ్లర్లు స్పష్టం చేశారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేసి చర్యలు తీసుకునే వరకు ఇది కొనసాగుతుందని వారు చెప్పారు. తమ ఉద్యమాన్ని బలహీన పర్చేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ పని చేస్తున్నారని వినేశ్ ఫొగాట్ వ్యాఖ్యానించింది. 'మా గురించి పుకార్లు వ్యాప్తి చేస్తున్న వారికి అసలు మహిళా రెజ్లర్ల బాధలు ఏమిటో తెలుసా? బలహీనులే గుండాల ముందు తలవంచుతారు. కానీ మేం కాదు' అని వినేశ్ ట్వీట్ చేసింది. మైనర్ రెజ్లర్ తమ ఫిర్యాదులు వెనక్కి తీసుకుందనే వార్తలు కూడా అబద్ధమని వారు స్పష్టం చేశారు. బజరంగ్, సాక్షి, వినేశ్ సంయుక్తంగా ఒకే తరహా ట్వీట్‌తో తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. 'ఆందోళనలో వెనక్కి తగ్గామంటూ వస్తున్న వార్తలు పుకార్లు మాత్రమే. మాకు నష్టం కలిగేంచేందుకే దీనిని ప్రచారం చేస్తున్నారు. మేం ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. మా పతకాలకు రూ.15 విలువ కట్టినవారు ఇప్పుడు మా ఉద్యోగాల వెంట పడ్డారు. మేం జీవితాలను పణంగా పెట్టాం. దాని ముందు ఉద్యోగం చాలా చిన్న విషయం. ఉద్యోగం పేరుతో భయపెట్టించకండి. మాకు న్యాయం దక్కడంలో ఉద్యోగం అడ్డుగా ఉందని భావిస్తే వదిలేసేందుకు పది సెకన్ల సమయం పట్టదు' అని వారు ట్వీట్ చేశారు.

అంతా కంటితుడుపే!

రెజ్లర్లు అమిత్‌షాను కలిసిన తర్వాతే ఇలాంటి పరిణామాలు చోటు చేసుకోవడంలో ఆశ్చర్యం లేదని సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ అన్నారు. 'సమస్య పరిష్కారం కోసమంటూ రెజ్లర్లతో అమిత్ షా కలిశారు. నాకు తెలిసి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయరు. ఏదో కంటితుడుపుగా చార్జ్‌షీట్ దాఖలు చేస్తారు. అతనికి బెయిల్ లభిస్తుంది. ఆపై ఏం మాట్లాడినా ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది అంటూ తప్పించుకుంటారు' అని సిబాల్ ట్వీట్ చేశారు. అయితే రెజ్లర్లు పలు వివరణలు ఇచ్చినా తాజా పరిస్థితిని బట్టి చూస్తే వారి నిరసనల తీవ్రత తగ్గిందని, బయటి వ్యక్తుల నుంచి ఏ రకమైన మద్దతూ లభించక ఆందోళన బలహీనపడిందనేది మాత్రం స్పష్టం.

55 ఏళ్ల తర్వాత...

- గ్రాండ్‌స్లామ్ టోర్నీ క్వార్టర్ ఫైనల్లో బ్రెజిల్ క్రీడాకారిణి
- ఫ్రెంచ్ ఓపెన్‌లో బీట్రిజ్ హదాద్ ఘనత

పారిస్: బ్రెజిల్ సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 55 ఏళ్ల తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో ఆ దేశ క్రీడాకారిణికి క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో బ్రెజిల్‌కు చెందిన బీట్రిజ్ హదాద్ మాయ క్వార్టర్ ఫైనల్ చేరింది. టెన్నిస్‌లో ఓపెన్ శకం (1968లో) మొదలయ్యాక దివంగత మరియా బ్యూనో చివరిసారి బ్రెజిల్ తరఫున గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో క్వార్టర్ ఫైనల్ చేరింది. 1968లో మరియా బ్యూనో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీలలో క్వార్టర్ ఫైనల్‌కు... యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరింది. మరియా బ్యూనో ఐదు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గినా ఆ విజయాలన్నీ ఓపెన్ శకంకంటే ముందు వచ్చాయి.

సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ బీట్రిజ్ 3 గంటల 51 నిమిషాల్లో 6-7 (3/7), 6-3, 7-5తో సారా సారిబెస్ టోర్మో (స్పెయిన్)పై విజయం సాధించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో క్వార్టర్ ఫైనల్లో ఏడో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యునీషియా) 6-3, 6-1తో బెర్నార్డా పెరా (అమెరికా)పై, అమెరికా టీనేజర్ కోకో గాఫ్ 7-5, 6-2తో షిమెద్లోవా (స్లొవేకియా)పై, రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 7-6 (7/5), 6-4తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరారు. పురుషుల సింగిల్స్ విభాగంలో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఐదో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) క్వార్టర్ ఫైనల్లోకి చేరారు.



బీట్రిజ్

ధనుశ్ శ్రీకాంత్ 'పసిడి' గురి

జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీ

సుల్ (జర్మనీ): జూనియర్ ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ పసిడి పతకంతో మెరిశాడు. సోమవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ధనుశ్ శ్రీకాంత్ విజేతగా నిలిచాడు. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో హర్‌మెహర్ సింగ్-సంజన సూద్ జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది. కాంస్య పతక మ్యాచ్‌లో హర్‌మెహర్-సంజన ద్వయం 'షూట్ ఆఫ్'లో డేవిడ్ జాన్సన్-ఫెలిసియా (స్వీడన్) జోడీపై గెలిచింది. ఎనిమిది మంది పాల్గొన్న రైఫిల్ ఫైనల్లో ధనుశ్ శ్రీకాంత్ 249.4 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. బధిరుడైన శ్రీకాంత్ కొన్నేళ్లుగా అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. 2021 జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో శ్రీకాంత్ టీమ్ విభాగంలో స్వర్ణం సాధించాడు. 2019 జూనియర్ ఆసియా చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు.



హంపి గేమ్ 'డ్రా'... హారిక పరాజయం

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ మహిళల అంతర్జాతీయ చెస్ టోర్నీలో 2020 చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి తొలి 'డ్రా' నమోదు చేసింది. ఐరీనా క్రుష్ (అమెరికా)తో జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను హంపి 43 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికకు తొలి ఓటమి ఎదురైంది. ప్రపంచ మాజీ చాంపియన్ అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో జరిగిన రెండో గేమ్‌లో హారిక 54 ఎత్తుల్లో ఓడిపోయింది. మూడో గేమ్‌లో హంపితో హారిక తలపడుతుంది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ప్రస్తుతం కొస్టెనిక్ రెండు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.



సిద్ధార్థ్‌కు స్వర్ణ పతకం

యెచోన్ (దక్షిణ కొరియా): ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మూడో స్వర్ణం చేరింది. సోమవారం జరిగిన పురుషుల షాట్‌పుట్ ఈవెంట్‌లో 17 ఏళ్ల సిద్ధార్థ్ చౌదరీ పసిడి పతకం గెలిచాడు. సిద్ధార్థ్ ఇనుప గుండును 19.52 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. జావెలిన్ త్రోలో శివమ్ (72.34 మీటర్లు)... 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో షారుఖ్ (8ని:51.74 సెకన్లు).. లాంగ్‌జంపర్ సుష్మిత (5.96 మీటర్లు) రజత పతకాలు నెగ్గారు.



సినిమా




● రజనీకాంత్, ఐశ్వర్య

నేను మీరే నాన్నా..!

- ఐశ్వర్యా రజనీకాంత్

''నేను మిమ్మల్ని చూస్తూ పెరిగాను. కానీ మీతో షూటింగ్ చేసే రోజు వస్తుందని ఊహించలేదు. మీరంటే నాకు ఆరాధన.. స్ఫూర్తి... ఒక్కోసారి నేను ప్రపంచాన్ని మీ ద్వారా చూస్తాను. కానీ ఎక్కువసార్లు మీతో పాటు ప్రపంచాన్ని చూస్తాను. ఈ క్రమంలో నేను గ్రహించింది ఏంటంటే.. 'నేను మీరే' అని. అప్పా (నాన్న) రోజు రోజుకీ నాకు మీ మీద ఉన్న ప్రేమ రెట్టింపు అవుతోంది'' అంటూ 'సూపర్ స్టార్‌తో షూటింగ్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియా ద్వారా ఓ ఎమోషనల్ పోస్ట్‌ని షేర్ చేశారు రజనీకాంత్ పెద్ద కుమార్తె ఐశ్వర్యా రజనీకాంత్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా ఐశ్వర్యా రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్' చిత్రంలో మొయిద్దీన్ భాయ్‌గా రజనీకాంత్ కీ రోల్ చేస్తున్నారు. సూపర్ స్టార్‌ని డైరెక్ట్ చేయడం ఏ డైరెక్టర్‌కి అయినా ఎగ్జయిటింగ్‌గా ఉంటుంది. ఇక స్వయానా కూతురు అయితే.. ఆ ఫీలింగ్ రెండింతలు ఉంటుంది. ఆ భావాన్నే ఐశ్వర్య సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఇక క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే 'లాల్ సలామ్'లో స్టార్ క్రికెటర్ కపిల్ దేవ్ కీలక పాత్ర చేస్తున్నారు. ఈ చిత్రంలో రజనీ పాత్ర ముంబై నేపథ్యంలో ఉంటుంది. రజనీ-కపిల్ పాల్గొనగా ఇటీవల ముంబైలో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది.



● రానా

నటన.. నిర్మాణం.. బిజీ

టాలీవుడ్ హీరో రానా, బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్‌ల కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కేందుకు రంగం సిద్ధమౌతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమాలో రానా, వరుణ్ ధావన్ హీరోలుగా నటించడం లేదట. వరుణ్ ధావన్ హీరోగా రానా ఈ సినిమాను నిర్మించనున్నారట. ఈ చిత్రం నిర్మాణంలో రానాతో పాటు సునీల్ నారంగ్ కూడా భాగస్వామ్యులు అవుతారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాకు ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. అలాగే మలయాళ హీరో దుల్కర్ సల్మాన్‌తో రానా ఓ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. ఇలా గతంలోనూ రానా పలు సినిమాలకు నిర్మాతగా ఉన్న సంగతి తెలిసిందే. ఒకవైపు నటుడిగా మరోవైపు నిర్మాతగా బిజీగా ఉంటున్నారు రానా. ప్రస్తుతం హీరోగా రానా చేతిలో ఉన్న చిత్రాల్లో 'రాక్షసరాజు' (వర్కింగ్ టైటిల్) ఒకటి. 'నేనే రాజు నేను మంత్రి' చిత్రం తర్వాత దర్శకుడు తేజ-రానా కాంబినేషన్‌లో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.

నేను తెలుగు బిడ్డనే

- సిద్ధార్థ్

''తెలుగు కవిత్వం చదివి, చూసి అది నా లోపలకి వెళ్లిపోయింది. సో.. నేను చెప్పినా... చెప్పకపోయినా.. తెలుగు బిడ్డనే'' అని సిద్ధార్థ్ అన్నారు. సిద్ధార్థ్ హీరోగా కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'టక్కర్'. ఈ చిత్రంలో దివ్యాంశా కౌశిక్ హీరోయిన్‌గా నటించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సిద్ధార్థ్ మాట్లాడుతూ– ''టక్కర్' ఒక యాక్షన్ ఫిల్మ్. న్యూ ఏజ్ లవ్‌స్టోరీ కూడా ఉంటుంది. కొంతకాలం తర్వాత నేను చేసిన కమర్షియల్ సినిమా ఇది'' అన్నారు. ''మా గురువుగారు శంకర్ సినిమాలకు తెలుగు ప్రేక్షకుల ఆదరణ, మీ హీరో సిద్ధార్థ్, దివ్యాంశ... ఈ మూడు కారణాల వల్లే ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా ఓ ట్రెండ్ సెట్టర్ అవుతుంది'' అన్నారు కార్తీక్ జి. క్రిష్. ''టక్కర్' విజయం సాధిస్తుంది'' అన్నారు నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్. ''విశ్వప్రసాద్, వివేక్‌గార్లు నాకు మంచి మిత్రులు. 'టక్కర్' చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అన్నారు నిర్మాత డి. సురేష్‌బాబు. ఈ వేడుకలో దర్శకులు 'బొమ్మరిల్లు' భాస్కర్, తరుణ్ భాస్కర్, వెంకటేశ్ మహా తదితరులు పాల్గొన్నారు.



● కార్తీక్, దివ్యాంశా, సిద్ధార్థ్, సురేష్‌బాబు, టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్

టిల్లు వచ్చేది అప్పుడే..

'డీజే టిల్లు పేరు.. వీని స్టయిలే వేరు..' అంటే యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌ని కూడా ఆకట్టుకున్నాడు టిల్లు. సిద్ధు జొన్నలగడ్డ టైటిల్ రోల్‌లో మీడియమ్ బడ్జెట్‌తో రూపొందిన 'డీజే టిల్లు' మంచి వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా సిద్ధు జొన్నలగడ్డతోనే నాగవంశీ, సాయి సౌజన్య 'టిల్లు స్క్వేర్' చిత్రం నిర్మిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఈసారి రెట్టింపు వినోదం గ్యారంటీ అంటూ.. సెప్టెంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు సోమవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. అలాగే సిద్ధు, అనుపమల రొమాంటిక్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిరియాల, శ్రీ చరణ్ పాకాల, కెమెరా: సాయి ప్రకాశ్ ఉమ్మడిసింగు, సమర్పణ: శ్రీకర స్టూడియోస్.



● సిద్ధు జొన్నలగడ్డ

ఇక నవ్వించే సినిమాలే చేస్తా!


- డైమండ్ రత్నబాబు

''ప్రతి రచయిత, దర్శకుడు వారి బలాలు ఏమిటో తెలుసుకోవడానికి కాస్త సమయం పడుతుంది. రచయితగా 'పిల్లా నువ్వులేని జీవితం' (కొన్ని కామెడీ సన్నివేశాలు), 'సీమశాస్త్రి', 'ఈడోరకం ఆడోరకం'లాంటి నవ్వించిన సినిమాలే నాకు ఇండస్ట్రీలో పేరు తెచ్చాయి. దర్శకుడిగా నేను చేసిన రెండు సినిమాలు (బుర్రకథ, సన్నాఫ్ ఇండియా) ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. దీంతో నా బలం కామెడీ అని నమ్మి 'అన్‌స్టాపబుల్' మూవీ చేశాను. ఇకపై ప్రతి ఏడాది నా నుంచి ఓ నవ్వించే సినిమా వస్తుంది. ఒకవేళ ప్రయోగాలు చేయాలనుకుంటే ఓటీటీలో చేస్తా'' అన్నారు డైమండ్ రత్నబాబు. వీజే సన్నీ, సప్తగిరి హీరోలుగా, నక్షత్ర, అక్సా ఖాన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్‌స్టాపబుల్'. డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రజిత్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో దర్శకుడు డైమండ్ రత్నబాబు మాట్లాడుతూ– ''ఈ సినిమాలో కల్యాణ్ పాత్రలో సన్నీ, జిలానీ రాందాస్‌గా సప్తగిరి నటించారు. చాలామంది హాస్యనటులు నటించారు. ఇక 'అన్‌స్టాపబుల్' సినిమా కాన్సెప్ట్‌ని చెప్పలేను. కానీ ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. ప్రీ క్లైమాక్స్‌లో అన్ని పాత్రలు ఓ పాయింట్‌కు కలుస్తాయి. ఈ అంశాలను థియేటర్స్‌లోనే చూడాలి. సినిమాలపై ఉన్న ప్యాషన్‌తో రజిత్‌రావు రాజీ పడకుండా నిర్మించారు. నిజం చెప్పాలంటే.. యాక్షన్, ఫ్యామిలీ తరహా సినిమాలను తీయడం కంటే కామెడీ సినిమాలు తీయడం కత్తిమీద సాము వంటిది. కానీ ఈ విషయంలో జంధ్యాల, ఈవీవీ, రేలంగి, ఎస్వీ కృష్ణారెడ్డిగార్లు సక్సెస్ అయ్యారు. నేను రచయితగా ఎలా అయితే నవ్వించానో దర్శకుడిగానూ నవ్వించే సినిమాలే చేస్తాను'' అని అన్నారు.



ఏ రచయిత అయినా కెప్టెన్ ఆఫ్ ది షిప్ (డైరెక్టర్) కావాలనుకుంటాడు. నేను అలానే రచయిత నుంచి దర్శకుడిని అయ్యాను. నేను రచయితగా ఉన్నప్పుడు కొంతమంది దర్శకులతో అభిప్రాయబేధాలు వచ్చి ఉండొచ్చు. మన కుటుంబాల్లో ఉన్నట్లు ఇండస్ట్రీలో కూడా అలాంటివి సహజమే. అయినా ఇప్పుడు ప్రతి రచయితలోనూ ఓ దర్శకుడు ఉన్నాడు. తమిళ పరిశ్రమలో ఎవరైతే కథ రాస్తారో వాళ్లకే దర్శకత్వం చేసే చాన్స్ కూడా ఉంటుంది. తెలుగులో కూడా అది మొదలైనట్లుంది.

మళ్లీ ఆవారాగా...?



● కార్తీ

మళ్లీ ఆవారాగా కనిపించనున్నారట కార్తీ. లింగుసామి దర్శకత్వంలో కార్తీ, తమన్నా హీరో హీరోయిన్లుగా వచ్చిన తమిళ చిత్రం 'పయ్యా' (తెలుగులో 'ఆవారా'). 2010లో విడుదలైన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి చెప్పుకోదగ్గ ఆదరణ లభించింది. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలని కొంత కాలంగా లింగుసామి ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రెండో భాగంలో ఆర్య హీరోగా చేస్తారనే వార్తలు వచ్చాయి. తాజాగా మళ్లీ కార్తీ పేరే తెరపైకి వచ్చింది. కార్తీ నటించే చాన్స్ ఎక్కువగా ఉందని కోలీవుడ్ అంటోంది.

లైఫ్.. డెత్.. ఫేట్.. ఇదే సర్కిల్



● సాయి రోనక్, నీలకంఠ

సాయి రోనక్ హీరోగా, బాబా భాస్కర్, అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్.వి. శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో 'సర్కిల్' టీజర్‌ను విడుదల చేశారు. సాయి రోనక్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో నేను ఫొటోగ్రాఫర్ పాత్ర చేశాను'' అన్నారు. ''సర్కిల్ ఆఫ్ లైఫ్, సర్కిల్ ఆఫ్ డెత్, సర్కిల్ ఆఫ్ ఫేట్ .. అనే ఈ మూడు అంశాల కలయికయే ఈ చిత్రం. తన జీవితంలో జరిగిన కొన్ని ఘటనల కారణంగా తనకు ఎవరు మిత్రుడో, ఎవరు శత్రువో తెలుసుకోలేని సందిగ్ధంలో పడే హీరో ఆ పరిస్థితుల నుంచి ఎలా బయటపడతాడన్నదే ఈ సినిమా కథ'' అన్నారు నీలకంఠ. ''ఈ సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. మా తర్వాతి సినిమాను కూడా నీలకంఠగారితోనే చేయాలనుకుంటున్నాం'' అన్నారు నిర్మాత శరత్ చంద్ర.


ఆరు రోజుల్లో ఆగస్ట్ 6 పూర్తి



● దుర్గాప్రియ

ఆర్.కె. గాంధీ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఆగస్ట్ 6 రాత్రి'. బి. సుధాకర్, కంభం దినేష్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ పూర్తయింది. అజయ్ రాహుల్, దుర్గాప్రియ, పవన్ వర్మ, సుప్రితా రాజ్, నాగమహేశ్, ధీరజ అప్పాజి తదితరులు నటిస్తున్నారు. ఆర్.కె. గాంధీ మాట్లాడుతూ– ''6 రోజుల్లో 'ఆగస్ట్ 6 రాత్రి'ని పూర్తి చేసి, రికార్డు సాధించాలన్నదే మా ధ్యేయం. ఐదు రోజుల షూటింగ్ పూర్తయింది. ఇంకో రోజులో సినిమా మొత్తం పూర్తి చేస్తాం. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో కూడిన లవ్‌స్టోరీగా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు.

మనాలీలో ప్రేమ



● రఘురామ్, శృతి శెట్టి

రఘురామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఓహ్'. శృతి శెట్టి, నైనా పాఠక్ హీరోయిన్లు. ఏకరీ సత్యనారాయణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ ఈ నెల 10 నుంచి వరంగల్‌లో జరగనుంది. ఈ షెడ్యూల్‌లో రెండు ఫైట్స్‌ను చిత్రీకరిస్తారు. ''కులుమనాలి బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ప్యూర్ లవ్‌స్టోరీ ఇది. సెప్టెంబరు 29న సినిమాని రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు సత్యనారాయణ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
240	60
62,787	18,594

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,283	▲	42
డోజోన్స్	33,630	▼	131
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▼	7
డాక్స్	15,937	▼	87
షాంఘై	3,232	▲	2
నికాయ్	32,217	▲	693

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,601
బంగారం (99.5 స్వచ్ఛత)	59,362
వెండి (కిలో)	71,462

18,600 పాయింట్ల చేరువలో నిఫ్టీ

- సూచీలకు అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు
- రెండో రోజూ కొనసాగిన లాభాలు
- ఆటో, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎంఅండ్ఎం షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారమూ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు సైతం కలిసొచ్చాయి. దేశీయ మే సేవారంగ కార్యకలాపాలు వరుసగా రెండో నెలా 13 ఏళ్ల గరిష్ట స్థాయి 62 పాయింట్లుగా నమోదవడం సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది. ఫలితంగా సెన్సెక్స్ 240 పాయింట్లు పెరిగి 62,787 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 60 పాయింట్లు దూసుకెళ్లి 18,594 వద్ద నిలిచింది. ఆటో, ప్రైవేట్ బ్యాంక్స్, కన్జూమర్ డ్యూరబుల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ, ప్రభుత్వరంగ బ్యాంక్స్ షేర్లలో అమ్మకాలు నెలకొన్నాయి. ఉదయం సెన్సెక్స్ 212 పాయింట్ల పెరిగి 62,759 వద్ద, నిఫ్టీ 78 పాయింట్లు బలపడి 18,612 వద్ద మొదలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 62,752 వద్ద కనిష్టాన్ని, 62,943 గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 18,583 – 18,640 పరిధిలో ట్రేడైంది. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ సమావేశ ప్రారంభం (మంగళవారం) నేపథ్యంలో చివర్లో కొంత లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. చిన్న తరహా షేర్లకు అధిక డిమాండ్ నెలకొనడంతో బీఎస్ స్మాల్, మిడ్ క్యాప్ ఇండెక్సులు అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.701 కోట్ల షేర్లను అమ్మేయగా, దేశీయ ఇన్వెస్టర్లు రూ.1,196 కోట్ల షేర్లు కొన్నారు. అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలు పెరగడం, అమెరికా డాలర్ బలపడటంతో రూపాయి విలువ 24 పైసలు క్షీణించి 82.63 స్థాయి వద్ద స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.


మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆర్‌బీఐ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చనే అంచనాలతో ఆటో షేర్లు పరుగులు తీశాయి. ఎంఅండ్ఎం, అశోక్‌లేలాండ్, టాటా మోటార్స్ భారత్ ఫోర్జ్, మారుతీ 4–1% లాభపడ్డాయి. అలాగే ఫైనాన్స్ షేర్లూ లాభపడ్డాయి.
- ఒపెక్ దేశాలు ఈ జూలై (వచ్చే నెల) నుంచి క్రూడాయిల్ ఉత్పత్తిలో కోత విధించేందుకు సిద్ధమవడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగాయి. దీంతో ఆయిల్ ఇండియా, ఓఎన్‌జీసీ, ఎంఆర్‌పీఎల్, చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 3–1 శాతం రాణించాయి.

బైబ్యాక్‌కు విప్రో రెడీ

రూ. 12,000 కోట్లు వెచ్చించేందుకు సై

న్యూఢిల్లీ: ఐటీ సేవల దిగ్గజం విప్రో లిమిటెడ్ సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్) చేపట్టనుంది. ఇందుకు వాటాదారులు అనుమతించినట్లు కంపెనీ తాజాగా పేర్కొంది. దీంతో ఒక్కో షేరుకి రూ. 445 ధర మించకుండా 26.96 కోట్ల షేర్లను బైబ్యాక్ చేయనున్నట్లు తెలియజేసింది. ఇందుకు రూ. 12,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఈ అంశాలపై కంపెనీ స్క్రూటినైజర్ నివేదికను విడుదల చేసింది. దీనిప్రకారం బైబ్యాక్‌కు అనుకూలంగా 99.9% వోటింగ్ నమోదైంది. ఈ వోటింగ్‌ను మే 3–జూన్ 1 మధ్య చేపట్టినట్లు నివేదిక వెల్లడించింది. కంపెనీ ఈక్విటీలో 4.91% వాటాకు సమానమైన 26.96 కోట్లకుపైగా షేర్లను బైబ్యాక్ చేసేందుకు విప్రో బోర్డు గతంలోనే ఆమోదించింది. బైబ్యాక్‌లో కంపెనీ ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్ సైతం పాలుపంచుకోనున్నాయి.



ఈ వార్తల నేపథ్యంలో విప్రో షేరు ఎన్ఎస్ఈలో యథాతథంగా రూ. 405 వద్ద ముగిసింది.

మేలో సేవలు ఓకే!

61.2కు పీఎంఐ బిజినెస్‌యాక్టివిటీ ఇండెక్స్

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తిలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న సేవల రంగం ఏప్రిల్‌తో పోల్చితే... మే నెల్లో కొంత నెమ్మదించింది.ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 61.2కు తగ్గింది. ఏప్రిల్‌లో ఈ సూచీ 62 వద్ద ఉంది. నిజానికి ఏప్రిల్ నెల సూచీ 13 సంవత్సరాల గరిష్ట స్థాయి. మే స్థాయి సూచీ కూడా 13 సంవత్సరాల్లో రెండవ అతిపెద్ద సంఖ్య కావడం గమనార్హం. దేశంలో డిమాండ్ పరిస్థితులు, కొత్త ఆర్డర్ల సానుకూల ధోరణులు కొనసాగుతున్నట్లు నెలవారీ గణాంకాలు వెల్లడించాయి. నిజానికి సూచీ 50లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణించడం జరుగుతుంది. ఆపైన ఉంటే వృద్ధి ధోరణిగానే భావిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం వరుసగా 22 నెలల నుంచి వృద్ధి బాటనే ఉంది. మే నెల్లో సేవల రంగంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగ్గానే ఉన్నట్లు ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్‌లో ఎకనమిక్స్ విభాగ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డీ లిమా పేర్కొన్నారు.



సేవలు–తయారీ కలిపితే.. యథాతథం

ఇదిలావుండగా, సేవలు–తయారీకి సంబంధించి ఉమ్మడి ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ మేలో ఏప్రిల్ స్థాయిలోనే యథాతథంగా 61.6గా ఉంది. మేలో ఒక్క 'తయారీ' రంగం చూస్తే పటిష్ట ఫలితం నమోదయ్యింది. తయారీ సూచీ 31 నెలల గరిష్ట స్థాయిలో 58.7కు చేరినట్లు ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డీ లిమా పేర్కొన్నారు. సరఫరాల చైన్ పరిస్థితుల్లో కూడా పురోగతి కనిపించినట్లు తెలిపారు. దాదాపు 400 కంపెనీల ప్యానల్‌కు పంపిన ప్రశ్నలు, వాటి సమాధానాల ప్రాతిపదికపై ఎస్అండ్‌పీ గ్లోబల్ పీఎంఐ కదలికలు ఉంటాయి. 2005 డిసెంబర్‌లో సమాచార సేకరణ ప్రారంభమైంది. జూన్ 8వ తేదీన ఆర్‌బీఐ పాలసీ సమావేశ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో తాజా సేవలు, తయారీ మే నెల ఫలితాలు వెలువడ్డాయి.

జీఆర్‌టీ జ్యువెలర్స్ వజ్రాల పండుగ

హైదరాబాద్: జీఆర్‌టీ జువెలర్స్ 'డైమండ్ ఫెస్టివల్' పేరుతో గొప్ప ఆఫర్‌ను ప్రకటించింది. ప్రత్యేకంగా చేతితో తీర్చిదిద్దిన అద్భుతమైన వజ్రాలు, అన్‌కట్ డైమండ్స్‌పై 25 శాతం వరకు తగ్గింపు అందిస్తుంది. ప్లాటినం ఆభరణాలపై కూడా ఆఫర్లు ఉన్నాయి. 'కస్టమర్లందరికీ వజ్రాల కలను నిజం చేసుకునే అవకాశం కల్పించడమే ఈ డైమండ్ ఫెస్టివల్ ప్రధాన ఉద్దేశం. కావున వారంతా ఈ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము' అని జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
5-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

ఈ-టూ వీలర్ల జోరుకు బ్రేకులు!

- ధరలు పెంచుతున్న కంపెనీలు
- ఫేమ్–2 సబ్సిడీ తగ్గడమే కారణం
- అమ్మకాలు క్షీణిస్తాయన్న పరిశ్రమ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు మరింత ప్రియం అయ్యాయి. ఇప్పటికే ప్రధాన కంపెనీలు వివిధ మోడళ్ల ధరలను పెంచాయి. ఇతర కంపెనీలు వీటిని అనుసరిస్తున్నాయి. ఫేమ్–2 పథకం కింద ఇచ్చే సబ్సిడీకి భారీ పరిశ్రమల శాఖ కోత విధించడమే మోడళ్ల ఖరీదవడానికి కారణం. భారత్‌లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల వినియోగం పెరిగేందుకు 2015లో కేంద్రం తీసుకొచ్చిన ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ (హైబ్రిడ్) ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఇన్ ఇండియా (ఫేమ్) పథకం దేశీ ఈవీ రంగానికి బూస్ట్ ఇచ్చింది అనడంలో సందేహం లేదు. అయితే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల సబ్సిడీని అకస్మాత్తుగా తగ్గించడం వల్ల అమ్మకాల్లో భారీ క్షీణతకు దారితీయవచ్చని సొసైటీ ఆఫ్ మాన్యుఫాక్చరర్స్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఎస్ఎంఈవీ) హెచ్చరించింది.

సబ్సిడీ తగ్గుదల ఇలా..

2023 జూన్ 1 లేదా ఆ తర్వాత రిజిస్టర్ అయ్యే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలపై ఫేమ్–2 పథకం కింద సబ్సిడీని తగ్గిస్తూ కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. దీని ప్రకారం కిలోవాట్ అవర్‌కు గతంలో ఇచ్చిన రూ.15,000 సబ్సిడీ కాస్తా ఇక నుంచి రూ.10,000 ఉంటుంది. ప్రోత్సాహకాలపై పరిమితి ఎక్స్-ఫ్యాక్టరీ ధరలో గతంలో ఉన్న 40 శాతం నుండి 15 శాతానికి చేర్చారు. రానున్న రోజుల్లో పరిశ్రమ వాస్తవిక వృద్ధి చూస్తుందని బజాజ్ అర్బనైట్ ప్రెసిడెంట్ ఎరిక్ వాస్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. కాగా, 2023 మే నెలలో దేశవ్యాప్తంగా అన్ని కంపెనీలవి కలిపి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు 1,04,755 యూనిట్లు రోడ్డెక్కాయి. ఏప్రిల్‌తో పోలిస్తే ఇది 57 శాతం అధికం. జూన్ 1 నుంచి కొత్త ధరలు అమలులోకి వస్తున్నాయన్న నేపథ్యం కూడా ఈ విక్రయాల జోరుకు కారణమైంది. ఓలా, టీవీఎస్, ఏథర్, బజాజ్, ఆంపియర్ టాప్–5లో నిలిచాయి.

వృద్ధి వేగానికి కళ్లెం..: ప్రభుత్వ చర్యతో ఈ-టూవీలర్ల వేగానికి కళ్లెం పడుతుందని ఎస్ఎంఈవీ తెలిపింది. పెట్రోల్‌తో నడిచే ద్విచక్ర వాహనాలు, ఈ-టూవీలర్ల మధ్య ధర వ్యత్యాసం అమాంతం పెరుగుతుందని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా వెల్లడించింది. ఈవీల జోరు పెరిగే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతివ్వాలని అవేరా ఏఐ మొబిలిటీ ఫౌండర్ రమణ తెలిపారు.

కస్టమర్లు సన్నద్ధంగా లేరు..

భారత్‌లో ధర సున్నితమైన అంశం అని ఎస్ఎంఈవీ ఎస్ఎంఈవీ డైరెక్టర్ జనరల్ సోహిందర్ గిల్ తెలిపారు. ద్విచక్ర వాహనం కోసం అధికంగా ఖర్చు పెట్టేందుకు కస్టమర్లు సన్నద్ధంగా లేరని స్పష్టం చేశారు. 'పెట్రోలుతో నడిచే ద్విచక్ర వాహనాల్లో అధిక భాగం మోడళ్లు రూ.1 లక్ష కంటే తక్కువ ధరలో లభిస్తున్నాయి. ఈవీ కోసం రూ.1.5 లక్షలకు పైగా ఖర్చు చేసే అవకాశాలు చాలా తక్కువ. మార్కెట్ వృద్ధి చెందే వరకు సబ్సిడీలను కొనసాగించాల్సిందే. భారత్‌లో మొత్తం ద్విచక్ర వాహనాల్లో ఈవీల వాటా ప్రస్తుతం 4.9 శాతమే. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ ప్రకారం ఇది 20 శాతానికి చేరుకోవడానికి నిరంతర రాయితీలు ఇవ్వాల్సిందే' అని వివరించారు.

వరుసలో బజాజ్ చేతక్..

బజాజ్ చేతక్ ధర రూ.22,000 పెరిగింది. దీంతో చేతక్ ప్రారంభ ధర ఎక్స్‌షోరూంలో రూ.1.44 లక్షలకు చేరింది. టీవీఎస్ మోటార్ కంపెనీ ఐక్యూబ్ ధర వేరియంట్‌ను బట్టి రూ.17–22 వేల మధ్య పెరిగింది. ఏథర్ 450ఎక్స్ ప్రో సుమారు రూ.8,000 అధికం అయింది. దీంతో ఈ మోడల్ ప్రారంభ ధర బెంగళూరు ఎక్స్‌షోరూంలో రూ.1,65,435లకు చేరింది. ఓలా ఎలక్ట్రిక్ టూ-వీలర్లు రూ.15,000 వరకు ప్రియం అయ్యాయి. ప్రస్తుతం ఎస్1–ప్రో రూ.1,39,999, ఎస్1 రూ.1,29,999, ఎస్1 ఎయిర్ ధర రూ.1,09,999 పలుకుతోంది. ఈ-స్కూటర్ మోడల్స్ ధరలను పెంచబోమని హీరో ఎలక్ట్రిక్ ఇప్పటికే తెలిపింది.

హైదరాబాద్‌లో ఎస్‌బీఐ 5వ ప్రత్యేక 'స్టార్టప్' బ్రాంచ్



హైదరాబాద్: స్టార్టప్స్ అవసరాలను తీర్చడానికి గాను బ్యాంకింగ్ దిగ్గజం- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) హైదరాబాద్‌లో మరో ప్రత్యేక శాఖను ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఈ తరహా బ్రాంచ్ 5వది కావడం గమనార్హం. మాదాపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ దినేష్ ఖారా కొత్త శాఖను ప్రారంభించారు. దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే అవకాశాలున్న స్టార్టప్స్‌కు అన్ని స్థాయిల్లో తగిన సహాయ సహకారాలు అందించాలన్నది ఎస్‌బీఐ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో (సీఎస్ఆర్) భాగంగా ఆయన ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.50 లక్షల చెక్‌ను అందజేశారు. అదేవిధంగా ఆదర్శ (హోమ్ ఫర్ చిల్డ్రన్)కు మారుతీ ఇకో వెహికల్‌ను కూడా ప్రదానం చేశారు.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌హెచ్‌ఏఐలో 50 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ).. డిప్యూటీ మేనేజర్(టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 50
» **కేటగిరీ వారీగా ఖాళీలు:** అన్ రిజర్వ్‌డ్–33,ఎస్సీ–04, ఎస్టీ–01, ఓబీసీ–11, ఈడబ్ల్యూఎస్–01.
» **అర్హత:** యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్ 2022(సివిల్ ఇంజనీరింగ్) ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.
» **వేతనం:** నెలకు రూ.39,100 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.06.2023
» **వెబ్‌సైట్:** www.nhai.gov.in

ఎంసీఈఎంఈ, సికింద్రాబాద్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

సికింద్రాబాద్‌లోని తిరుమలగిరిలో మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్(ఎంసీఈఎంఈ).. ఒప్పంద ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టులు:** అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.

అర్హత

» **అసోసియేట్ ప్రొఫెసర్:** బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం ఐదేళ్ల పని అనుభవం ఉండాలి. వేతనం నెలకు రూ.40,000 చెల్లిస్తారు.
» **అసిస్టెంట్ ప్రొఫెసర్:** బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వేతనం నెలకు రూ.31,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.06.2023.
» **రాతపరీక్ష తేది:** 09.06.2023.
» **ఇంటర్వ్యూ తేది:** 10.06.2023.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఎఫ్‌డీఈ, ఎంసీఈఎంఈ, తిరుమలగిరి, సికింద్రాబాద్ 15.
» **వెబ్‌సైట్:** https://www.mes.gov.in

జిప్‌మర్, పుదుచ్చేరిలో 122 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. రెగ్యులర్ ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 122
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, ఎంసీహెచ్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.07.2023 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2023
» **వెబ్‌సైట్:** www.jipmer.edu.in

జీఆర్ఐ, గాంధీగ్రామ్‌లో యూజీ, పీజీ ప్రవేశాలు


తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లాలోని గాంధీగ్రామ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్(డీమ్డ్ టు బి యూనివర్సిటీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు (నాలుగు సెమిస్టర్లు): ఎంఏ:** తమిళ్ అండ్ ఇండియన్ లిటరేచర్, హిందీ, ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేటివ్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్ స్టడీస్, గాంధీయన్ స్టడీస్ అండ్ పీస్ సైన్స్, ఎకనామిక్స్; **ఎంకాం:** కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్; **ఎంఎస్సీ:** మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్, హోమ్ సైన్స్ ఎక్స్‌టెన్షన్ అండ్ కమ్యూనికేషన్, టెక్స్‌టైల్స్ అండ్ ఫ్యాషన్ డిజైన్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, అప్లైడ్ జియాలజీ అండ్ జియోమాటిక్స్, జియోఇన్ఫర్మేటిక్స్.
» **ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు (పది సెమిస్టర్లు):** ఎంఏ డెవలప్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ సోషియాలజీ.
» **పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు (రెండు సెమిస్టర్లు):** స్పెషియల్ టెక్నాలజీస్, అప్లైడ్ జెరోంటాలజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్స్, ఎపిగ్రఫీ, యోగా, సస్టైనబుల్ సోషల్ డెవలప్‌మెంట్.
» **అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు (ఆరు సెమిస్టర్లు):** బీకాం, బీబీఏ, బీఏ, బీఎస్సీ.
» **ప్రొఫెషనల్ కోర్సులు:** బీఎస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, బీఎస్సీ బీఈడీ, బీఈడీ, ఎంఈడీ.
» **స్కిల్ బేస్డ్ కోర్సులు:** బీ.ఒకేషనల్/డిప్లొమా/సర్టిఫికేట్.
» **డిప్లొమా కోర్సులు:** టెక్స్‌టైల్ టెక్నాలజీ, అగ్రికల్చర్, యోగా.
» **సర్టిఫికేట్ కోర్సులు.**
» **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. హయ్యర్ సెకండరీ ఎగ్జామ్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.06.2023
» **వెబ్‌సైట్:** www.ruraluniv.ac.in

సత్వర ఉపాధికి కేరాఫ్ ఐటీఐ

» తెలంగాణ ఐటీఐల్లో ప్రవేశాలు ప్రారంభం
» పదో తరగతి అర్హతతో దరఖాస్తుకు అవకాశం
» ఎనిమిదో తరగతి అర్హతగా మరికొన్ని కోర్సులు
» కోర్సు పూర్తి చేసుకుంటే..సత్వర ఉపాధికి మార్గం
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 10, 2023



ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్..సంక్షిప్తంగా ఐటీఐలు! పదో తరగతి అర్హతతోనే.. పలు ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్ ట్రేడ్‌లలో శిక్షణనిచ్చి.. సత్వర ఉపాధి దిశగా మార్గం వేసే వేదికలు!! పదో తరగతి తర్వాత స్వల్ప వ్యవధిలోనే ఉపాధి కోరుకునే వారికి ఐటీఐలు చక్కటి మార్గం. తెలంగాణ రాష్ట్రంలో.. 2023-24 విద్యా సంవత్సరానికి ఐటీఐల్లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. పదో తరగతి/ఎనిమిదో తరగతిలో మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ ఐటీఐల ప్రవేశ విధానం.. అందుబాటులో ఉన్న ట్రేడ్‌లు, బోధన, శిక్షణ, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

- ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోని ఐటీఐల్లో 2023–24 సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలో మొత్తం 274 ఐటీఐలు ఉండగా.. వీటిలో 63 ప్రభుత్వ ఐటీఐలు, మిగతావి ప్రైవేట్ ఐటీఐలు. రాష్ట్రంలోని ఐటీఐల్లో 24 ఇంజనీరింగ్, 13 నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- నాన్–ఇంజనీరింగ్ విభాగంలో.. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, డ్రైవర్ కమ్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హాస్పిటల్ హౌస్ కీపింగ్, ఐటీ టెక్నీషియన్, రేడియాలజీ టెక్నీషియన్, సెక్రటేరియల్ ప్రాక్టీస్, స్వీయింగ్ టెక్నాలజీ, స్మార్ట్ ఫోన్ టెక్నీషియన్ కమ్ యాప్ టెస్టర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్‌లు ఉన్నాయి.

ఇంజనీరింగ్.. పలు ట్రేడ్‌లు

- ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్/మెకానిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండ్రీమ్యాన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్ (గ్రైండర్), మోటార్ వెహికల్ మెకానిక్, ఆటో బాడీ పెయింటింగ్ మెకానిక్, ఆటో బాడీ రిపేయిర్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, జనరల్ పెయింటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, షీట్‌మెటల్ వర్కర్, సోలార్ టెక్నీషియన్, టర్నర్, వెల్డర్, వైర్‌మ్యాన్ విభాగాల్లో ఇంజనీరింగ్ ట్రేడ్‌లు అందిస్తున్నాయి.

ఏడాది నుంచి రెండేళ్ల వ్యవధి

- అన్ని బ్రాంచ్‌లకు సంబంధించి ఏడాది, రెండేళ్ల వ్యవధిలో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇంజనీరింగ్ ట్రేడ్‌ల్లో ఎక్కువ శాతం కోర్సుల కాల వ్యవధి రెండేళ్లు. ఆయా ట్రేడ్‌లను అనుసరించి.. పదో తరగతి, ఎనిమిదో తరగతి అర్హతగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

మెరిట్ ఆధారంగా ప్రవేశం

- ట్రేడ్‌ను అనుసరించి కోర్సు ఆరు నెలల నుంచి రెండేళ్ల వ్యవధిలో ఉంటుంది.
- ఆయా ట్రేడుల్లో ప్రవేశానికి పదో తరగతి, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- సదరు ట్రేడ్‌లకు అర్హతగా పేర్కొన్న తరగతుల్లో పొందిన మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. అభ్యర్థులు నిర్దేశిత వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి.

ఆ తర్వాత.. ఆన్‌లైన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్‌లు, ఐటీఐలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాలి. వీటి ఆధారంగానే సీట్ల కేటాయింపు జరుగుతుంది.

డీఎస్‌టీ విధానం.. వినూత్న బోధన

ఐటీఐల్లో డ్యూయల్ సిస్టమ్ ఆఫ్ ట్రైనింగ్ విధానం ప్రకారం శిక్షణనిస్తారు. కంపెనీలతో భాగస్వామ్యం ద్వారా.. సదరు పరిశ్రమలకు అవసరమైన రీతిలో శిక్షణ అందిస్తున్నారు. ఆరు నెలల వ్యవధిలోని కోర్సులకు గరిష్టంగా మూడు నెలలు, ఏడాది వ్యవధి గల కోర్సులకు మూడు నుంచి ఆరు నెలలు, రెండేళ్ల వ్యవధి గల కోర్సులకు ఆరు నెలల నుంచి సంవత్సరంపాటు.. ఆయా సంస్థల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ అందించే విధానం అమలవుతోంది. ఫలితంగా..కోర్సు వ్యవధిలో దాదాపు మూడో వంతు లేదా సగం సమయాన్ని అభ్యర్థులు తమ ట్రేడ్‌కు సంబంధించి ఇండస్ట్రీలో పని చేస్తూ క్షేత్ర నైపుణ్యాలు సొంతం చేసుకోగలుగుతున్నారు. దీంతో కోర్సు పూర్తయ్యాక వారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. కోర్సు వ్యవధిలో 70 శాతం సమయాన్ని ప్రాక్టికల్ ట్రైనింగ్, మిగతా 30 శాతాన్ని థియరిటికల్ ట్రైనింగ్ ఇచ్చేలా కరిక్యులం అమలవుతోంది.

ఎన్‌సీవీటీ ట్రేడ్ టెస్ట్‌కు అర్హత

ఐటీఐల్లో ఆయా ట్రేడ్‌ల్లో కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు.. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ నిర్వహించే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు హాజరయ్యే అర్హత లభిస్తుంది. ఈ ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి కంపెనీల్లో అప్రెంటీస్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు సంబంధించి ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణతను కొన్ని సంస్థలు తప్పనిసరి చేస్తున్నాయి. దీంతో ఐటీఐ పూర్తి చేసుకున్నాక.. ట్రేడ్ టెస్ట్‌లోనూ విజయం సాధిస్తే ఉపాధి అవకాశాలు మరింత మెరుగవుతాయి.

ఎన్‌ఏపీఎస్‌కూ అర్హత

ఐటీఐ పూర్తి చేసుకుంటే.. జాతీయ స్థాయిలో అమలవుతున్న నేషనల్ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్‌కు కూడా అర్హత లభిస్తుంది. ఎన్ఏపీఎస్ పోర్టల్‌లో తమ పేరు, అర్హతలు, ట్రేడ్ వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా.. సంస్థల్లో అప్రెంటీస్ ట్రైనీగా అవకాశం అందుకోవచ్చు. అప్రెంటీస్ ట్రైనింగ్ సమయంలో.. రూ.9వేల వరకు స్టయిఫండ్ అందుతుంది. శాశ్వత ఉద్యోగుల సంఖ్య 30 మంది ఉన్న సంస్థలు అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునే విధంగా ఎన్ఏపీఎస్ విధానాలను రూపొందించారు. దీంతో ఐటీఐ పూర్తి చేసుకున్న వారికి అప్రెంటీస్ అవకాశాలు లభిస్తున్నాయి.

ఉద్యోగ, ఉపాధిలో ముందంజ

- ఐటీఐ పూర్తి చేసుకున్న వారు ఉద్యోగ సాధనలో ముందుంటున్నారనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. ఇంజనీరింగ్ ట్రేడ్‌లు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు టెక్నీషియన్స్, ఫ్లోర్‌మెన్ కొలువులు లభిస్తున్నాయి. వీరికి నెలకు రూ.20వేల వరకూ వేతనం అందుతోంది. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్ వంటివి పూర్తి చేసిన వారికి చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఆఫీస్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు లభిస్తున్నాయి.
- ఐటీఐ ఉత్తీర్ణులు స్వయం ఉపాధి పొందే అవకాశం కూడా ఉంది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ వంటి ట్రేడ్‌లు పూర్తి చేసుకున్న విద్యార్థులు సొంతంగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించుకోవచ్చు.

మూడు మహిళా ఐటీఐలు

తెలంగాణ రాష్ట్రంలో మహిళా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మూడు ఐటీఐలను కేటాయించారు. మహబూబ్‌నగర్, హైదరాబాద్ సంతోష్ నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలతోపాటు హన్మకొండలోని మరో ప్రైవేట్ ఐటీఐని మహిళా ఐటీఐలుగా గుర్తించారు.

ఫీజులు ఇలా

తెలంగాణ ఐటీఐల్లో పట్టణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు రూ.16,500, నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు రూ.13,200 ఫీజుగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు రూ.15వేలు, నాన్–ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు రూ.12వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి ట్యూషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు, వెబ్ ఆప్షన్స్ చివరి తేదీ: జూన్ 10, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://iti.telangana.gov.in

క్లుప్తంగా...

ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతం కావాలి

కేంద్ర మంత్రి భగవంత్ ఖుబా



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ లాంటి మహమ్మారులను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పరిశోధనలు చేయాల్సిన అవసరముందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా స్పష్టం చేశారు. భారత్ నిర్వహిస్తున్న జీ-20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులను సమర్థంగా ఎదుర్కోవాలంటే ఇప్పుడున్న ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరముందని స్పష్టం చేశారు. ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు ముందస్తు సంసిద్ధత అవసరమని, ఇందుకు అంతర్జాతీయ స్థాయిలో దేశాల మధ్య పరస్పర సహకారం ఉండాలని తేల్చి చెప్పారు. పరిశోధనలకు అంతర్జాతీయ స్థాయిలో పరస్పర సహకారం అందించుకోవడం వల్ల వనరులను సమర్థంగా వినియోగించుకోవడం సాధ్యమవుతుందన్నారు.కార్యక్రమంలో కేంద్ర ఫార్మా విభాగం కార్యదర్శి ఎస్.అపర్ణ, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఆచార్య కొలకలూరి ఇనాక్ బహుముఖ ప్రజ్ఞాశాలి

- భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
- ఇనాక్‌కు జీవన సాఫల్య పురస్కారం



ఇనాక్‌ను సత్కరిస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ

నాంపల్లి (హైదరాబాద్): ఆచార్య కొలకలూరి ఇనాక్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. యువకళావాహిని సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ ఎన్వీ రమణ, ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు జీవన సాఫల్య పురస్కారంతో పాటు స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. నిత్య సంఘర్షణతో రాటు తేలిన వ్యక్తి ఇనాక్ అని అభివర్ణించారు. డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, ఏపీ అసెంబ్లీ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, మాజీ సీఎస్ కాకి మాధవరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఎల్‌పీయూకు 38వ స్థానం

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఐఆర్‌ఎఫ్-2023 ర్యాంకింగ్స్‌లో ఢిల్లీ 'లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ'38వ స్థానం సంపాదించుకుందని ఎల్‌పీయూ చాన్స్‌లర్ డాక్టర్ అశోక్‌కుమార్ మిట్టల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వర్సిటీలకు ఇచ్చిన ర్యాంకింగ్స్‌లో ఎల్‌పీయూ ఈ ఏడాది 9 ర్యాంకులు ఎగబాకి 38వ ర్యాంక్‌కు చేరుకుందన్నారు. ఎల్‌పీయూకు చెందిన స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, లా 16, ఫార్మసీ 17, వ్యవసాయం 27, మేనేజ్‌మెంట్ 32, పరిశోధన సంస్థ 42వ స్థానంలో నిలిచాయని వెల్లడించారు. ఇంజనీరింగ్‌లో సైతం టాప్-50లో ఉందన్నారు.

11న తెలంగాణ సాహిత్య దినోత్సవం: జూలూరి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పదేళ్ల ప్రగతి, అస్తిత్వంపై 'తెలంగాణ సాహిత్య దినోత్సవం'ను ఈనెల 11న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ తెలిపారు. కవులు తమ గళమెత్తి తెలంగాణ అభివృద్ధిని ప్రపంచానికి చాటి చెబుతారన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు కవిసమ్మేళనాలు జరుగుతాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలకు గుర్తుగా కవితలు, పద్యాలతో తెలంగాణ సాహిత్య అకాడమీ సంకలనం తీసుకువస్తోందన్నారు. దాశరథి, కాళోజీ, సినారె, బిరుదురాజు రామరాజు, భాగ్యరెడ్డి వర్మ, కొమురాజు, బిఎన్ శాస్త్రి, బోయ జంగయ్య, జాతశ్రీ లాంటి తెలంగాణ తేజోమూర్తులను గుర్తు చేసుకుంటూ వారి ఖ్యాతిని తెలిపే విధంగా స్థానికంగా కార్యక్రమాలను కూడా రూపొందించుకోవచ్చని తెలిపారు. వచన, పద్య కవిత విభాగాల్లో ప్రథమ బహుమతి రూ.1,00,116, ద్వితీయ బహుమతి రూ. 75,116, తృతీయ బహుమతి రూ. 60,116, చతుర్థ బహుమతి రూ.50,116, పంచమ బహుమతి రూ. 30,116లు ఇవ్వనున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపికచేస్తుందని, కవి సమ్మేళనాల్లో పాల్గొన్న కవులు పద్యాలు, కవితలను రాష్ట్ర స్థాయి పోటీకి పంపాలని సూచించారు.

దేశంలో నంబర్ 1 ఐఐటీ-మద్రాస్

14వ ర్యాంకులో ఐఐటీ-హైదరాబాద్, 20వ స్థానంలో హెచ్‌సీయూ

మొదటి వంద ర్యాంకుల్లో నిట్, ఉస్మానియా, ఆంధ్రా యూనివర్సిటీలు

- అత్యుత్తమ వర్సిటీల విభాగంలో హెచ్‌సీయూకి పదో స్థానం
- ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ-హైదరాబాద్‌కు 8వ స్థానం, ఇన్నోవేషన్‌లో మూడోస్థానం
- ర్యాంకింగ్ నివేదిక విడుదల చేసిన కేంద్ర మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్

సాక్షి, న్యూఢిల్లీ/రాయదుర్గం: దేశంలోని విద్యాసంస్థల్లో అన్ని విభాగాల్లో కలిపి ఐఐటీ-మద్రాస్ అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచింది. మొత్తం విభాగాల్లో ఐఐటీ-మద్రాస్‌కు మొదటిస్థానం దక్కడం ఇది ఐదోసారి కాగా, ఇంజనీరింగ్ విభాగంలోనూ వరుసగా ఎనిమిదోసారి నంబర్‌వన్ స్థానాన్ని నిలుపుకోవడం విశేషం. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్-2023) నివేదికను విద్య, విదేశీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి డాక్టర్ రాజ్‌కుమార్ రంజన్ సింగ్ సోమవారం విడుదల చేశారు. బోధనా అభ్యాసం, మౌలిక వసతులు, పరిశోధన, వృత్తిపరమైన అభ్యాసం, గ్రాడ్యుయేషన్ ఫలితం, విద్యార్థులు పొందే ఉపాధి అవకాశాలు వంటి అంశాల ఆధారంగా విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫార్మసీ, లా, మెడికల్ కాలేజీలకు ర్యాంకులను ప్రకటించారు. వీటిలో అన్ని కేటగిరీల్లో ఐఐటీ-మద్రాస్ తొలిస్థానంలో ఉండగా, ఐఐఎస్సీ-బెంగళూరు రెండో స్థానంలో, ఐఐటీ-ఢిల్లీ మూడో స్థానంలో నిలిచాయి. ఇక తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఐఐటీ-హైదరాబాద్ 14వ స్థానం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) 20వ స్థానం, నిట్-వరంగల్ 53, ఉస్మానియా యూనివర్సిటీ 64, వడ్డేశ్వరంలోని కేఎల్ కాలేజ్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీ 50, వైజాగ్‌లోని ఆంధ్రా యూనివర్సిటీ 76వ స్థానంలో నిలిచాయి. ర్యాంకింగ్స్ కోసం 200కు పైగా యూనివర్సిటీలను సర్వేచేశారు. దరఖాస్తు చేసిన దాదాపు 8వేల సంస్థల నుంచి 2023 ర్యాంకులను ప్రకటించారు.



అత్యుత్తమ వర్సిటీల విభాగంలో...

ఇక అత్యుత్తమ వర్సిటీల విభాగంలో ఐఐఎస్సీ-బెంగళూరు తొలి స్థానంలో ఉండగా, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 10వ స్థానం, ఉస్మానియా యూనివర్సిటీ 36, హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 84వ స్థానంలో నిలిచింది. ఏపీలోని ఆంధ్రా యూనివర్సిటీ 43, శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ 60వ స్థానం దక్కించుకున్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ-హైదరాబాద్ 8వ, నిట్-వరంగల్ 21వ స్థానంలో ఉన్నాయి. పరిశోధన విభాగంలో ఐఐటీ-హైదరాబాద్ 14వ స్థానంలో, హెచ్‌సీయూ 25వ స్థానంలో నిలిచాయి. మేనేజ్‌మెంట్ విభాగంలో ఐఐఎం-వైజాగ్ 29వ, ఐసీఎఫ్ఏఐ-హైదరాబాద్ 40వ స్థానంలో ఉన్నాయి. ఫార్మసీలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్-హైదరాబాద్ తొలి స్థానంలో ఉండగా, న్యాయ విభాగంలో నల్సార్ యూనివర్సిటీ 3వ స్థానంలో ఉంది. ఇన్నోవేషన్ విభాగంలో ఐఐటీ-హైదరాబాద్ 3వ స్థానంలో నిలిచింది.

వ్యవసాయ విభాగంలో..

ఇక వ్యవసాయం, దాని అనుబంధ విభాగాల్లో గుంటూరులోని ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ 20వ, వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ 31వ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్-హైదరాబాద్ 32వ స్థానంలో ఉన్నాయి. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ కోసం https://www.nirfindia.org/ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

సమష్టి కృషితోనే సాధ్యం

జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి గుర్తింపే లక్ష్యం. సమష్టి కృషితోనే సాధ్యం. దేశంలో టాప్-10 విశ్వవిద్యాలయాల్లో హెచ్‌సీయూకు మళ్లీ ర్యాంక్‌ను పొందడం ఆనందంగా ఉంది. ఉత్తమ పద్ధతులు, నాణ్యతతో కూడిన బోధన, పరిశోధనల కారణంగా ఈ ర్యాంకు సాధ్యమైంది. భవిష్యత్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు కృషి చేస్తాం. - ప్రొ. బీజే రావు, వైస్‌చాన్స్‌లర్ హెచ్‌సీయూ

మానవాళి కోసం టెక్నాలజీ

ఈ విజయంలో విద్యార్థులు, అధ్యాపకులతోపాటు, పూర్వ విద్యార్థుల కృషి కూడా ఉంది. మానవాళి కోసం సాంకేతిక పరిజ్ఞానం అనే నినాదంతో ఐఐటీహెచ్ ముందుకెళ్తోంది. - ప్రొ. బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ డైరెక్టర్

సైబర్ సేఫ్టీకి 5S సూత్రం

రోజువారీ జీవితంలో స్మార్ట్‌ఫోన్లలోనే సగం సమయం గడిచిపోతోంది. సోషల్ మీడియా యాప్స్ వాడకం మొదలు ఆన్‌లైన్ ఆర్డర్లు, ఆన్‌లైన్ బ్యాంకు లావాదేవీల వరకు పని ఏదైనా ఫోన్, ఇంటర్నెట్ వినియోగం తప్పనిసరైంది. టెక్నాలజీ వాడకంతో ఎన్ని సౌకర్యాలు ఉన్నాయో అంతేస్థాయిలో సైబర్ ముప్పు పొంచి ఉంటుంది. అందుకే సైబర్ జమానాలో సేఫ్‌గా ఉండేందుకు తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొన్ని సూచనలు చేసింది. 5ఎస్ సూత్రాన్ని పాటిస్తే సురక్షితంగా ఉండొచ్చని పేర్కొంది.

సాక్షి, హైదరాబాద్

- కీలక సూచనలు చేసిన సైబర్ సెక్యూరిటీ పోలీసులు
- పాస్‌వర్డ్‌ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచన



ఏమిటి ఆ 5ఎస్?

స్ట్రాంగ్ అండ్ యూనిక్ పాస్‌వర్డ్, సెక్యూర్ నెట్‌వర్క్, సెక్యూర్ వెబ్‌సైట్స్ లేదా యాప్స్, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్, సస్పీషియస్ లింక్ అలర్ట్...కలిపి 5 ఎస్‌లుగా పోలీసులు సూత్రీకరించారు.

స్ట్రాంగ్ పాస్‌వర్డ్

మనం సోషల్ మీడియా ఖాతాలకు, ఆన్‌లైన్ బ్యాంకు ఖాతాలకు, ఈ-మెయిల్స్‌కు వేర్వేరు పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం ఉత్తమం. ఒకటే పాస్‌వర్డ్‌ను అన్నింటికీ పెట్టడం రిస్క్ అని గుర్తించాలి. పాస్‌వర్డ్‌లో వీలైనంత వరకు మన పేరు, బర్త్‌డే తేదీలు, పిల్లల పేర్లు లేకుండా చూసుకోవడం ఉత్తమం. పాస్‌వర్డ్‌ను అంకెలు, క్యారెక్టర్లు, పెద్ద, చిన్న అక్షరాల మిళితంగా పెట్టుకోవాలి. పాస్‌వర్డ్‌లను ఇతరులకు షేర్ చేయవద్దు.

సెక్యూర్ వెబ్‌సైట్స్, యాప్స్, సెక్యూర్ నెట్‌వర్క్..

మనం వాడే వెబ్‌సైట్‌లు, డౌన్‌లోడ్ చేసుకొనే యాప్స్ సరైనవేనా అన్నది ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. యాప్‌లను డౌన్‌లోడ్ చేసే ముందు ఆ యాప్ రేటింగ్ పరిశీలించాలి.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్..

మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్‌తో అప్‌డేట్ చేసుకోవాలి. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ వల్ల సైబర్ దాడుల ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. సరైన యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌లను వినియోగించుకోవాలి.

సస్పీషియస్ లింక్ అలర్ట్...

మనకు మెసేజ్‌లు, వాట్సాప్ సందేశాలు, ఈ-మెయిల్స్ రూపంలో వచ్చే మెసేజ్‌లలోని అనుమానాస్పద లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు. చాలా తక్కువ అక్షరాలతో ఉండే లింక్‌లు చాలా వరకు అనుమానాస్పదమైనవని గుర్తుంచుకోవాలి. అదేవిధంగా అక్షర దోషాలు ఉన్న లింక్‌లు సైతం అనుమానాస్పదమైనవని తెలుసుకోవాలి.

బోధకుల కొరత... పడిపోయిన ర్యాంకులు

జాతీయ ర్యాంకుల్లో పడిపోయిన రాష్ట్ర వర్సిటీలు

- ఓవరాల్ ర్యాంకులో ఓయూ 46 నుంచి 64కు.. వర్సిటీ కేటగిరీలో 22 నుంచి 36కు..
- వరంగల్ నిట్‌లోనూ వెనుకబాటే..
- ర్యాంకుల్లో ఐఐటీ-హైదరాబాద్ దూకుడు
- ఇంజనీరింగ్ విద్యలో జేఎన్‌టీయూ వెనుకంజ



సాక్షి, హైదరాబాద్: అధ్యాపకుల కొరత రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు మరోసారి రుజువైంది. తాజాగా నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్-2023) నివేదికలో దశాబ్దాల చరిత్ర ఉన్న ఉస్మానియాతోపాటు జేఎన్‌టీయూహెచ్ ర్యాంకులు కూడా తగ్గాయి. జాతీయ ఓవరాల్ ర్యాంకుల్లోనే కాదు.. పరిశోధన, యూనివర్సిటీ స్థాయి ప్రమాణాల్లోనూ విశ్వవిద్యాలయాలు వెనుకంజలో ఉన్నాయి. అన్నింటికన్నా ఐఐటీ-హైదరాబాద్ అన్ని విభాగాల్లోనూ దూసుకుపోవడం విశేషం. గత మూడేళ్ల విద్యా ప్రమాణాల ఆధారంగా ఎన్‌ఐఆర్‌ఎఫ్ ఏటా ర్యాంకులు ఇస్తుంది.

ఐఐటీ-హైదరాబాద్ దూకుడు.. ఓయూ వెనక్కు

జాతీయస్థాయిలో వంద యూనివర్సిటీల్లో ఐఐటీ-హైదరాబాద్ గత ఏడాది మాదిరిగానే 14వ స్థానంలో నిలిచింది. ఈ సంస్థలో 2019లో 144 మంది రూ.17 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉపాధి పొందారు. 2020-21లో 185 మంది రూ.16 లక్షలకుపైగా, 2021-22లో 237 మంది రూ.20 లక్షలకుపైగా ప్యాకేజీతో ఉపాధి పొందారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోనూ విద్యార్థులు అత్యధికంగా రూ.40 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉపాధి పొందారు. నిట్ వరంగల్‌లో అత్యధికంగా యూజీ విద్యార్థులు ఉపాధి అవకాశాలు సొంతం చేసుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఈ సంస్థ మంచి ప్రమాణాలు నెలకొల్పినట్టు నివేదిక పేర్కొంది. అయినప్పటికీ ఈ సంస్థలో అధ్యాపకుల కొరత వల్ల రీసెర్చ్‌లో వెనుకబడింది. ఫలితంగా నిట్ వరంగల్ జాతీయర్యాంకు 2022లో 45 ఉండగా, ఈసారి 53కు చేరింది. ఉస్మానియా వర్సిటీ ఓవరాల్ ర్యాంకులో గత ఏడాది 46 ఉంటే, ఈసారి 64 దక్కింది. ఇక్కడా పరిశోధనల్లో నెలకొన్న మందకొడితనమే జాతీయ ర్యాంకుపై ప్రభావం చూపింది. ఈసారి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు ఓవరాల్ ర్యాంకులో గతంలో మాదిరిగానే 20వ ర్యాంకు వచ్చింది. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 10 ర్యాంకుతో నిలకడగా ఉంది. హైదరాబాద్ ట్రిపుల్‌ఐటీ జాతీయస్థాయిలో 84వ ర్యాంకు పొందింది.

ఇంజనీరింగ్‌లో వెనుకబాటుతనం

ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ-హైదరాబాద్ సరికొత్త బోధన విధానాలతో 9లో ఉన్న ర్యాంకును 8కి తేగలిగింది. ఎక్కువ ఇంజనీరింగ్ అనుబంధ కాలేజీలున్న జేఎన్‌టీయూ-హెచ్ 76 నుంచి 98కి పడిపోయింది. నిట్ వరంగల్ 21వ ర్యాంకుతో నిలిచింది. ఈసారి సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీ జాతీయస్థాయి కాలేజీల విభాగంలో 98 ర్యాంకును సాధించింది. పరిశోధన విభాగంలో ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ర్యాంకు 12 నుంచి 14కు చేరింది.

అధ్యాపకుల కొరతే కారణం: ప్రొ.డి.రవీందర్, ఉస్మానియా వర్సిటీ వీసీ

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో వెనుకబడటానికి ప్రధాన కారణం అధ్యాపకుల కొరత. కొన్నేళ్లుగా నియామకాలు లేకపోవడం వల్ల పరిశోధనలో వెనుకబడిపోతున్నాం. అయినప్పటికీ బోధనలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

ర్యాంకు సాధించని వ్యవసాయ వర్సిటీ

దేశంలో టాప్-40 వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, సంస్థల్లో రాష్ట్రానికి చెందిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చోటు దక్కలేదు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో వ్యవసాయ వర్సిటీ లేకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. దీనిపై వర్సిటీ వర్గాలను ఆరా తీయగా, సమాధానం లభించలేదు. వర్సిటీ ప్రమాణాలు తగ్గుతున్నాయన్న చర్చ జరుగుతోంది.

అడ్రస్ లేని మెడికల్ కాలేజీలు

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో దేశంలో టాప్ 50లో చోటు దక్కని వైనం

సాక్షి, హైదరాబాద్: ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్ చేసిన దేశంలోని టాప్-50 మెడికల్ కాలేజీల్లో రాష్ట్రానికి చెందిన ఏ ఒక్క మెడికల్ కాలేజీ చోటు దక్కించుకోలేకపోయింది. రాష్ట్రం నుంచి నాలుగు కాలేజీలు... ఈఎస్‌ఐ మెడికల్ కాలేజీ, కరీంనగర్‌లోని చలిమెడ ఆనందరావు మెడికల్ కాలేజీ, హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి, అపోలో మెడికల్ కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. మిగిలిన కాలేజీలకు కనీసం దరఖాస్తు చేసుకునే స్థాయి కూడా లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. టాప్-50 ర్యాంకింగ్స్‌లో ఢిల్లీ ఎయిమ్స్ మొదటి ర్యాంకు, చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ రెండో ర్యాంకు, తమిళనాడులోని వెల్లూరుకు చెందిన క్రిస్టియన్ మెడికల్ కాలేజీ మూడో ర్యాంకు, బెంగళూరుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ నాలుగో ర్యాంకు, పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఐదో ర్యాంకు సాధించాయి. డెంటల్ ర్యాంకుల్లో మాత్రం తెలంగాణకు ఊరట కలిగింది. సికింద్రాబాద్‌లోని ఆర్మీ కాలేజీ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌కు 33 ర్యాంకు దక్కింది. 176 మెడికల్ కాలేజీలు, 155 డెంటల్ కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయి. రాష్ట్రంలో వైద్య పరిశోధన దాదాపు ఎక్కడా లేదని, అలాగే, విద్యార్థులు-అధ్యాపకుల నిష్పత్తి కూడా దారుణంగా ఉందన్న విమర్శలున్నాయి.

ఆటకు అంత్యక్రియలు!



- వైకుంఠధామమే క్రీడాప్రాంగణమట..
- బోర్డు పెట్టి చేతులు దులుపుకున్న వైనం

మరిపెడ రూరల్: ఒకవైపు కాలుతున్న శవాలు.. మరోవైపు క్రీడాకారులు ఆటలు.. ఇదేమిటనుకుంటున్నారా.. పాలకుల, అధికారుల అవినీతికి ఈ దృశ్యం ఓ పరాకాష్ట. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో వైకుంఠధామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. దీన్ని చూసిన గిరిజన క్రీడాకారులు విస్మయానికి గురవుతున్నారు. ప్రతి గ్రామానికి శ్మశాన వాటిక, యువతకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామాల్లో అందుబాటులో ఉన్న స్థలాలను వేర్వేరుగా ఎంపిక చేసి ఉపాధి హామీ నిధులతో నిర్మించింది. కానీ ఇక్కడ శ్మశానవాటికలోనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి.. 'వైకుంఠధామం' బోర్డు కింద 'క్రీడా ప్రాంగణం' బోర్డు కూడా ఏర్పాటు చేసి ఉపాధి నిధులు స్వాహా చేసినట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ఏఐఎస్‌ల 'కేడర్' కేసు జూలై 3కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు ఆలిండియా సర్వీస్ (ఏఐఎస్) కేడర్ కేటాయింపులకు సంబంధించి దాఖలైన కేసుల విచారణ జూలై 3కు వాయిదా పడింది. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్‌ల పంపకం జరిగింది. కాగా, నాటి నుంచీ ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం కొనసాగుతోంది. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. అడిషనల్ సొలిసిటర్ జనరల్ అందుబాటులో లేరని, తమ వాదనలు వినిపించేందుకు సమయం కావాలని కేంద్ర ప్రభుత్వ తరపు న్యాయవాది కోరారు. దీంతో ధర్మాసనం.. తదుపరి విచారణను జూలై 3కు వాయిదా వేసింది.

- ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గౌహతి-సికింద్రాబాద్ మధ్య ఎస్‌సి రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈ ట్రైన్(02605) ఈ నెల18 సాయంత్రం 7.25కి గౌహతిలో బయలుదేరి మంగళవారం సాయంత్రం 4.30కి సికింద్రాబాద్ చేరుతుంది.

నేడు పోలీస్ పరీక్షల రీకౌంటింగ్ ఫలితాలు

రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 1,338

- అన్ని విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు కలిపి దరఖాస్తు
- నేటి నుంచి ఈనెల 8 వరకు తుది దరఖాస్తులో ఎడిటింగ్‌కు అవకాశం
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ప్రకటన

సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లోని ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు నిర్వహించిన తుదిరాత పరీక్ష ఫలితాల్లో రీ వెరిఫికేషన్, రీకౌంట్‌కు దరఖాస్తు చేస్తున్న అభ్యర్థుల ఫలితాలను మంగళవారం వెల్లడించనున్నారు. రీ కౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం మొత్తం 1,338 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు బోర్డు చైర్మన్ వివి శ్రీనివాసరావు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా వివిధ విభాగాల్లోని ఎస్సై అభ్యర్థుల్లో అర్థమెటిక్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల్లో 185 మంది, ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఏఎస్సై అభ్యర్థుల్లో అర్థమెటిక్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల్లో 113 మంది, సివిల్ ఎస్సై అభ్యర్థుల్లో జనరల్ స్టడీస్ సబ్జెక్ట్‌లో 106 మంది, తెలుగు, ఉర్దూ సబ్జెక్ట్‌ల్లో 30 మంది అభ్యర్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుకు పోటీపడుతున్న అభ్యర్థుల్లో జనరల్ స్టడీస్ కోసం రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరుతూ 844 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు వారివారి వ్యక్తిగత లాగిన్ ఐడీ ద్వారా రీకౌంటింగ్ ఫలితాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.



ఎడిట్ ఆప్షన్లకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు ఫీజు

బోర్డు అధికారులు ముందు నుంచి చెబుతున్నట్టుగానే దరఖాస్తు సమయంలో ఏవైనా తప్పులుంటే సరిచేసుకునేందుకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ముందే ఎడిట్ ఆప్షన్ ఇస్తున్నారు. అయితే అందుకు అభ్యర్థులు ప్రత్యేకంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం అభ్యర్థుల దరఖాస్తును ఏ-టైప్ (అభ్యర్థి పేరు, జెండర్, కులం, ఈడబ్ల్యూఎస్ కోటా, ఫొటో, సంతకం, ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటాలోని వివిధ కేటగిరిల్లో వయస్సు మినహాయింపు), బి-టైప్ (అభ్యర్థి ఇంటిపేరు, ఆధార్ నంబర్, పుట్టిన తేదీ, పుట్టుమచ్చలు, ఎస్‌ఎస్‌సీ రూల్ నంబర్, ఈ మెయిల్ ఐడీ, ఓబీసీ క్రిమిలేయర్/నాన్ క్రిమిలేయర్, ఇంటి అడ్రస్, విద్యార్హతలు వంటివి)గా విభజించారు. దీనిలో ఏ టైప్ సమాచారంలో ఎడిట్ ఆప్షన్ పొందేందుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 3వేలు, ఇతర అభ్యర్థులు రూ.5వేలు ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. అదేవిధంగా బి-టైప్ వివరాల్లో ఎడిటింగ్ కోసం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.2వేలు, ఇతర అభ్యర్థులు రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది. రెండింటిలో ఎడిటింగ్ కోరే వారు రెండు రకాలకు ఫీజులు వేర్వేరుగా చెల్లించాలి. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఈ నెల 8 రాత్రి 8 గంటల వరకు ఎడిట్ ఆప్షన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చైర్మన్ శ్రీనివాసరావు సూచించారు. ఇందులో ఏ-టైప్‌లోని వివరాలను టీఎస్ఎల్పీఆర్బీ , హైదరాబాద్ కార్యాలయంలోనే అధికారులు ఎడిట్ చేస్తారు. బి-టైప్‌లోని వివరాల ఎడిటింగ్ మాత్రం సర్టిఫికెట్ వెరిఫికేషన్ సమయంలో అభ్యర్థి సమక్షంలోనే ఆ జిల్లా ఎస్పీ లేదా కమిషనర్ సమక్షంలో చేస్తారు. ఎడిట్ ఆప్షన్ కోసం ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించిన రిసిప్ట్‌ను అభ్యర్థులు విధిగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఎడిటింగ్ పూర్తయిన వెంటనే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేస్తారు. ఎడిట్ ఆప్షన్‌కు ఇదే చివరి అవకాశం అని, సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయితే మరోమారు ఎడిటింగ్‌కు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, తగినన్ని పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.